శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి
రికార్డు స్థాయిలో ఏప్రిల్ జిఎస్‌టి వసూళ్లు 07
ఇరాన్‌ను తుడిచిపెట్టేందుకు ట్రంప్ మాస్టర్ ప్లాన్? 08

సంపుటి 09, సంచిక: 152 | శనివారం | 02-05-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# కారు మబ్బుల్లో...
# కాంతిరేఖ ఎర్రజెండా



## పోరాట ఫలితమే 8 గంటల పనిదినం

- 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలి
- ఒక్క పర్మినెంట్ ఉద్యోగి వేతనంతో నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పెట్టుకుంటున్నారు
- వీటికి వ్యతిరేకంగా పోరాటాలు ఆపొద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- మేడే సందర్భంగా ఎఐటియుసి భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచం నేడు కారుమబ్బులతో నిండిపోయి ఉందని, ఈ కారు మబ్బుల్లో ఏదైనా ఒక కాంతి ఉందంటే అది ఎర్ర జెండా మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ప్రతి మనిషీ బాగుండాలనేది కమ్యూనిజం సిద్ధాంతం అని, కమ్యూనిజానికి మూల స్థంభం కార్మిక వర్గం అని కొనియాడారు. అంతర్జాతీయ 141వ కార్మికుల దినోత్సవం(మే డే) పురస్కరించుకొని హైదరాబాద్ హిమాయత్ నగర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ జెండా ఎగురవేసి, అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఏప్రిల్‌లో అమలులోకి తీసుకువచ్చిన నాలుగు

తరువాయి 8లో

## వాణిజ్య సిలిండర్ ధర
# రూ.993 పెంపు



- గత రెండు నెలల్లోనే మూడుసార్లు ధరలు పెంచిన కేంద్రం
- హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాలపై తీవ్ర ప్రభావం
- భారాన్ని వినియోగదారులపై మోపనున్న వ్యాపారులు

న్యూఢిల్లీ : నాలుగు రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలపై తీవ్ర భారం మోపింది. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతాయని ప్రతిపక్ష పార్టీలు ముందే హెచ్చరించాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం పరిస్థితులు భారత్‌పై తీవ్రంగా పడ్డాయన్న సాకుతో ఇంధన ధరలను పెంచింది. ఈ నేపథ్యంలో వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కిలోల ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వ చమురు సంస్థలు భారీగా పెంచాయి. ఒక్క సిలిండర్‌పై సగటున రూ.993 పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ పెరిగిన ధరలు మే 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ పెంపుతో దేశంలోని ప్రధాన నగరాల్లో కమర్షియల్ గ్యాస్

తరువాయి 8లో

## సామాన్యులపై భారం మోపడమే



- గ్యాస్ ధర పెంపుపై ఖండన
- ఉపసంహరించే వరకూ పోరాడతామని కేంద్రానికి సిపిఐ హెచ్చరిక

కేంద్రం వాణిజ్య వినియోగ గ్యాస్ ధరలను భారీగా పెంచడాన్ని సిపిఐ జాతీయ సమితి తీవ్రంగా ఖండించింది. ఒకేసారి అసాధారణ రీతిలో రూ.993 పెంపుతో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.3100 చేరడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు

తరువాయి 8లో

## ఇది ‘ఎన్నికల బిల్లు’

- త్వరలోనే పెట్రోల్, డీజిల్ వంతు
- వాణిజ్య సిలిండర్ ధర పెంపుపై మండిపడిన కాంగ్రెస్



వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరల పెంపుపై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఇది ఒక ‘ఎన్నికల బిల్లు’ అని, తదుపరి దెబ్బ పెట్రోల్, డీజిల్‌పై ఉంటుందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణం వేడి విరుచుకు పడుతుందని తాను ముందే హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. ‘శుక్రవారం వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర రూ.993 పెరిగింది. ఒక్క రోజులో జరిగిన అతిపెద్ద పెంపు ఇదే. ఇది ఎన్నికల బిల్లు‘ అని రాహుల్ ఎక్స్‌లో హిందీలో

తరువాయి 8లో



## ఆర్టీసీ మనుగడకు
# కలిసి రండి

- గుర్తింపు సంఘం ఎన్నికలు, ప్రభుత్వంలో విలీనంపైన సమగ్ర కార్యాచరణ రూపొందించండి
- కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన
- పిఆర్‌సి అంశాన్ని ప్రభుత్వమే పరిష్కరిస్తుందని హామీ
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సిఎం సూచించారు. పిఆర్‌సి అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్‌టిసి కార్మిక సంఘాల ప్రతినిధులు

తరువాయి 8లో

## త్వరలో ఉద్యోగుల సమస్యలపై
# సానుకూల నిర్ణయం

- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోంది
- మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి త్వరలో వివరాలు వెల్లడిస్తాం
- ఉద్యోగులకు ఉపముఖ్యమంత్రి భట్టి హామీ
- హర్షం వ్యక్తంచేసిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని, పిఆర్‌సి,డిఎ,హెల్త్ కార్డులు, దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ మంత్రివర్గ ఉప సంఘంలో సమగ్రంగా చర్చించి, త్వరలోనే ఉద్యోగులకు చెబుతామని, సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని భట్టి హామీనిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల సమస్యలపైన భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిఎం సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉద్యోగులు ఒక వారధిగా పని చేస్తున్నారని, ప్రజా ప్రభుత్వం అమలు

తరువాయి 8లో



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై
# జూన్ 2 నాటికి తుదిరూపు

- ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లేకుండా స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- అందరూ ఒకే వేదికపై వచ్చి జెఎసి ఏర్పాటు చేసుకుంటే సమస్యకు పరిష్కారం సులభం
- సమాచారశాఖ మంత్రి పొంగులేటి స్పష్టీకరణ
- హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు ప్రభుత్వం త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం నిజాయితీతో కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి, జూన్ 2 నాటికి సమస్యకు తుది పరిష్కారం తీసుకువస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్, తెలంగాణ హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీల ఏర్పాట్లు, సభ్యుల సంఖ్య, అర్హతలపై వివరాలు తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులు ఒకే వేదికపైకి వచ్చి జెఎసి ఏర్పాటు చేసుకుంటే సమస్యల పరిష్కారం సులభమవుతుందని సూచించారు. సంఘాలకు సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు

తరువాయి 8లో

లారీ కిందకు చొచ్చుకెళ్లిన కారు
## ఆరుగురు దుర్మరణం

శంషాబాద్‌లోని ఒఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

ప్రజాపక్షం/రంగారెడ్డి

ఒఆర్‌ఆర్‌పై విషాదం చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని పెద్ద గోల్కొండలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్) ఎగ్జిట్ నంబర్ 16 వద్ద నిలిపివున్న లారీని అతివేగంగా దూసుకొచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు,మహిళలు ఉన్నట్లు స్థానిక పోలీస్ అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు మృతదేహాలు కారు శిథిలాల్లో

తరువాయి 8లో

## శాంతిభద్రతల పరిరక్షణకు
# అత్యాధునిక విధానాలు



- సమష్టి నాయకత్వంతో సమస్యలను దీటుగా ఎదుర్కొంటాం
- పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లోపాలను సరిదిద్దుకోవాలి
- డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలీసు అధికారుల మధ్య ఉన్న సమన్వయ లోపాలను సరిదిద్దుకుని సమష్టి నాయకత్వంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు, నేరాలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని డిజిపి సి.వి. ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. లక్డీకాపూల్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా సమావేశంలో సివి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ పోలీసు శాఖ విప్లవాత్మక మార్పులతో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని,

తరువాయి 8లో

# భారీ అగ్నిప్రమాదం

- కిలోమీటరు మేర దావానలం
- దగ్ధమైన పామాయిల్ తోట
- కాలి బూడిదైన వ్యవసాయ బోరు మోటార్లు, కేబుళ్లు, పైపులు
- 4 వ్యవసాయ షెడ్లు దగ్ధం
- లక్షల్లో రైతుల ఆస్తి నష్టం
- నల్లగొండ జిల్లా పల్లెపహాడ్ గ్రామంలో ప్రమాదం



ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదం రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లే దారిలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు బలమైన గాలులకు తోడు కిలోమీటరు మేర శరవేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డికి చెందిన పామాయిల్ తోట పూర్తిగా అగ్గికి బుగ్గయింది. కాతకు సిద్ధంగా ఉన్న వందలాది పామాయిల్ చెట్లు కాలిబూడిదయ్యాయి. అంతేకాకుండా దారి పొడవునా రైతులకు చెందిన సుమారు 25 వ్యవసాయ బోర్ల మోటార్లు, కేబుళ్లు, పైపులతో పాటు 4 వ్యవసాయ షెడ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే షార్ట్ సర్క్యూట్ లేదా గుర్తుతెలియని

తరువాయి 8లో

# సామాన్యుడిపై కేంద్రం దొంగ దెబ్బ

ఊహించినట్లుగానే కేంద్రంలోని మోదీ సర్కార్ ఐదు శాసనసభల ఎన్నికల పోలింగ్ ముగియగానే గ్యాస్ ధరలను అమాంతం పెంచేసింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా రూ.993 ధరల మోత మోగించింది. ఒకేసారి ఏకంగా వెయ్యి రూపాయల దరిదాపుల్లో పెంచడం అసాధారణం. గ్యాస్ ధరల పెంపులో ఇది సరికొత్త రికార్డు. రెండు నెలల్లోనే వాణిజ్య గ్యాస్ ధరను నాలుగుసార్లు పెంచింది మోదీ సర్కార్. దీంతో ధర దాదాపు రెట్టింపైంది. ఈ ఏడాది జనవరి మాసంలో హైదరాబాద్‌లో రూ.1,912గా ఉన్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర, తాజా పెరుగుదలతో రూ.3,250కి చేరింది.

గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలను పెంచలేదని, కేవలం వాణిజ్య గ్యాస్ సిలిండర్‌లపైనే పెంచామన్న బిజెపి నేతల సమర్థనలు డొల్ల వాదనలుగా తేలిపోతున్నాయి. నిజమే గృహావసరాల గ్యాస్ ధరలు పెంచలేదు. కానీ, ఇరాన్‌పై రెండు నెలల క్రితం అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం మొదలెట్టినప్పటి నుంచి అవసరమైన మేరకు సిలిండర్‌ల సరఫరా జరుగుతుందా? కొత్త సిలిండర్ రావాలంటే నెలన్నరకు పైగా సమయం పడుతున్న విషయం ఏ ఇంట్లో అడిగినా చెబుతారు. గృహసిలిండర్ ధర పెంచకుండా, దొడ్డిదారిలో ఆ మొత్తాన్ని వాణిజ్య సిలిండర్‌పై మోపి సామాన్యుల జేబుకి చిల్లుపెట్టారు.

ఇక వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరనే పెంచామని తప్పించుకోజూస్తున్న కమలనాథులకు దాని ప్రభావం సామాన్యుల నడ్డిని ఎలా విరుస్తుందో తెలియంది కాదు. రెండు నెలల్లోనే టిఫిన్ సెంటర్‌లు, హోటళ్ళు, రెస్టారెంట్‌లలో ధరలు 15 నుంచి 20 శాతం పెరిగాయి. గ్యాస్, చమురు కొరత, ధరల పెరుగుదల కేవలం వాటికే పరిమితం కావు. అవి కాస్కేడింగ్ ఎఫెక్ట్(పర్యవసాన ప్రభావం) చూపిస్తాయి. అంటే రవాణా ఛార్జీలు పెరగడం, కూరగాయల ధరలు, వస్తువుల ధరలు పెరగడానికి దారితీస్తుంది. నిత్యావసరాల ధరల పెరుగుదలతో కుదేలవుతున్న మధ్య తరగతికి ఇది శరాఘాతమే.

వాణిజ్య గ్యాస్ ధర తాజా పెరుగుదలతో ప్రభావం వీధి వ్యాపారులపై పెద్ద ఎత్తునే ఉండే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల వరకు స్ట్రీట్ ఫుడ్ వ్యాపారస్తులు ఉంటారని అంచనా. రెండు నెలలకు తోడుగా, ఇప్పుడు గ్యాస్‌ధర వెయ్యి రూపాయలు పెరగడంతో వారు ధరలు రెట్టింపు చేయడం అనివార్యం. అంత భరించి తినే స్థోమత ఇప్పుడు సామాన్యులకు లేదనేది అంగీకరించాల్సిన వాస్తవం.

ధరల పెరుగుదలకు కేవలం యుద్ధమొక్కటే కారణమని కేంద్ర ప్రభుత్వం తప్పించుకోజూస్తోంది. విదేశాంగ, ఆర్థిక విధానాలలో తప్పటడుగులు ఇప్పుడు దుష్ఫలితాలను చూపిస్తున్నాయి. ఇటీవల కాలంలోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన స్థానం నాలుగు నుంచి ఆరుకు దిగజారింది. రూపాయి శరవేగంగా పతనమవుతోంది. గత ఏడాది ఏప్రిల్‌లో ఒక్క డాలర్‌తో మారకం విలువ రూ.84.78గా ఉండగా, నేడే రికార్డు స్థాయిలో పతనమై రూ.94.78కి చేరింది. త్వరలోనే రూ.100కు పడిపోయే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో పాలస్తీనాకు మద్దతునిచ్చిన విదేశాంగ విధానాన్ని యూ టర్న్ చేసి ఇజ్రాయెల్ వైపు మొగ్గేలా చేసింది మోదీ ప్రభుత్వం.

అలీనోద్యమ సారథిగా ఉన్న భారతదేశం నేడు ఇరాన్‌పై యుద్ధానికి కారణమైన అమెరికా, ఇజ్రాయెల్ పక్షం వహించటాన్ని ప్రపంచమంతా గమనిస్తూనే ఉంది. సంక్షోభం వైపు చూస్తున్న ఆర్థిక వ్యవస్థ ను పట్టించుకోకుండా వదిలేసి, అధికారం చుట్టే మోదీ, అమిత్‌షాలు పరిభ్రమిస్తున్నారు. తిమ్మిని బమ్మిని చేసి ఎన్నికలను గెలవడం, ప్రత్యర్థి పార్టీలను చీల్చడమనే పనిగా పెట్టుకున్నారు. కేవలం ఐదు శాసనసభల ఎన్నికల కోసం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకుండా ఆపారనేది సర్వవిదితమే. అయినప్పటికీ, వెంటనే అపఖ్యాతి ఎందుకని వాణిజ్య గ్యాస్ ధరల మాత్రమే పెంచి దయ చూపారు. మిగతా వాటి ధరల పెంపు ముచ్చట ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే మే 4వ తేదీ వరకు వాయిదా వేసారనే విషయం తెలిసేందుకు ఎంతో దూరం లేదు. ●



## మోదీ విఫల విదేశాంగ విధానంతోనే ధరాఘాతం

**ఎన్నికలు ముగిసిన ఒక రోజులోనే మోదీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపేలా ఎల్‌పిజి ధరలు అమాంతం పెంచేసింది. ఇలాంటి పరిణామాల గురించి సీపీఐ ముందుగానే హెచ్చరించింది. ఆకస్మికంగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరపై రూ.993 పెంచడంతో చిరు వర్తకులు, రెస్టారెంట్లు, హోటళ్లు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. మోదీ ఆలింగనాలతో సాగించే విఫల విదేశాంగ విధానమే దీనికి దారితీసింది.అంతర్జాతీయంగా అస్థిరంగా ఉన్న ఇంధన పరిస్థితుల్లో భారత్ ప్రయోజనాలను కాపాడటంలో మోదీ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైంది.**

- సిపిఐ ఎంపి సందోశ్ కుమార్



# అంతరిస్తున్న 'సీ చికెన్'

మన శరీరంలో గుండె చాలా ముఖ్యమైన అవయవం. దీని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే, మంచి ఆహారం తీసుకుని, సరైన లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వాలి. గుండెకి మేలుచేసే ఆహారం తీసుకోవాలి. అందుకోసం చేపలు తినమంటారు నిపుణులు. అందులో ప్రత్యేకమైనది ట్యూనా చేపలు. స్కాంబ్రిడే కుటుంబానికి చెందిన ట్యూనా శాస్త్రీయ నామం థున్నస్ ఆల్బాకేర్. సాధారణంగా వీటిని వాడుక భాషలో సూరలు అని కూడా పిలుస్తారు. ఐదు రకాల ట్యూనాలు ఉన్నా మన సముద్ర జలాల్లో లభించే రెక్క సూర (ఎల్లో ట్యూనా) అంటే విదేశీయులు లొట్టలేస్తారు. ట్యూనాలో ఉండే ఒకే ఒక ముల్లు తీసేస్తే మటన్ (మేక మాంసం) కంటే రుచిగా ఉండటమే కాకుండా.. తినడానికి వీలుగా ఉంటుంది. అందుకే ట్యూనాకు సీ చికెన్ అని మరో ముద్దు పేరు కూడా పెట్టుకున్నారు. ట్యూనా చేప మాంసంలో ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఉండటంతో రక్తపోటు తగ్గించడంలో క్రియాశీలకంగా ఉంటుంది.

ప్రపంచంలో లెక్కలేనన్ని చేపలు ఉన్నాయి. ఒక అధ్యయనం ప్రకారం 30 వేల కంటే ఎక్కువ జాతుల చేపలు ఉన్నాయి, కానీ వాటిలో ట్యూనా ఉనికి ప్రమాదంలో ఉంది. కాబట్టి డిసెంబర్ 2016లో, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రతి సంవత్సరం ప్రపంచ ట్యూనా దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. 2017లో మొదటిసారిగా ప్రపంచ ట్యూనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. తగ్గుతున్న ట్యూనా జనాభా గురించి అవగాహన పెంచడానికి, ట్యూనా చేపల సంరక్షణ, నిర్వహణను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ ప్రత్యేక దినోత్సవ వేడుకను ప్రారంభించింది. అప్పటి నుండి, ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు.

అధిక ప్రొటీన్లు, తక్కువ కేలరీలతో కూడిన కొవ్వు ఉండటంతో నరాలు పటుత్వం, శరీరంలో అవయవాలు బలీయంగా ఉండటానికి దోహదపడతాయి. వీటిలో విటమిన్ బి, బి12, విటమిన్ సి అధికంగా ఉండటంతో రోగనిరోధకత పెరుగుతుంది. పొటాషియం, మాంగనీస్, జింక్, సెలీనియం వంటి మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. వారానికి రెండు రోజులు ట్యూనాలను తీసుకుంటే కేన్సర్ దరిచేరదని మత్స్యశాఖ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆరోగ్యానికి బలవర్ధక ఆహారంగా వైద్యులు నిర్ధారించడంతోనే విదేశీయులు మన సముద్ర జలాల్లోని ట్యూనాలను దిగుమతి చేసుకుంటున్నారు. మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కేరళ, అండమాన్, లక్షద్వీప్ నుండి ఎగుమతి చేస్తున్నారు.

ట్యూనా చేపలు వేడి రక్తాన్ని కలిగి ఉంటాయి. అవి తమ శరీర ఉష్ణోగ్రతను పరిసరాలకు అనుగుణంగా నియంత్రించగలవు. ట్యూనా చేపలు గరిష్టంగా 6 అడుగుల పొడవు, 500 పౌండ్ల(సుమారు 225 కేజీల)బరువు ఉంటుంది. ట్యూనా చేపలు గంటకు 40 మైళ్ల కంటే ఎక్కువ వేగంతో ఈదుతాయి. ట్యూనా చేపల ద్వారా ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా కోట్ల రూపాయల విలువ వ్యాపారం జరుగుతోంది. ట్యూనాలు గుంపులుగా కలిసి ప్రయాణిస్తాయి, వీటిని 'స్కూల్స్' అని పిలుస్తారు. ఈ గుంపులలో వందలు లేదా వేల చేపలు ఉండవచ్చు.

**(మే 2 ట్యూనా చేపల దినోత్సవం)**

**సుధాకర్ ఏ.వి,**
9000674747

# మెర్సిడెస్ కారు, ట్రాక్టర్‌పై ఒకే రకమైన పన్నులా?



**రాజన్ క్షీర్‌సాగర్**
**అధ్యక్షుడు, ఎఐకెఎస్**
**9860488860**

భారతదేశంలోని ట్రాక్టర్లు కలిగిన రైతులు ప్రతి సంవత్సరం డీజిల్‌పై పన్నుల రూపంలో సుమారు రూ. 56,500కోట్లు చెల్లిస్తున్నారు. జాతీయ రహదారులపై ట్రాక్టర్లు తిరగడం నిషేధించబడినప్పటికీ, డీజిల్‌పై విధించే పన్నులు, ఇతరములలో రహదారి సెస్ కూడా కలిసి ఉంది. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాలలో వ్యవసాయ డీజిల్‌పై పన్ను మినహాయింపు లేదా రాయితీ లభిస్తుంది. కానీ, భారతదేశంలో ఆ విధంగా లేదు.

మీరు ఎన్నడూ హైవేపై ప్రయాణించకున్నప్పటికీ, మీరు ప్రతిరోజూ హైవే టోల్ చెల్లిస్తున్నట్లు ఒకసారి ఊహించుకోండి! మీ వాహనం దాని జీవితకాలమంతా పొలాల్లో, బురద దారుల్లో, పంట వరుసల మధ్యే గడుపుతుంది. అయినప్పటికీ, మీరు నింపే ప్రతి లీటర్ డీజిల్‌పై ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్ వే పన్ను విధిస్తుంది. భారతదేశంలోని కోటి ట్రాక్టర్లు కలిగిన రైతు కుటుంబాల దైనందిన వాస్తవమిది. భారతదేశ వ్యవసాయంలో ట్రాక్టర్ అత్యంత ముఖ్యమైన యంత్రం.

ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఏసి కార్యాలయాల్లో నిపుణులు ఆర్థిక విధానం, జిడిపి వృద్ధి, ద్రవ్యలోటులపై చర్చిస్తుంటే, పొలంలోని రైతు డీజిల్ కోసం పూర్తిగా అన్యాయమైన మూల్యం చెల్లిస్తున్నాడు. 140 కోట్ల మందికి ఆహారాన్ని ఉత్పత్తి చేసే ట్రాక్టర్ వినియోగించే ప్రతి లీటర్ డీజీల్‌పై ఇది అన్యాయమైన పన్ను.

దీనిని ఇకపై ఆపాల్సిందే. రైతుల డిమాండ్ స్పష్టం– వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లలో ఉపయోగించే డీజిల్‌పై అన్ని పన్నులను పూర్తిగా రద్దు చేయాలి. పాత సర్‌ఛార్జ్‌లను అన్నిటినీ తొలగించాలి. ట్రాక్టర్లను విలాసవంతమైన కార్లతో సమానం చేసే నిబంధనలను శాశ్వతంగా వీడ్కోలు చెప్పాలి! మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన రైతు బాబారావు ఇలా అంటున్నారు: 'నా ట్రాక్టర్ ప్రతి నెలా సగటున 300 లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తుంది. దానిపై నేను వేల రూపాయలు పన్నుగా చెల్లిస్తున్నాను. ఈ డబ్బు నా దగ్గరే ఉంటే, నేను దానిని నా పిల్లల చదువుల కోసం ఉపయోగించుకోగలను.'

### ట్రాక్టర్... మెర్సిడెస్ కారు కాదు

భారతదేశ డీజిల్ పన్నుల విధానం వెనుక ఒక ప్రాథమిక ద్వంద్వ ప్రమాణం ఉంది. విలాసవంతమైన కార్లు, ఎస్‌యువిల కోసం రూపొందించిన ఆర్థిక చట్రంలోనే సంవత్సరాలుగా ట్రాక్టర్లను కూడా ఎంచుతున్నారు. ప్రభుత్వ ఆర్థిక ఆలోచనలో, ట్రాక్టర్‌ను, మెర్సిడెస్‌ను, బిఎండబ్ల్యులతో కలిపి చూస్తున్నారు. ఇది కేవలం అహేతుకం మాత్రమే కాదు, ఇది ఒక విషాదకరమైన వాస్తవం. ట్రాక్టర్ అనేది వ్యక్తిగత విలాస వస్తువు కాదు. అది గోధుమలు పండించడానికి నేలను దున్నుతుంది, కూరగాయలను మార్కెట్లకు రవాణా చేస్తుంది, చక్కెర కర్మాగారాలకు చెరకును సరఫరా చేస్తుంది, విత్తనాలు నాటుతుంది, పిచికారీ పరికరాలను నడుపుతుంది, నూర్పిడి యంత్రాలను పనిచేయిస్తుంది. ట్రాక్టర్లు లేకుండా, నేటి వ్యవసాయ వ్యవస్థను నడపడం దాదాపు అసాధ్యం అయిపోయింది. అయినప్పటికీ, ఎక్స్‌ప్రెస్ వేలు, వేగంగా ప్రయాణించే రహదారులపై ట్రాక్టర్లను నడపడం స్పష్టంగా నిషేధించబడినప్పటికీ, డీజిల్‌పై విధించే సుంకం ద్వారా ట్రాక్టర్ యజమానుల నుండి ఈ పన్నును వసూలు చేస్తూ, వాటిపై కూడా ఎక్స్‌ప్రెస్ సెస్ విధిస్తున్నారు. ఇది క్షేత్రస్థాయిలో అడుగుపెట్టకుండా, నల్లమట్టిపై విశ్వాసం ఉంచకుండా రూపొందించిన ఆర్థిక విధానం.

మెర్సిడెస్ లేదా బిఎండబ్ల్యు వంటి కార్లు వినియోగం, విలాస వస్తువు లు కాగా, ట్రాక్టర్ అనేది మన దేశ స్థూల జాతీయ ఆదాయానికి దోహదపడే ఒక ఉత్పాదక సాధనం. ఈ రెండింటినీ ఒకే ఆర్థిక దృక్కోణంతో చూడటం అత్యంత అవివేకం, ఆర్థికంగా పొంతన లేనిది.

రైతులు దీనికోసం చట్టబద్ధమైన, శాశ్వతమైన, ప్రత్యేక వర్గీకరణను నిరంతరం డిమాండ్ చేస్తున్నారు. పన్నుల ప్రయోజనం కోసం వ్యవసాయ ట్రాక్టర్లను ఇతర మోటారు వాహనాల నుండి పూర్తిగా వేరైన వర్గంలో ఉంచే చట్టపరమైన వర్గీకరణను సృష్టించడం చాలా అవసరం.




### రెండు ఇంధనాల కథ

ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలలో ఉపయోగించే డీజిల్‌తో పోలిస్తే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్)పై ప్రభుత్వం పూర్తిగా భిన్నమైన దృక్పథాన్ని కలిగి ఉండటం అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం. ఈ వివక్ష అనేది 'రెండు పరస్పర విరుద్ధమైన సూత్రాలపై నిర్మించిన ఆర్థిక ఏర్పాటు'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవియేషన్ ఫ్యూయల్ కోసం ఎంత శ్రద్ధ తీసుకుంటున్నాయో కదా?

### కేంద్ర ఎక్సైజ్ సుంకం నుండి మినహాయింపు

ప్రభుత్వం 2026 మార్చి 27న డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకి తగ్గించింది, కానీ ఏవియేషన్ ఫ్యూయల్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. డీజిల్ కోసం ఇది ఒక శిక్షాత్మకమైన ఏర్పాటు. మహారాష్ట్ర డీజిల్‌పై 21 శాతం వ్యాట్ విధిస్తుంది. ఇది (ఎటిఎఫ్)పై విధించే 14 శాతం కంటే చాలా ఎక్కువ. గుజరాత్‌లో డీజిల్ వ్యాట్ 14.90 శాతంగా ఉంది. గోవాలో 18.09 శాతం, కోల్‌కతాలో 17 శాతం, చెన్నైలో 11 శాతం.

కేంద్ర పన్నులలో కూడా వివక్షలు ఉన్నాయి. డీజిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం (ఎస్‌ఎఇడి) లీటరుకు రూ.24 కాగా, రహదారి, మౌలిక సదుపాయాల సెస్ (ఆర్‌ఐసి) లీటరుకు రూ.36లుగా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఎక్సైజ్ సుంకాలు, సెస్‌లు (ఎస్‌ఎఇడి + ఆర్‌ఐసి + ఎఐడిసి + ఎన్‌సిసిడి + బిఇడి)అన్నీ కలిపి లీటరుకు సుమారుగా రూ.64 అవుతున్నాయి. ట్రాక్టర్లు ఎక్స్‌ప్రెస్‌వేలను ఎన్నడూ ఉపయోగించనప్పటికీ, ఇందులో కేవలం రహదాది, మౌలిక సదుపాయాల సెస్ మాత్రమే రూ.36 రూపాయలుగా ఉంది.

ట్రాక్టర్లు హైవేలను ఉపయోగించనప్పటికీ రోడ్డు సెస్ విధించడం ఇది అత్యంత ఘోరమైన అన్యాయం. రాష్ట్రాల వ్యాట్ ను తగ్గించడానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రచారంలా కాకుండా, ట్రాక్టర్ల కోసం ఏ మంత్రి లేఖ రాయరు. అధిక డీజిల్ వ్యాట్ వ్యవసాయానికి హాని చేస్తుందని ఏ మంత్రి కూడా ఎప్పుడూ హెచ్చరించలేదు. ఎటిఎఫ్ ధరలు పెరిగినప్పుడు, ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తుంది, మినహాయింపులు ఇస్తుంది, మంత్రులు రాష్ట్రాలకు లేఖలు రాస్తారు. కానీ డీజిల్ ధరల భారంతో రైతులు నలిగిపోతున్నప్పుడు మాత్రం ప్రభుత్వం పూర్తిగా మౌనం వహిస్తుంది. ''ఇది నిర్లక్ష్యం కాదు ఇది ఉద్దేశపూర్వకమైన, నిరంతర వర్గ పక్షపాతం'' అని అఖిల భారతీయ కిసాన్ సభ (ఎఐకెఎస్)పేర్కొంది. ఢిల్లీ ఎటిఎఫ్‌పై 25 శాతం వ్యాట్ విధిస్తున్నప్పటికీ, కేంద్ర మంత్రులు ఇప్పటికీ ఇతర రాష్ట్రాలను వ్యాట్‌ను 1 శాతానికే పరిమితం చేయడానికి అభ్యర్థిస్తున్నారు. మహారాష్ట్ర డీజిల్‌పై 21 శాతం వ్యాట్ విధిస్తోంది. దీనిపై మాత్రం ఒక్క లేఖ కూడా లేదు. రూ.90 డీజిల్ వెనుక ఉన్న పన్ను విధానం (ఏప్రిల్ 2026 నాటి స్థితి).

యుద్ధ పరిస్థితుల దృష్ట్యా 2026 మార్చిలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తాత్కాలికంగా తగ్గించింది. అయితే, 2026 ఏప్రిల్ 11 నుండి, ఎస్‌ఎఇడిని తిరిగి లీటరుకు రూ. 24కి, ఆర్‌ఐసిని లీటరుకు రూ. 36కి పెంచారు. ఈ అస్థిరమైన మార్పుల కారణంగా రైతులు తమ ఖర్చులను అంచనా వేయడం కష్టంగా మారింది.

# 60 రోజుల ఇరాన్ యుద్ధం.. అగ్ర రాజ్యానికి గర్వభంగం..



**ఎం.కృష్ణ ఆదిత్య**
**సీనియర్ జర్నలిస్ట్**

అగ్రరాజ్యం అమెరికా బెదిరింపులకు, హుంకరింపులకు జడిసే రోజులు పోయాయి. సామ్రా\జ్యవాదంతో యావత్ ప్రపంచాన్ని తన గుప్పెట్లో ఉంచుకోవాలని ఉవిళ్లూరిన అంకుల్ సాం కలలు గత 60 రోజుల్లో మంచులా కరిగి పోయాయి. నిలువెల్లా సామ్రాజ్యవాద ధోరణితో దుష్టద్వయంగా అపకీర్తి మూట కట్టుకున్న అమెరికా, ఇజ్రాయిల్ తాము తీసుకున్న గోతిలోనే పడిన చందంగా ఇరాన్ యుద్ధం మారిపోయింది. ఇప్పటికి ఇరాన్ పైన అమెరికా ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధ దాడికి 60 రోజులు గడిచాయి. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ఫిబ్రవరి 28, 2026 ప్రారంభించగా, కేవలం కొన్నివారాల వ్యవధిలోనే ఇరాన్ తన మోకాళ్ళ పైన నిలబడుతుందని కలలుగన్న అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు కళ్ళు బైర్లు కమ్మే స్థితికి చేరుకున్నారు.

ఆపరేషన్ ప్రారంభంలో డోనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధం 'నాలుగు వారాల్లో లేదా అంతకంటే తక్కువ సమయంలో' ముగుస్తుందని, ఇరాన్ 'బేషరతుగా లొంగిపోతుందని' ప్రగల్భాలు పలికారు. కానీ 60 రోజులు గడిచినా యుద్ధం ముగియకపోగా, అది మరింత క్లిష్టంగా మారింది. అంతకుముందు వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్టుతో ఉత్సాహం తెచ్చుకున్న ట్రంప్ అదే తరహాలో ఇరాన్ సైతం లొంగదీసుకోవచ్చని భ్రమపడ్డారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ప్రారంభమైన మొదటి రోజే, అంటే ఫిబ్రవరి 28, 2026న ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా ఇజ్రాయెల్ దళాలు హత్య చేశాయి. యుద్ధం మొదటి రోజున అమెరికా క్షిపణి దాడిలో 120 మంది పాఠశాల విద్యార్థినులు మరణించారు. ఇది అమెరికా నైతిక పతనాన్ని సూచించింది.

వైట్ హౌస్ సిట్యుయేషన్ రూమ్‌లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమర్పించిన 'ఫోర్ పిల్లర్' వ్యూహానికి ట్రంప్ ఆకర్షితుడై. ఇరాన్ నాయకత్వాన్ని అంతం చేస్తే వారం రోజుల్లోనే దేశం లొంగుతుందని ఆయన నమ్మించారు. అయితే అదే సమయంలో CIA డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, నెతన్యాహు అంచనాలు 'అవాస్తవం' అని, ఇరాన్ ప్రజలు తిరుగుబాటు చేస్తారనేది ఒక భ్రమ అని హెచ్చరించారు. అయినా ట్రంప్ ఆ హెచ్చరికలను పక్కనపెట్టి ఇజ్రాయెల్ మాటలను గుడ్డిగా నమ్మి యుద్ధరంగంలోకి అడుగు పెట్టారు. బెర్నీ సాండర్స్ వంటి వారు ఇది 'రాజ్యాంగ విరుద్ధమైన యుద్ధం' అని హెచ్చరించగా, ట్రంప్ మాత్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం యుద్ధానికే మొగ్గు చూపారు. ఈ యుద్ధానికి ప్రధాన కారణం ఇరాన్ అణు సామర్థ్యాన్ని నాశనం చేయడం. కానీ 60 రోజుల తర్వాత కూడా ఇరాన్ అణు కేంద్రాలు పనిచేస్తూనే ఉన్నాయి. ఇది అమెరికాకు ఎదురైన మొదటి వ్యూహాత్మక పరాజయం.

అమెరికా తన అమ్ములపొదిలోని అత్యంత శక్తివంతమైన 30,000 పౌండ్ల GBU57 బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించింది. ఇవి భూమి లోపలికి చొచ్చుకుపోయి లక్ష్యాలను ధ్వంసం చేయగలవని భావించారు. కానీ ఇరాన్ తన అణు కేంద్రాలను (నటాంజ్, ఇస్ఫహాన్) పర్వతాల లోపల, అత్యంత లోతులో నిర్మించుకోవడం వల్ల అమెరికా సాంకేతికత అక్కడ పనిచేయలేదు. యుద్ధం మొదలై రెండు నెలలు గడుస్తున్నా, ఇరాన్ వద్ద ఉన్న 60 శాతం స్వచ్ఛత కలిగిన అత్యంత ప్రమాదకరమైన యూరేనియం నిల్వలు ఎక్కడున్నాయో అమెరికా కనుగొనలేకపోయింది.

యుద్ధానికి ముందే డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసి గబ్బార్డ్ ఇరాన్ అణుబాంబు తయారు చేయడం లేదని ధృవీకరించారు. అంటే, అబద్ధపు సాకులతో ఇరాక్ తరహా


Photo Courtesy:TOI

లోనే ఈ యుద్ధాన్ని ప్రారంభించినట్లు స్పష్టమైంది.

యుద్ధంలో అత్యంత కీలక ఘట్టం ప్రపంచ చమురు సరఫరాలో 20% వాటా ఉన్న హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. అమెరికా నౌకాదళం అక్కడ ఉన్నప్పటికీ, ఆ మార్గాన్ని పునరుద్ధరించడంలో విఫలమైంది. ఈ యుద్ధం వల్ల అమెరికాకు రోజుకు దాదాపు 2 బిలియన్ డాలర్ల ఖర్చవుతోంది. హార్వర్డ్ ప్రొఫెసర్ లిండా బిలమ్స్ ప్రకారం, ఈ యుద్ధం మొత్తం ఖర్చు 1 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటే అవకాశం ఉంది. పెంటగాన్ నివేదికల ప్రకారం, మొదటి 12 రోజుల్లోనే 16 బిలియన్ డాలర్ల సైనిక సంపద బూడిదైపోయింది.\ సైనిక వ్యూహంలో కూడా ఇరాన్ వేసిన ఉచ్చులో అమెరికా విలవిలాడింది. ఇరాన్ పంపే చౌకైన కమికాజీ డ్రోన్లను కూల్చడానికి అమెరికా ఉపయోగిస్తున్న ఇంటర్‌సెప్టర్ల ఖరీదు 106 రెట్లు ఎక్కువ. ఇది అమెరికా ఖజానాను ఖాళీ చేస్తోంది. ఇప్పటికే అమెరికా జాతీయ అప్పు 36 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. కేవలం ఆ అప్పుపై వడ్డీ కట్టడానికే ఏడాదికి 1 ట్రిలియన్ ఖర్చవుతోంది. ఇటువంటి స్థితిలో మరో భారీ యుద్ధం అమెరికాను ఆర్థికంగా దివాలా తీయించే దిశగా నెడుతోంది.

యుద్ధం క్లిష్ట దశలో ఉండగా డిఫెన్స్ సెక్రటరీ హెగ్‌సెత్ కీలకమైన ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ నేవీ సెక్రటరీని తొలగించారు. ఇది అమెరికా సైనిక వ్యవస్థలో అభద్రతాభావాన్ని పెంచింది. 'ఇరాన్ ఆకాశం మా ఆధీనంలో ఉంది' అని అమెరికా ప్రకటించినా, ఇరాన్ గగనతలంలో రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసి తన సత్తా చాటింది. స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఈ యుద్ధానికి దూరంగా ఉన్నాయి. 'ఒక నాగరికతను అంతం చేస్తాం' అన్న ట్రంప్ వ్యాఖ్యలను పోప్ లియో XIV తీవ్రంగా ఖండిస్తూ, ఇది మానవత్వానికే గొడ్డలిపెట్టు అని అన్నారు.

ఇక యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి భారత్ తన పాత పద్ధతిలోనే 'వ్యూహాత్మక మౌనం' పాటిస్తోంది. అమెరికాఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నప్పుడు, భారత్ నేరుగా ఎవరినీ ఖండించకుండా, కేవలం 'శాంతి నెలకొనాలి, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి' అని ఒక సాధారణ ప్రక్రియను అనుసరించింది. మరోవైపు ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు రకాలుగా ఒత్తిడి తెచ్చింది. ఒకటి యుద్ధంలో తమకు మద్దతు ఇవ్వడం, రెండు అమెరికా ఉత్పత్తులపై భారత్ వేసిన టారిఫ్ (పన్నులు) తగ్గించడం.ఒక దశలో భారత్‌ను తన వైపు తిప్పుకోవడానికి అమెరికా 'ఆర్మ్ ట్విస్టెడ ట్రేడ్ డీల్' (బలవంతపు వాణిజ్య ఒప్పందం) చేసింది. ఈ ఒప్పందం వల్ల భారత్ తన సొంత ప్రయోజనాలను కొంత వరకు పణంగా పెట్టాల్సి వచ్చింది. అమెరికా భయంతో భారత్ ఇరాన్‌కు బహిరంగంగా మద్దతు తెలపలేకపోయింది.

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, గ్లోబల్ సౌత్ కు నాయకత్వం వహిస్తున్నామని చెప్పుకునే భారత్, ఒక అక్రమ యుద్ధం (Unlawful War) జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం దాని నైతిక అధికారాన్ని దెబ్బతీసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించినా, ఆయన కుమారుడు పగ్గాలు చేపట్టి పాలనను స్థిరపరిచారు. ఇరాన్ ప్రభుత్వం కూలలేదు, బదులుగా ప్రజల్లో ఐక్యత పెరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల విషయంలో, వియత్నాం విషయంలో గతంలో అమెరికా చేసిన పొరపాటే ఇక్కడ కూడా చేసింది. అమెరికా నిరంతరాయంగా 900కు పైగా క్షిపణి దాడులు చేసినా, విద్యుత్, ఇంటర్నెట్ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసినా ఇరాన్ ప్రజలు లొంగలేదు. తమ ప్రతిఘటనను కొనసాగించారు.

ఎన్ని బాంబులు వేసినా ఆత్మగౌరవం ఉన్న జాతిని ఏ అగ్రరాజ్యమూ లొంగదీసుకోలేదని నిరూపించింది. 'చరిత్రను ఆయుధాలు రాయవు, ప్రజల సంకల్పం రాస్తుంది' అనే సత్యాన్ని ఈ యుద్ధం మరోసారి ప్రపంచానికి గుర్తుచేసింది. సామ్రాజ్యాలు వస్తుంటాయి, పోతుంటాయి.. కానీ ఆత్మగౌరవం కోసం పోరాడే జాతి ఎప్పటికీ సజీవంగానే ఉంటుందని ఇరాన్ నిరూపించింది.

# అంబేద్కర్ కృషితో కార్మికుల హక్కులకు చట్టబద్ధత



- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగానే రాజ్యాంగ రచనలో కార్మికుల హక్కులకు పెద్దపీట వేశారని, దాని ఫలితంగానే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు కార్మికుల హక్కులకు చట్టబద్ధత వచ్చిందని, అదేవిధంగా కార్మికుల హక్కులు, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అన్నారు. మేడేను పురస్కరించుకొని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మే1న మేడే వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటారని, 145 సంవత్సరాలకు పూర్వం చికాగో నగరంలో కార్మికులు 8గంటలు పని చేయాలని కోరుతూ ఉద్యమించారని, ఆ సందర్భంలో కార్మికులపై చేసిన దాడిలో రక్తం చిందించిన సందర్భాలకు గుర్తుగా మే 1న కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారని అన్నారు. అంతకుముందు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎం.మధుసూదన్ మృతి బాధాకరమని డిప్యూటీ ససిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన మిర్యాలగూడ పట్టణంలోని మధుసూదన్ గృహాన్ని సందర్శించి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆయన అన్నారు.

# మాది కార్మికుల పక్షపాతి ప్రభుత్వం

- మేడే వేడుకల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక రంగంలో ఉన్నవారికి ఈఎస్‌ఐ సదుపాయం కల్పించే ఆలోచన చేస్తున్నట్లు కార్మిక, మైనింగ్ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మే డే పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్ర భారతిలో శుక్రవారం ప్రభుత్వం తరపున నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులకు మంత్రి 'శ్రమశక్తి' అవార్డులను ప్రధానం చేశారు. సభను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాహుల్ గాంధీ సూచనల మేరకు గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. గిగ్ వర్కర్ల భద్రతా బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం శుభ పరిణామమని, దీని ద్వారా రాష్ట్రంలోని 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్మికుల పట్ల యాజమాన్యాల దృక్పథంలో మార్పు రావాలని, వారి భద్రత కోసం కంపెనీలు మరిన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

**యువతకు నైపుణ్యం ఎటిసి సెంటర్ల ఏర్పాటు..**

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టాటా గ్రూప్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 120 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఎటిసి) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు రూ.4,000 కోట్ల వ్యయంతో ఈ సెంటర్లలో శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ పొందే విద్యార్థులకు రూ.2,500 స్టైపెండ్ కూడా అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం టామ్ కామ్ సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.90 కోట్లు కేటాయించారని, యువతకు జర్మన్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శంషాబాద్, రామగుండంలో 100 పడకల ఆసుపత్రులు, మహబూబ్‌నగర్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్లు ప్రకటించారు. కార్మికుల కోసం ఒక మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ వస్తుందని, ఆ దిశగా కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. కార్మికుల పక్షాన పోరాడిన దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి స్మారకార్థం వచ్చే ఏడాది నుండి 'పిజెఆర్' లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'ను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వినోద్, లేబర్ కమిషనర్ సత్పతి పమేల, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ దాసరి హరిచందన, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ కార్పొరేటర్ విజయరెడ్డి పాల్గొన్నారు.



# ప్రభుత్వానికి ఆర్‌టిసి కార్మికులు అండగా నిలవాలి

- జగిత్యాలలో మే డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికులు స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అనేక అవస్థలు పడ్డారని, కార్మికులు సమ్మె చేస్తే డిస్మిస్ చేస్తానని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆర్టీసీ, సింగరేణి కార్మికుల పోరాట పటిమ మరువలేనిదని మంత్రి అన్నారు. నాడు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వం కనీసం చర్చలకు ఆహ్వానించలేదని మంత్రి అన్నారు. ప్రజలు మార్పు కోరుకున్న ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తే కేవలం మూడు రోజుల్లోనే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదుగురు మంత్రులు 24 సంఘాల ప్రతినిధులతో చర్చించి సమ్మెకు ముగింపు పలికామని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, డిపో మేనేజర్ కల్పన, టిపిసిసి కార్యదర్శి, ఆర్‌టిసి కార్మిక గౌరవ అధ్యక్షుడు బండ శంకర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం

- మేడే వేడుకల్లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా శ్రమ గౌరవం కోసం కార్మిక పోరాట స్ఫూర్తి చిహ్నం, కార్మికుల రక్తంతో రాసిన చరిత్రే మేడేనని, కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 140వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా శుక్రవారం హనుమకొండ మండలంలోని గుండ్లసింగారం, డబ్బాలు, పలువేల్పుల పలు ప్రాంతాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా గుండ్ల సింగారంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, డబ్బాలులో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, పలువేల్పులలో సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఓఆర్‌ఆర్ బ్రిడ్జి వద్ద హనుమకొండ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్‌లు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలోని సిపిఐ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఎగురవేశారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేయడం అంటే దేశంలో అన్ని రంగాలలో పని చేస్తున్న 55 కోట్ల కార్మికులను మోసం చేసి అధాని, అంబానీ పెట్టుబడి కార్పొరేట్ శక్తులకు దేశ చేస్తూ సంపాదను అప్పనంగా అప్ప చెప్పి కార్మికవర్గాన్ని బానిస యుగానికి తీసుకుపోయే కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఈ మేడే కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల కార్యదర్శి ఎన్ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, పొక్కుల సదానందం, గొర్రె నందిని, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, మాలోత్ మంగ, నలువల సంధ్య, తాటికంటి మమత, తాటికొండ ప్రశాంత్, గుంటి రజిత, బొమ్మకంటి మహేష్ పాల్గొన్నారు.





# హింసతో సిద్ధాంతాన్ని చంపలేరు

- సిపిఐ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు డా.కె.నారాయణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రపంచ వ్యాప్తంగా అనేక పోరాటాలకు మేడే స్ఫూర్తిగా నిలిచిందని ఆ స్ఫూర్తి అనేక విజయాలకు నాంది పలికిందని సిపిఐ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు డా.కె.నారాయణ తెలిపారు. అనేక దశాబ్దాల పాటు వీరోచిత పోరాటాలతో సాధించుకున్న హక్కులు ఇప్పుడు హరించబడుతున్నాయని ఆయన ఆరోపించారు. 141వ మేడేను పురస్కరించుకుని శుక్రవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని పాత సిపిఐ కార్యాలయం నుండి పెవిలియన్ మైదానం వరకు ప్రదర్శన నిర్వహించారు. వైరారోడ్డు, పాత బస్టాండ్ మీదుగా ప్రదర్శన పెవిలియన్ మైదానంకు చేరుకుంది. సిపిఐ జిల్లా కాద్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ శ్రమ దోపిడీ పెరుగుతుందని కార్పొరేట్ వర్గాలకు అనుగుణంగా కార్మిక చట్టాలను సవరించడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఎనిమిది గంటల స్థానంలో 12 గంటల పని విధానానికి మోడీ సర్కార్ రాజ ముద్ర వేయడం శోచనీయమన్నారు. 141 ఏళ్ల క్రితం పని గంటల తగ్గింపు కోసమే పోరాడి అనేక మంది అసువులు బాశారని ఇప్పుడు కూడా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మరో చారిత్రిక పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని నారాయణ పిలుపునిచ్చారు. కవిత వ్యవహారం కెసిఆర్ కుటుంబ వ్యవహారమని కేసిఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను పక్కనపెట్టి తెలంగాణ వ్యతిరేకులకు అవకాశం కల్పించారని నారాయణ తెలిపారు. తమిళనాడులో చంద్రబాబు కమ్యూనిస్టులను విమర్శించడం సరికాదని కమ్యూనిస్టులు లేని సమాజాన్ని చూడటం ఎవరి తరం కాదన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా లు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, సిపిఐ నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, జాకీర్, సైదా, వరదా నర్సింహారావు పాల్గొన్నారు.



# సిపిఐ నేతలను కలిసిన ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల సమ్మె సఫలమయ్యేందుకు కృషి చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిలకు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ కు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వచ్చి సిపిఐ నాయకులతో భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద జరిగిన నిరసన ధర్నాలకు సిపిఐ శ్రేణులు మద్దతు తెలపడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కలిసిన వారిలో వెంకన్న, బాబు తదితరులు ఉన్నారు.

# ఒకేరోజు ఏడుగురు ఐపిఎస్‌ల బాధ్యతల స్వీకరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ శాఖలో కీలక పరిపాలనా మార్పులు అమలులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు శుక్రవారం ఒకే రోజు ఏడుగురు ఐపిఎస్ అధికారులు తమ కొత్త బాధ్యతలు స్వీకరించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖలో పండగ వాతావరణం కనిపించింది. రాష్ట్ర కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)గా సీనియర్ ఐపిఎస్ అధికారి సివి ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన బి.శివధర్ రెడ్డి స్థానంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయంలో శిఖా గోయల్ హోమ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐబి చీఫ్‌గా విధులు నిర్వహించి బి.సుమతి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియమితులు కావడంతో బాధ్యతలు స్వీకరించారు. అలాగే మల్టీజోన్2 ఐజిగా షానవాజ్ ఖాసిం బాధ్యతలు చేపట్టగా, మల్కాజ్‌గిరి కమిషనర్‌గా పనిచేసిన అవినాష్ మోహంతీ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిజిగా, అదనంగా అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. మరోవైపు ఎసిబి డైరెక్టర్‌గా ఉన్న తరుణ్ జోషి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా డిఎస్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించారు. ఇలా ఒకే రోజు ఏడుగురు ఐపిఎస్‌లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మార్పులతో తెలంగాణ పోలీస్ వ్యవస్థలో కీలక స్థాయిలో పునర్వ్యవస్థీకరణ చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. చట్టం శాంతి పరిరక్షణ, సైబర్ నేరాల నియంత్రణ, అంతర్గత భద్రత మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణకు మాతృవియోగం

- 100 ఏళ్ల వయసులో గౌరమ్మ కన్నుమూత





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ (100) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, ఆదోనిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. గౌరమ్మ, పెరవల్లయ్య దంపతులు సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితాన్ని గడిపారు. తమ ఎనిమిది మంది సంతానాన్ని (ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు) ఎంతో కష్టపడి ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. తన పెద్ద కుమారుడైన కె.రామకృష్ణ ప్రస్తుతం జాతీయ స్థాయి ప్రజా నాయకుడిగా ఎదగడంలో గౌరమ్మ అందించిన ప్రోత్సాహం, నేర్పిన సామాజిక బాధ్యత ఎంతో విశేషమైనవని పార్టీ శ్రేణులు గుర్తుచేసుకుంటున్నాయి. శతాధిక వృద్ధురాలిగా 100 ఏళ్ల నిండు జీవితాన్ని గడిపిన ఆమె, చివరి వరకు తన కుటుంబానికి ధైర్యస్ఫూర్తిగా నిలిచారు.

**రాజకీయ, సామాజిక వర్గాల నేతల సంతాపం**

గౌరమ్మ మృతి వార్త తెలియగానే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సిపిఐ కార్యకర్తలు కె.రామకృష్ణకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒక సామాన్య మహిళగా జీవితాన్ని ప్రారంభించి, కష్టాన్నే నమ్ముకుని ఎనిమిది మంది పిల్లలను ప్రయోజకులను చేసిన ఆమె జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పలువురు కొనియాడారు. తల్లి మరణం రామకృష్ణకి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు. గ్రామస్తులు, బంధువులు, రాజకీయ నాయకులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. గౌరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కె.రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులు ఈ మహా విషాదాన్ని తట్టుకునే ధైర్యం పొందాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, ఆమెకు నివాళులు అర్పించారు. మొలగవల్లి గ్రామం లో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సంతాపం తెలిపిన పల్లా, కూనంనేని**

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ మృతిపట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# పర్యాటక శాఖలో మేడే ఉత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడే సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా సబ్బు రాజమౌళి మాట్లాడుతూ చికాగో నగరంలో కార్మికుల రక్తంతో ఎర్రజెండా ఏర్పడి ఆనాటి నుండి నేటి వరకు ఎర్రజెండా నీడన కార్మిక హక్కులు సాధించుకుంటున్నామని అన్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులను సమాన పనికి సమాన వేతనం సాధించుకున్నామని వారు తెలిపారు. ఈ పోరాటం వెనుక ప్రతి ఒక్క కార్మికుడి కష్టం ఉన్నదని వారు గుర్తు చేసుకున్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెరగాలని, కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా టూరిజంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 61 సంవత్సరాల వయోపరిమితి కల్పించాలని, గ్రాట్యూటి ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాజర్ వల్లి, హాజ్ మియా, శంకర్రావు, రెడ్డి, రామచంద్రయ్య, దేవి సింగ్, కృష్ణ, చారి, శ్రీనివాస్ రెడ్డి, మౌలాలి, కృష్ణారెడ్డి, కిరణ్, సుదర్శన్ రెడ్డి, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమే :మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తవ్వగానే కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధరలను ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలు పూర్తవ్వగానే ధరలు పెంచడం ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్రం పెంచిన ధరలతో 19 కెజిల గ్యాస్ ధర మూడువేల రూపాయలకు మించి పోయిందని, ఈ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెంచిన ధరల నిర్ణయాన్ని ఉప సంహారించుకోవాలని డిమాండ్ చేశారు. 19 కేజీల గ్యాస్ ధరను 993 రూపాయలు పెంచారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కసారి గా 30 నుండి 35 శాతం ధరలను పెంచడంతో హోటళ్లు, కేఫ్‌లు రెస్టారెంట్లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సామాన్యుడిపైన కూడా పెనుభారం మోపుతుందన్నారు.

# పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పంటల దిగుబడి గణనీయంగా పెరిగిందని, ఇలాంటి సమయంలో రాష్ట్రానికి, రాష్ట్ర రైతాంగానికి అండగా నిలువాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆరోపించారు. కేవలం పంటలకు మద్ధతు ధరను ప్రకటించి, కేంద్రం చేతులు దులుపుకుంటుందన్నారు. కేంద్రం కొనుగోలు చేయకుండా, రైతులకు మద్ధతు ధర ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో కేంద్రం ప్రకటించిన మద్ధతు ధర కంటే సగానికి పైగా తక్కువ ధరకు రైతులు తమ పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినప్పటికీ రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా మద్ధతు ధరను చెల్లించి, రైతుల వద్ద నుండి ప్రధాన పంటలను సేకరిస్తున్నామని వివరించారు. పంటల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పంటల కొనుగోళ్లపై హైదరాబాద్‌లోని సచివాలయంలో 'మార్క్‌ఫెడ్', వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ధరల ప్రభావంతో రైతులు నష్టాపోవద్దనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వమే పంటల కోనుగోళ్ల కోసం ప్రతి ఏటా రూ. 2వేల నుంచి రూ 3వేల కోట్ల భారాన్ని భరిస్తుందన్నారు. సోయాబీన్, కందులు, పొద్దుతిరుగుడు, శనగలు, వేరుశనగ, పెసర్లు వంటి పంటలను కేంద్రం ఎన్‌ఎఎఫ్‌ఇడి ద్వారా కొనుగోలు చేస్తున్నప్పటికీ మొత్తం ఉత్పత్తిలో 25 శాతం పరిమితి విధించడంతో రైతులు పండించిన మొత్తం పంటలో మిగతా పంట మొత్తాన్ని ఎక్కడ అమ్ముకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల నుండి పంట దిగుబడులు 150 శాతం అధికమయ్యాయని, అయినప్పటికీ కేంద్రం నిబంధనలలో ఎలాంటి సడలింపులు ఇవ్వ డం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విధించిన పరిమితులకు మించి పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలను సేకరించామని, జొన్న, మొక్కజొన్న పంటలను కూడా కొనుగోలు చేశామని వివరించారు. 2023–24 సంవత్సరంలో రూ.299 కోట్లతో 93,900 మెట్రిక్ టన్నుల జొన్నలు, 2024–25 సంవత్సరంలో రూ.521 కోట్లతో 1.54 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేశామన్నారు. 2025–26 వానాకాలంలో రూ.903 కోట్లతో 3.77 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, ఈ యాసంగిలో ఇప్పటివరకు రూ.1044 కోట్లతో 4.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. త్వరలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, జొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జొన్నలను కొనుగోలు చేస్తున్నప్పటికీ, పిడిఎస్ పథకం కింద పరిమితులకు లోబడే కోనుగోలు చేస్తున్నారని, బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా పరిమితులకు మించి కోనుగోలు చేయడం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పంటల కొనుగోలు చేయలేక, వరి, మొక్కజొన్న పంటల సాగు చేయవద్దని సూచించిన విషయాన్ని రైతులు ఇప్పటికీ గుర్తు పెట్టుకున్నారని మంత్రి తుమ్మల తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT No. 07/EE/Circle-36/KZ/GHMC/2026-27, తేది: 01.05.2026, పని పేరు: 2 పనులు, జంక్షన్ వెడల్పు, అంచనా విలువ : రూ.78.80 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 2 పనులకు ప్రారంభ తేది: 02.05.2026 సా.4.00గం.లకు / ఆఖరి తేది : 05.05.2026 సా.4.01గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, కెజెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్. ఫోన్: 9989930414. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, (కెజెడ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1750-PP/CL/ADVT/2026-27, Date: 01-05-2026

## లేబర్ కోడ్లు కార్మికుల పాలిట ఉరితాళ్లు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం / రెబ్బెన:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే కుట్ర అని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మండిపడ్డారు. శుక్రవారం రెబ్బెన మండల కేంద్రంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు. ఏఐటియుసి జెండా ను మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బోగే ఉపేందర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై 29 కార్మిక చట్టాలను సమాధి చేసిందని విమర్శించారు. చికాగో అమరవీరుల త్యాగాల ఫలితంగా వచ్చిన 8 గంటల పని దినం హక్కును కాలరాస్తూ 12 గంటల వెట్టిచాకిరీని చట్టబద్ధం చేయడం దుర్మార్గమన్నారు. హైర్ అండ్ ఫైర్ విధానంతో ఉద్యోగ భద్రతకు గొడ్డలిపెట్టు వేస్తున్నారని, సమ్మె చేసే హక్కును కూడా కేంద్రం లాగేసుకుంటోందని ధ్వజమెత్తారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్, కార్యదర్శి రత్నం దేవాజి, నాయకులు వెంకటేష్, సునీల్, శంకర్, ప్రవీణ్, లక్ష్మి , శోభ పాల్గొన్నారు.

## 7న తుమ్మిడిహెట్టికి సిఎం రాక

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ, కలెక్టర్



**ప్రజాపక్షం/కౌటాల:** తుమ్మిడిహెట్టి ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ప్రాంగణం, పరిసర ప్రాంతాలను ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ హరిత, ఎస్‌పి నితిక పంత్ శుక్రవారం పరిశీలించారు. భద్రతా చర్యలు, వేదిక ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డిఎస్‌పి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాడాలి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఏఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన మేడే వేడుకల్లో కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని, వయస్సు పైబడిన వారికి 5వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వీడాలని, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.కోళ్ల మోహన్, అనసూయ, ఉమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల పరిరక్షణకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:** అమరుల త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలు అవసరమని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మే డే సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, విభాగాల్లో ఏఐటియుసి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నస్పూర్ లోని నర్సయ్య భవన్‌లో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొని కార్మిక ఐక్యత ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే కార్మిక వర్గం ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. సింగరేణిలో పెండింగ్ లో ఉన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'మేడే' స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానల పట్ల మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లోని అంబేద్కర్ కాలనీలోగల సిపిఐ కార్యాలయం ముందు మేడే సందర్భంగా సిపిఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై కక్ష సాధింపు చర్యలలో భాగంగానే 8 గంటల పని విధానం రద్దు, కార్మికచట్టాలు రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. 140 సంవత్సరాల మేడే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని విధానం అమలు కోసం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందే విధంగా కార్మికులందరు చైతన్యమై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్మికుల హక్కుల సాధనకై సిపిఐ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. సిపిఐ కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు బి. రఘురాం, ఫిరోజ్ అలీ, సురేష్, శుబోధు, గోవర్ధన్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# ఉపాధి హామీతో రైతులకు మేలు

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / సిర్పూర్ టి:** ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలను సారవంతం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సిర్పూర్ టి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన చేపల చెరువు పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావుతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకోవాలని వేడి గాలుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. చేపల పెంపకం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా భూగర్భ జలమట్టం పెరుగుతుందని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నీడ తాగునీరు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూలీలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ దత్తారావు ఎంపిడిఓ సత్యనారాయణ సర్పంచ్ ఒడ్డెటి నాగమణి ఎంపీవో వినోద్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఏపీఎం మహేష్ వార్డు సభ్యులు సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

## పుల్లూరి లక్ష్మణ్‌కు శ్రమశక్తి అవార్డు

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రదానం



**ప్రజాపక్షం/మందమర్రి:** హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన మేడే వేడుకల్లో మందమర్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డిసిసి జనరల్ సెక్రటరీ పుల్లూరి లక్ష్మణ్‌కు ప్రతిష్ఠాత్మక శ్రమశక్తి అవార్డు లభించింది. కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లక్ష్మణ్‌ను జ్ఞాపిక ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మణ్‌కు అవార్డు రావడం పట్ల డిసిసి సెక్రటరీ గోపతి భానేష్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు ఎండి పాషా కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్ సంఘీ సంతోష్ బండి శంకర్ కొలిపాక సదానందం సామ్యూల్ సుద్దాల రాజ్ కుమార్ మహంత్ అర్జున్ ఎండి నయీమ్ రాయబారపు కిరణ్ మహేష్ సుమంత్ వర్షిత్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## బిజెపిని తరిమికొట్టడమే 'మేడే' స్ఫూర్తి

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** ప్రపంచ కార్మిక వర్గానికి మే డే స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ హక్కులను హరిస్తోందని విమర్శించారు. బ్రిటిష్ పాలనను మించి నిరంకుశంగా వ్యవహరిస్తున్న బిజెపిని దేశం నుండి పంపినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని పిలుపునిచ్చారు. మహిళల రక్షణలోనూ కేంద్రం విఫలమైందని నలినీ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## యువత సాధికారతకు కెరీర్ గైడెన్స్

కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/ మెదక్ :** యువత సాధికారతకు కెరార్ గైడెన్స్ ఎంతో ఉపయోగపడతాయని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సంగ్ అన్నారు. ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు కెరీర్ గైడెన్స్ పై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ సంబంధిత యువతతో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని మాట్లాడారు. కెరీర్ గైడెన్స్ పై యువతకు పలు సూచనలు సలహాలు అందించారు. యువతకు కెరీర్ తాను ఎంచుకున్న రంగంలో నాణ్యమైన గుణాత్మక విద్య ద్వారా ఉన్నత శిఖరాల అధిరోహించాలని ప్రతి విద్యార్థి జీవితంలో ఏదో ఒకసారి ఓటమి అనేది తలుపు తడుతుందని ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. ఓటమి గెలుపుకు నాంది అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి మరలా కష్టపడి చదివి యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు తమ ఆసక్తులు, నైపుణ్యాలు, వ్యక్తిత్వానికి తగిన సరైన వృతి మార్గాన్ని ఎంచుకోవడంలో సహాయపడే ఒక వ్యవస్థీకృత ప్రక్రియ అని వివరించారు. ఇది సరైన కోర్సుల ఎంపిక, లక్ష్య నిర్దేశం, ఉద్యోగ అవకాశాలను గుర్తించడంలో మార్గనిర్దేశం చేస్తుందన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ శిక్షణ వీకు ఎంతోగనో దోహదపడుతుందని మంచిగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోషించాలని ఆకాంక్షించారు.జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం కెరీర్ గైడెన్స్ యువత భవిష్యత్తుకు మార్గనిర్దేశంగా పనిచేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.





# బిజెపి విధానాలతో కార్మిక వర్గం బానిసత్వంలోకి..

ఎఐటియుసి

రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమేనని, కార్మిక హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు కొమ్ముకాసేలా ఉన్నాయని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం 136వ మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఏఐటియుసి జెండాను ప్రభుత్వ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. అనంతరం 140 అడుగులు ఏఐటియుసి జెండాతో భారీ ప్రదర్శనను ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెడికల్ కాలేజీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ 1886 చికాగో కార్మికుల పోరాట స్ఫూర్తితో 1920లో ఏర్పడిన ఏఐటియుసి బ్రిటిష్ పాలకులతో పోరాడి 8 గంటల పనిదినాన్ని, పని భద్రత చట్టాలను సాధించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం అనేక పోరాటాల ద్వారా కార్మిక వర్గం సాధించుకున్న 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడం అంటే కార్మికులను మళ్ళీ బానిసత్వంలోకి నెట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏడుగురు సభ్యులు ఉంటే యూనియన్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఆ సభ్యుల సంఖ్యను 250 కి పెంచి ఇది ముమ్మాటికి కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం అని అన్నారు. బిజెపి తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల ద్వారా కార్మికుల పనిచేసే పని గంటలను 12 గంటలకు పెంచుతు, వేతనాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘురాం, ఏఐటియుసి నాయకులు చక్రపాణి, హనుమాండ్లు, కవిత, విజయలక్ష్మి , అన్ని కార్మిక విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు.. ఇవ్వలేని ప్రభుత్వాలు

కలవేణ శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య




**ప్రజాపక్షం/ మంచిర్యాల:** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేని ప్రభుత్వా లు అధికారంలో ఉండటం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, ఏఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. మంచిర్యాల ప్ర భుత్వ ఆసుపత్రి ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కేవలం వెయ్యి రూ పాయల వేతనం ఇస్తూ దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల అమలులో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, కార్యదర్శి కలిందర్ అలీ ఖాన్, కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, దేవి పోచన్న, రాయమల్లు, రాకేష్, ప్రశాంత్, రాజేశ్వరి, షీలా, పద్మ, నర్సయ్య, నరేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

**ప్రజాపక్షం/రామాయంపేట:** కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకార్తలు పెద్ద ఎత్తున చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ గెస్ట్‌హౌస్‌లో బిఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపాలిటి పరిదిలోని 1వార్డు, 4వ వార్డు, 10వ వార్డుతో పాటు పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రేస్‌లో చేరారు.డిసిసి అద్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయని కార్యకర్తలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు సరాపు యాదగిరి, రమేష్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షులు బండారి మహేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/కౌటాల:** రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ హరిత సూచించారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగి ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం సాండ్గాం గ్రామంలో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాలకే తీసుకురావాలని సన్నరకం వరికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే హరీష్ బాబు పేర్కొన్నారు. రైతుల పంటను సేకరిస్తోందని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ ప్రజాప్రతినిధులు అధికారులు రైతులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి




**ప్రజాపక్షం/రామాయంపేట:** ఆర్ఎస్ పాలనలో రామాయంపేట మున్సిపాలిటి అభివృద్దిలో వెనుకబడిందని పాలకులు కేవలం స్వలాభం కోసమే పనిచేశారని బీజేపీ కౌన్సిలర్ శంకర్‌గౌడ్ తీవ్రస్థాయిలో ద్వజమెత్తారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో జరిగిన అక్రమాలను వెలికితీసి అవినీతికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో 1421 సర్వే నెంబర్‌లో ఓ వ్యక్తి బిఆర్ఎస్ నాయకుల అండదండలతో కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన మున్సిపల్ దుఖాణ సముదాయం నిబందనలకు విరుద్దంగా కోట్ల రూపాయలు చేతులు మారుతుందని దీనిలో కూడా బిఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. ప్రస్థుతం రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గతంలో జరిగిన అవినీతిని వెలికితీయాలని, భూ కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాల ని విజ్ఞప్తి చేశారు. రామాయంపేట పట్టణ ప్రదాన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ఇక్కడి ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలని విన్నవించారు. ఈసందర్బంగా మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని, దశల వారిగా వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అథితిగా హా జరైన ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడు తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత పా లకుల నిర్లక్ష్య వైఖరికి రామాయంపే ట ఎంతో వెనుక బాటుకు గురైందని అ న్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చే శారు. ఈసమావేశంలో వైస్ చైర్మెన్ పో చమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు రవి, స్వప్న, చౌదరి చరిత, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, శంకర్‌గౌడ్, దేవుని రంజిత్, మాదవి రమేష్, డాకి శ్యామల స్వామి, కోఅప్షన్ సభ్యులు దేమె యాదగిరి, చింతల రాధా భవాని, గౌస్, ఆసియా సుల్తానా పాల్గొన్నారు.

## 'టెన్త్' విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం సన్మానించారు. పాఠశాలకు చెందిన చిలివేరి శ్రీ భవ్య, మక్కల సంధ్య, గంగావేణి, అంజలి లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ప్రభాకర్ సన్మానించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ అశోక్, ఎం.రవీందర్, కె.వినోద్, ఎం.రాము, సిఆర్‌పిలు వి.సాయిరాం, కె.సురేష్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండలం పరిధిలో గల సీతానగర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన ఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం సీతానగర్ గ్రామానికి చెందిన నాల్లచెరువు ఇల్లు నెంబరు 1362 గల ఇంటి లో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు తగలడం వల్ల ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో సుమారు 3 లక్షల వరకు గల విలువైన నగదు వస్తువులు కాలిపోయినట్లుగా ఇంటి యజమాని నాలా చెరువు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అత్యాధునిక సాంకేతిక విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం మంథనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీ ఫైబర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ సమ్మర్ క్యాంపును మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి,వారి ప్రతిభను చూసి అభినందించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో విద్యార్థులు చిన్న వయసు నుండే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), రోబోటిక్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ప్రపంచ స్థాయి ఇంజనీర్లుగా ఎదగగలరని సూచించారు. మంథని వంటి మారుమూల ప్రాంత విద్యార్థులు రోబోటిక్స్ ఉపయోగించి మూన్ ల్యాండింగ్ ప్రక్రియను ప్రయోగాత్మకంగా చేయడం గర్వకారణమని మంత్రి కొనియాడారు.హైదరాబాద్ వంటి నగరాల్లోని కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ సమ్మర్ క్యాంపుల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులు చూపిస్తున్న ఉత్సాహం, అందిస్తున్న సహకారం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టుకోవాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

## నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తాం: ఎమ్మెల్యే మేడిపల్లి



**ప్రజాపక్షం/గంగాధర:** చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సముద్రాల కవిత కిషన్ గృహ ప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే సత్యంకు సముద్రాల కవిత కిషన్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కురిక్యాల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని 208 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 95 మంది లబ్ధిదారులు సొంత ఇంటిని నిర్మించుకుని గృహ ప్రవేశం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కడారి రేణుక కనుయ్య, కాంగ్రెస్ నాయకులు మేర్జ కొండయ్య, దోర్నాల అర్చన తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు ఒకరు మృతి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణం లోని ఆబాది జమ్మికుంట కు చెందిన బొగ్గుల సమ్మి(60) అనే వ్యక్తి వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం పొలం లో ఎండలో తిరుగి ఇంటికి చేరుకున్నాడనీ అప్పటికే అస్వస్థతకు గురై సమ్మయ్య కిందపడిపోగా గమనించిన స్థానికులు వెంటనే హాస్పిటల్ కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి: కృష్ణారావు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కృష్ణారావు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ బండి రాజేష్,తహసిల్దార్ వరప్రసాద్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి లతో కలిసి కృష్ణారావు ప్రారంభించారు. రైతుల సౌకర్యం కోసం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,రైతులు శుద్ధి చేసిన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని కృష్ణారావు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం అల్లేశంకర్, సీసీలు రాజేందర్, పురుషోత్తం,సాయెందర్,మహిళా సంఘ సభ్యురాలు, రైతులు పాల్గొన్నారు.

# బాలల భరోసా ప్రభుత్వ లక్ష్యం



### డ్రగ్స్ రహిత తెలంగాణ ముఖ్యమంత్రి లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** బాలల సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఆరేళ్లలోపు పిల్లలు అంగవైకల్యానికి గురికాకుండా చూడాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాల భరోసా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం బాల భరోసా, నషాముక్త్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వయసు వచ్చే వరకు చిన్నారులు వివిధ రకాల వ్యాధుల బారిన పడి అంగవైకల్యానికి గురవుతున్నారని, తెలంగాణ సమాజానికి భవిష్యత్తులో ఇబ్బంది జరుగుతుందని భావించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి బాల భరోసా అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సున్నా నుండి ఆరు ఏళ్ల వయసున్న చిన్నారులను వివిధ రకాల పరీక్షలు చేసి లోపాలు ఉంటే మెడికల్ ట్రీట్మెంట్ అందించి ఎలాంటి వైకల్యం రాకుండా చూడడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని మంత్రి వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 18 లక్షల మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మంత్రి వివరించారు. ఇందులో పలువురికి లోపాలను గుర్తించామని మంత్రి తెలిపారు. వీరికి వైద్యం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. స్థానికంగా వైద్యం అందుబాటులో లేకుంటే హైదరాబాద్ లో చికిత్సలు అందిస్తామన్నారు. జగిత్యాల జిల్లాలో టాంకాం ద్వారా శిక్షణను అందించి జగిత్యాల ప్రాంత యువత విదేశాల్లో ఉద్యోగాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు మంత్రి సూచించారు. నషా ముక్త్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి పోలీసులు ఇతర అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. ఈగల్ టీం పేరుతో ఒక ఐపీఎస్ అధికారిని నియమించి డ్రగ్స్ నిర్మూలనకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి తెలిపారు. యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంత్రి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ లో మహిళ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల స్టార్స్ ను ఏర్పాటు చేయగా మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, స్కూటీలు, ఈ ఆటో రిక్షాలను మంత్రి అందజేశారు.రాష్ట్ర వికలాంగుల సంక్షేమం శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ గతంలో ఏనాడు లేనివిధంగా దివ్యాంగులకు పరికరాల కొనుగోలు కు రూ. 50 కోట్లు వరకు కేటాయించిందని అన్నారు. ఇందులో జగిత్యాల జిల్లాకు కోటి రూపాయలకు పైగా కేటాయించినట్లు అనిత రామచంద్రన్ వివరించారు.పలువురు యువతులు ఆన్లైన్ మోసాల బరిన పడి సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తుల చేతిలో మోసపోతున్నారని అనిత రామచంద్రన్ అన్నారు. తెలంగాణలో ఇటీవల పెరిగిన టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఆందోళన కలిగిస్తున్నాయని యువతులు ఆన్లైన్ మోసాల బారిన పడకుండ జీవిత లక్ష్యాల వైపు దృష్టి మళ్లించాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఇప్పటికి 80% భవనాలు పూర్తయ్యాయని అన్నారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమం శాఖ డైరెక్టర్ శైలజా మాట్లాడుతూ 5ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించడం వల్ల వారు భవిష్యత్తులో దివ్యాంగులుగా మారే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో 18 మంది లక్షల మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించిన శైలజా తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ తో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట రెడ్డి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మేడే స్ఫూర్తితో కంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట రెడ్డి పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మేడే దినోత్సం సంధర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ మండలాధ్యక్షులు బోనగిరి రూపేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎర్రజెండాను ఎగురవేసి మేడే వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకుల,హమాలీ కార్మికులు,యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 5న జాబ్ మేళా

నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మే 5వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం కలెక్టర్ తన కార్యాలయంలో టాస్క్, ఎంప్లాయిమెంట్, ఇండస్ట్రియల్, స్పోర్ట్స్ శాఖల అధికారుల సమక్షంలో జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాబ్ మేళా నిర్వహిస్తు న్నామని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించి మంచి ఉద్యోగాలను పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి తిరుపతిరావు అధికారులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం కార్మికులు ఐక్యపోరాటం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు




**ప్రజాపక్షం/కోరుట్ల:** 8 గంటల పని దినం కోసం కార్మిక ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన పోరాట యోధుల సాక్షిగా ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే స్ఫూర్తితో కార్మిక శ్రేణులు ముందుకు సాగాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో జరిగిన పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మరియు హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో అరుణపతాకలు ఎగురవేసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ ఉత్సాహభరితంగా 141 వ మేడే నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 1886 మే 1న అమెరికా దేశంలోని చికాకు పట్టణంలో హే మార్కెట్ లో వేలాదిమంది కార్మికులు సమ్మె చేస్తున్న సందర్భంగా అప్పటి బ్రిటిష్ పాలకులు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరపడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయి రక్తపు మడుగులో తడిసిన నెత్తుటి గుడ్డలే మేడే స్ఫూర్తి అన్నారు.నాటి నుండి నేటి వరకు పోరాడి సాధించుకున్న కార్మిక వర్గపు 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిలిపివేసి పెట్టుబడుదారులకు ప్రైవేటు శక్తులకు అనుకూలంగా ఐదు లేబర్ కోడులను తీసుకొచ్చి వద్దన్నారు.దీని పరిణామం వల్ల కార్మికులు ఉద్యోగులు భద్రత కోల్పోయి చట్టాలు అమలు కాకుండా నిర్వీర్యం ఐపోతాయని , ప్రశ్నించే హక్కు లేకుండా పోతుందని అలాంటి లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం ఏన్నం రాధ,అందే వంశీకృష్ణ,తిప్పర్తి రమేష్,మొయినుద్దీన్,రామిల్లా రాంబాబు, షేక్ చాంద్ పాషా, పోశెట్టి, కొక్కుల గంగాధర్, సాంబార్ మహేష్ మున్సిపల్ కార్మికులు హమాలీ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు కార్మిక వీధులలో అరుణ పతాకాలు ఎగురవేసి ఘనంగా మే డే ఉత్సవాలు నిర్వహించారు.

## సిద్దిపేటలో భారీ బైక్ ర్యాలీ- జెండా విష్కరణలు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** మేడే కార్మిక దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏఐటియూసి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోకార్మిక దినోత్సవం పురస్కరించుకొని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పలు చోట్ల జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాల బిజెపి పాలనలో వ్యాపారులు కార్పొరేట్లు పెట్టుబడిదారులు ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కార్మికవర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో అతి ముఖ్యమైన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వ్యాపార వర్గాలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ రోడ్లు తెచ్చిందన్నారు.ఈ కోడ్‌తోనే కార్మికుల పని గంటలు ఎనిమిది గంటల నుండి 12 గంటలకు పెంచిందన్నారు. కార్మికులకు నిరసన తెలియజేసి సమ్మె నోటీసు ఇచ్చి కార్మిక నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైల్లో పెడుతుందన్నారు. ఈచట్టాలతో కార్మిక ఉద్యమాలను, పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయటమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకుందన్నారు. హమాలీ, ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని. 10లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, 60 ఏండ్లు నిండిన కార్మికులకు పదివేల పింఛన్ చెల్లించాలని, కాంట్రాక్టుస ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు 26వేల వేతనం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని , రోజు వెయ్యి రూపాయలు దినసరి కూలీ చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలోఏఐటియూసి జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు పిట్ల మల్లేశం, చంద్రమౌళి, బెక్కంటి సంపత్, కానుకుంట శంకర్, ఏఐటియూసి జిల్లా నాయకులు గంగిరాజు, చింతమడక రాజు,మురళి, శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలలో, కార్మిక వాడల్లో, ఐక్యతను చాటాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికకుల హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య అన్నారు. శక్రవారం మేడే సందర్భంగా కరీంనగర్ నగరంతో పాటు జిల్లాలోనీ అన్ని మండలాలు, గ్రామాలలో కార్మిక వాడల్లో కార్మికుల ఐక్యతను చాటుతూ హక్కుల కోసం ఉద్యమిందామని ఈరోజు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే జెండాలు కరీంనగర్‌లో బద్దం ఎల్లారెడ్డి భవన్ ఏఐటియుసి జిల్లా కార్యాలయం తోపాటు ఉల్లిగడ్డ హమాలి సంఘం, రైల్వే హమాలి సంఘం, సివిల్‌సప్లై హమాలి సంఘం, సిమెంటు హమాలి సంఘం, గంజి ఐరన్ హార్డ్వేర్ హమాలి సంఘం, ఫర్టిలైజర్ హమాలి సంఘాల ఆధ్వర్యంలో మేడే ఏఐటీయూసీ జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలపట్ల రాజు, ఉల్లిగడ్డల అమాలి సంఘం నాయకులు మల్లెపు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

**చిగురుమామిడి మండలంలో:** 141వ మే డే సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎర్ర జెండాను సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు మొండయ్య, పాల్గొన్నారు.

**తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో:** 141 మే డే సంబరాలు పురస్కరించుకొని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అతీక్ యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ టూ ఆర్. సరిత క్రిస్టపర్, యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సన్నీ ఎడ్వర్డ్, ఎ.దేవరాజ్, పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## చనిపోయిన కార్మికుల రక్తంతో తడిసిన జెండానే ఎర్ర జెండా

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణు, రాములు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని చేసిన ఆందోళన పోరాటంలో ఎనిమిది మంది కార్మికులు కాల్పులలో చనిపోయారని, చనిపోయిన కార్మికుల రక్తంతో తడిసిన జెండానే ఎర్ర జెండా అని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు అన్నారు. మే డే ను పురస్కరించుకుని ఏఐటియుసి కార్మిక భవనంలో జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఎర్ర జెండాకు 140 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. అనేక హక్కులను ఎర్రటి జెండాతో పోరాడి సాధించుకున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 చట్టాలను కాలరాస్తూ నాలుగు కోడలుగా విభజించారని మండిపడ్డారు. 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వినోదం కోసం పోరాటాలు చేస్తే ఇప్పటికీ అది అమలు కావడంలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో నల్ల చంద్రమౌళి, కె.వి అనసూర్య, దుండ్రపెల్లి రవీందర్, పందుల మల్లేశం, ఈసారి దేవయ్య, తోడేటి పవిత్ర,లక్ష్మన్, శాంత, రాధా, నాగరాజు, ఎనగందుల రాజుపాల్గొన్నారు.

## కార్మికలోకం పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** లక్షల గొంతుకలు ఒకటై పోరాడి హక్కులను సాధించుకున్న రోజే మేడే అని, మేడే స్ఫూర్తితో కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం కావాలని, బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మేడే 141వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామంలో హమాలీ కార్మికులు ఏర్పాటు చేసిన మేడే జెండాను సిపిఐ జిలా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. కరీంనగర్ మండలం లోని నగునూరు, బొమ్మకల్, జూబ్లీనగర్, దుర్శేడ్, మొగ్దుంపూర్, చేగుర్తి తదితర గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. అనంతరం చామనపల్లి గ్రామంలో జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. 1886 సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు చిందించిన రక్తం వృధా కాలేదని, ఆ పోరాటాల ఫలితమే నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పేరుతో శ్రమదోపిడీ పెరిగిపోయిందని విమర్శించారు. అన్నిరంగాలను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, చామనపల్లి సర్పంచ్ భోగండ ఐలయ్య, ఉపసర్పంచ్ దూడం శ్రీనివాస్, హమాలీ కార్మిక నేతలు మెరుగు ప్రవీణ్, తిరుపతి, దావు మల్లారెడ్డి, నారాయణ రెడ్డి, రాములు, భూమయ్య, భూసారపు ఐలయ్య తదితరులున్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, రద్దు చేసే వరకు దేశంలోని కార్మికులంతా ఏకమై పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాండు సదానందం పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుత మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఆవిర్భావం కార్మికుల హక్కుల కోసం జరిగిన గొప్ప పోరాటాల ఫలితమన్నారు.19వ శతాబ్దంలో అమెరికాలో కార్మికులు రోజుకు 12–16 గంటలు పని చేయాల్సి వచ్చేదని. దీనికి వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కోసం భారీ ఉద్యమాలు ప్రారంభమయ్యాయని, 1886 మే 1న, అమెరికాలోని చికాగో నగరంలో వేలాది కార్మికులు సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో కడారి సునీల్, మానస్ కుమార్ ,చంద్రగిరి , కొమురయ్యతో పాటు కార్మికులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులు కాలరాస్తున్న పాలకులు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతకాని :** కార్మికులు, కర్షకుల హక్కులను నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకులు కాలరాస్తున్నారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మేడే సందర్భంగా చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి రవీంద్రబాబు ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జమ్ముల మాట్లాడుతూ 8గంటల పని విధానం కావాలని అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికులు చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి దిక్సూచిగా మారిందని మేడే అమరవీరుల పోరాటం ఫలితంగానే నేడు ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పనివిధానం అమలులోకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. నేడు కేంద్రంలో మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ లను మార్చి తిరిగి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా తయారు చేసే విధాలనాలను తీసుకువస్తుందన్నారు. సిపిఐ ఎల్లప్పుడూ కార్మిక పక్షాన అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, పావులూరి మల్లిఖార్జున్ రావు, ఏఐకేఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, నాయకులు దమ్మలపాటి రవీంద్ర, చాట్ల రమేష్, కోపెల విజయ్, షేక్ చిన్న జాన్, చాట్ల సైదులు, ఏపూరి నర్సయ్య, కొమ్ము పిలీప్, పదిలోజు వెంకటేశ్వర్లు, పంది శేఖర్, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న దగ్ధం

**ప్రజాపక్షం/చింతకాని :** కొందరి రైతుల నిర్లక్ష్యం మరికొందరి రైతుల ఆరుగాలం శ్రమ బుగ్గి పాలవుతుంది. శుక్రవారం చింతకాని మండలం లోని పలు గ్రామాల్లో అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మండలంలోని తిమ్మినేనిపాలెం, బస్వాపురం , లచ్చగూడెం ,చింతకాని గ్రామాల్లో కొందరు మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టగా మధ్నాహ్న సమయంలో వీచిన వడగాలలకు అగ్ని గ్రామాల్లోకి ఎగబాకింది. లచ్చగూడెంలో రైతు వంకాయలపాటి కృష్ణకు చెందిన 2ఎకరాల పామాయిల్ తోట దగ్ధదమైంది. తిమ్మినేనిపాలెం, నర్సింహాపురం, బస్వాపురం, చింతకాని గ్రామాల్లో సైతం పలువురి రైతుల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. చింతకాని మండల కేంద్రంలో పొలాల్లోని మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో ఎంఆర్ఒ ఆఫీస్ కాలనీలోకి మంటలు వేగంగా వ్యాపించాయి. సమీపంలోని దుకాణంలోకి మంటలు వ్యాపించి దుకాణం దగ్ధమైంది. సమీపంలోని పెట్రోల్ బంక్ , విద్యుత్ సబ్ స్టేషన్‌లోని మంటలు వ్యాపించే సమయంలో ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. చింతకానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు తన పొలంలో దుక్కి దున్ని ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వెళ్ళడంతో మంటలు అంటుకుని ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది.



## మూడు రోజుల్లో మొక్కజొన్నలు గోదాముకు తరలిస్తాం

రైతులు ఆందోళన చెందొద్దు : జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/చింతకాని :** మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి కాటాలు వేసిన మొక్కజొన్న బస్తాలు మూడు రోజుల్లో గోదాముకు తరాలిస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రైతులకు సూచించారు. శుక్రవారం నాగులవంచ మొక్జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. కాటాలు వేసి 15 రోజులు గడుస్తున్నా బస్తాలు తరలించడం లేదని దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని , రాత్రిళ్లు సైతం కలాల వద్దే కాపలా కాయల్సిన పరిస్థితి ఎదురవుతుందని కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్ళారు. మొక్కజొన్న రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సైతం ఆదేశాలు ఇచ్చారని మూడు రోజుల్లోపై బస్తాలు తరలిస్తామని రైతులు అధైర్య పడవద్దన్నారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ డీఎం శ్యాంకుమార్, మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, గిర్దావర్ ఏకవీర, జీపీవోలు, సహకార సంఘం సిఈవో యాలమూడి శ్రీనివాసరావు ఉన్నారు.

## ఉజ్వల భవిష్యత్‌కు ‘బాల భరోసా’ ఒక వరం : కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉజ్వల భవిష్యత్‌కు బాలభరోసా కార్యక్రమం ఒక వరమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. రామవరంలోని మాత శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా అధ్యక్షతన జిల్లా స్థాయి బాల భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ బాల భరోసా కార్యక్రమం ద్వారా చిన్నారుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను ముందుస్తుగా గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా వారి పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2061 కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య గుర్తింపులో భాగంగా 60వేల మంది చిన్నారులకు ఆన్‌లైన్ పోర్టల్లో వివరాలు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమాధికారి సర్వలత లెనినా తెలిపారు. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా భేటీ జన్మోత్సవ్ నిర్వహించి నెలలోపు పిల్లలకు కిట్లు అందజేశారు. వైద్యారోగ్య సిబ్బంది డా. ప్రతాప్, డా. వినోద్, నాగభూషణం, పి. సంపత్, సిడిపిఓలు లక్ష్మి ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందొద్దు

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మొక్కజొన్న కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రైతులకు భరోసా కల్పించారు. కలెక్టర్ దివాకర టిఎస్ పాలేరు నియోజక వర్గం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, మధిర నియోజక వర్గంలోని చింకాని మండలం నాగులవంచ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ పి. వీరాంజనేయులు, ఎదులాపురం కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఎదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత, మధిర మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నర్సింహారావు, ఆర్డివో శ్రీనివాస్, తహసీల్దార్లు రాంబాబు, వినయేందర్‌రెడ్డి, బాబ్జీ ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరుల త్యాగఫలం కార్మికవర్గానికి దిక్సూచి

మేడే స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చికాగో వీరుల త్యాగఫలం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని, నాడు ఎనిమిది గంటల పనిదినం కోసం ప్రాణాలు అర్పించిన వారి స్ఫూర్తితో హక్కుల పరిరక్షణకు సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవ 141వ మేడే ఉత్సవాలు సిపిఐ, ఎఐటియుసి, ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్లు, హమాలీ అడ్డాలు, ఆటో స్టాండ్‌లు, భవన నిర్మాణ కార్మిక క్షేత్రాలు, యూనియన్, పార్టీ కార్యాలయాలు, గ్రామపంచాయితీ కార్యాలయాల్లో సాబీర్ పాషా ఎర్రజెండాలు ఎగురవేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోస్టాఫీస్ సెంటర్లో నిర్వహించిన భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండా ఆవిష్కరణల అనంతరం జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తోందని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లు మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, ఎస్కే ఫహీమ్, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, రామ్‌చందర్, పొలమూరి శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, పిడుగల శ్రీనివాస్, ధనలక్ష్మి , కూరపాటి సుదాకర్, ధర్మరాజు, బండి నర్సింహా, జహీర్, షాహీన్, మద్దాల హరిత, దాసరి శ్రీనివాస్, అస్మత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

14, 15 డివిజన్లలో మేడే వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని 14, 15 డివిజన్లలో వివిధ ప్రాంతాల్లో సిపిఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలోని సిపిఐ కార్యాలయం వద్ద జిల్లా కార్యవర్గ సభ్యులు మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. బొడ్రాయి సెంటర్‌లో ముద్రబోయిన అప్పారావు, ఎస్సి కాలనీలో కొత్తా నాగేశ్వరరావు, పగడాల బసవయ్య నగర్‌లో రాపోలు కొండలు, అంకమ్మ గుడి వద్ద పోతురాజు వెంకటేశ్వర్లు, ముద్రబోయిన వారి ఇంటి వద్ద తుపాకుల అప్పలస్వామి, ఆటో సెంటర్‌లో బుడిగె ఉపేందర్, వెంకయ్య ఇంటి వద్ద జంగాల శ్రీనివాస్, జంగాల వెంకటయ్య స్తూపం వద్ద వాకదాని వలరాజు జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్యదర్శి రావుల హన్మంతరావు, ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, షేక్ మీరా, చాగంటి వెంకటనర్సయ్య, మాకనబోయిన నాగేశ్వరరావు, జంగాల రాజు, వాకదాని వలరాజు, పోతురాజు వెంకటేశ్వర్లు, తుపాకుల శ్రీకాంత్, లింగం సూరి, మేడా చిన్ని, కొత్తా ప్రసాద్, బుడిగె ఉపేందర్, పగడాల వెంకటేశ్వర్లు, పకీర్‌సాహెబ్, చింతకాయల హన్మంతరావు, శ్రీనివాస్, రజబ్‌అలీ, వీరయ్య, శ్రీను, ఉపేందర్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.




## కార్మికుల పక్షపాతి కెసిఆర్

మేడే వేడుకల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిఆర్‌ఎస్ హయాంలో కెసిఆర్ పదేళ్ల పాలనలో కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి కార్మికుల పక్షపాతిగా నిలిచారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. 141వ మేడేను పురస్కరించుకుని బిఆర్‌టియు నాయకులు పాషా, సత్తార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం రైతు బజార్ ఆటో అడ్డా నందు ఏర్పాటు చేసిన బిఆర్‌టియు జెండాను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల త్యాగాలు వారి కష్టాలను యావత్ సమాజం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు పగడాల నాగరాజు, కార్పొరేటర్ జ్యోతిరెడ్డి, బిక్కసాని జశ్వంత్, ఖమర్, తాజుద్దీన్, బత్తుల మురళి, గొల్లపూడి రాంప్రసాద్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సకల దేశ కార్మికుల పండుగ మేడే

కార్పొరేటర్ బిజి క్లెమెంట్, రాష్ట్ర నాయకుడు శింగు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** 141వ మేడేను పురస్కరించుకుని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మేడే సందర్భంగా నూతన కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ జెండాను ఆవిష్కరించారు. గాంధీచౌక్ వద్ద సిండికేట్ హమాలీ కార్మికులు ఏర్పాటు చేసిన వేడుకల్లో రాష్ట్ర నాయకుడు శింగు నర్సింహారావు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. బస్ డిపో ఎదురుగా ఏర్పాటు చేసిన జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ఆవిష్కరించారు. ఇండస్ట్రీయల్ ఏరియా గ్రానైట్ కార్మికులు, జెడ్పి సెంటర్ పెయింటింగ్ కార్మికులు ఏర్పాటు చేసిన జెండాలను జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, బ్యాంకు ఉద్యోగులు ఏర్పాటు చేసిన జెండాను రాష్ట్ర నాయకులు కనకం జనార్ధన్ ఆవిష్కరించారు. బిఎస్ఎన్‌ఎల్ వద్ద రాష్ట్ర నాయకులు నాంచారయ్య ఆవిష్కరించారు. కొత్త బస్టాండ్ ఎదురుగా జెండాను జిల్లా ఉపాధ్యక్షులు పేరబోయిన మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాటి అప్పారావు, ఎండి జాకీరుద్దీన్, జిల్లా సమితి సభ్యులు నకిరికంటి కృష్ణ, బుర్రి ఉపేందర్, మహేష్, శోభన్‌బాబు, రాంబాబు, సిండికేట్ హమాలీ శ్రీను, రమేష్, పెయింటర్స్ యూనియన్ నాయకులు గోపి, దేవా, శ్రీను, బిఎస్ఎన్ఎల్ నాయకులు దుర్గారావు, నాగేశ్వరరావు, ఆర్టిసి యూనియన్ నాయకులు బిఎస్‌రెడ్డి, జిఎస్‌రావు, బివిరెడ్డి, బుచ్చిబాబు, ఎఐబిఎ నాయకులు నాగేంద్రబాబు, రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు రాయల శ్రీను, మేనయ్య, అనూష, నాగమణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను పరిరక్షించాలి

మేడే వేడుకల్లో అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మేడే వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల భావజాలానికి నిలయంగా ఉండి అనేక మంది నాయకులను అందించిందని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడటం కమ్యూనిస్టు భావాజలం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ కార్మిక సంఘాల్లో వారు చురుగ్గా పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ కార్మిక చట్టాల ప్రకారం హక్కులు ఉంటాయన్నారు. విదేశీ ఉపాధి కోసం టామ్ కామ్ ద్వారా భాషా శిక్షణ, స్థానిక నిబంధనలు అవసరమైన నైపుణ్యాలు అందించి కార్మికులకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం నైపుణ్యాలు ఉన్న వారికి ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. నిరుద్యోగులు టామ్ కామ్, ఎటిసి, డిఇఇటి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. గతేడాదిలో కార్మిక శాఖ పలు కార్యక్రమాల ద్వారా 7,498 మంది కార్మికులకు 35.38 కోట్ల విలువైన సాయం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక శాఖ కమిషనర్ కె.విజయ్‌భాస్కర్‌రెడ్డి,జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్.మాధవి, సంబంధిత అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేందర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎస్టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు. శుక్రవారం ఎస్టియు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే పిఆర్‌సి సిఫారసులను అమలు చేస్తామని చెప్పి ఇచ్చిన మాట తప్పడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే ఏకమొత్తంలో విడుదల చేయాలన్నారు. బకాయిలు పడిన ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను అమలు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రాల్లో ఎంప్లాయీస్ జేఏసి ఆధ్వర్యంలో మే ఐదున నిర్వహించే నిరాహార దీక్షలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఎం. పర్వతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అలీ, ఆర్థిక కార్యదర్శి శ్రీధర్, సైదా, నరేందర్, రాము, జగదీష్, వెంకటేశ్వర్లు, వనజాకుమారి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కెబిఆర్ నగర్‌లో దొంగల భయం

కర్రలు పట్టుకొని రాత్రిపూట కాలనీవాసుల గస్తీ

పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 5వ వార్డులో గల కెబిఆర్‌నగర్ కాలనీవాసులు దొంగల భయంతో బెంబేలెత్తుతున్నారు. దీంతో వారే స్వయంగా కర్రలు పట్టుకొని కాలనీ రక్షణ కోసం రాత్రిపూట గస్తీ కాస్తున్నారు. ఎప్పుడైనా దొంగలు దాడికి దిగుతారేమోనన్న భయంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... నాలుగు రోజుల క్రితం రాత్రి సుమారు 12.30గంటల సమయంలో గుర్తుతెలీని వ్యక్తులు కాలనీలో అనుమానాస్పదంగా సంచరించారు. ఈ సమయంలో ఉపేందర్ అనే వ్యక్తి ఇంటి నుంచి బైటకు రావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే వారి చేతిలో పెద్ద రాడ్లు ఉన్నట్లు గుర్తించాడు. అనంతరం కాలనీవాసులకు తెలియజేడంతో వారు అప్రమత్తమయ్యి పోలీసులకు సమాచారం అందించారు.
హుటహుటిన ఘటన స్థలికి చేరుకున్న పోలీసులను పరిస్థితిని పరిశీలించారు. తాజాగా గురువారం రాత్రి మళ్లీ 1గంట సమయంలో కొంత మంది అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని ఓ కాలనీవాసి గమనించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కాలనీవాసులు మరింత అప్రమత్తమయ్యి గస్తీ కాశారు. ఇటీవల చోరీ యత్నాలు జరుగుతన్నాయనే వార్తల నేపథ్యంలో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రాత్రివేళల్లో బయటకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీలో భద్రతా చర్యలు పెంచాలని, రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.





## మధిరలో ఘనంగా మే డే వేడుకలు

**ప్రజాపక్షం/మధిర :** 141 మేడే వేడుకలు మధిర మండల వ్యాప్తంగా సిపిఐ, అనుబంధ ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ ప్రజా సంఘాల శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని దెందుకూరు గ్రామంలో అమరజీవి కామ్రేడ్ తలారి వెంకటేశ్వరరావు స్మారక స్థూపం వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు జెండాను ఆవిష్కరించారు. మధిర పట్టణంలోని ఎఐటియుసి నాయకులు అమరజీవి వట్టికొండ అనీల్‌కుమార్ స్మారక స్థూపం వద్ద సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు, మధిర మున్సిపల్ కార్యాలయం ఎఐటియుసి స్థూపం వద్ద ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, అమరజీవి కామ్రేడ్ వాసిరెడ్డి వెంకటపతి స్మారక స్థూపం వద్ద రైతు సంఘం నేత పంగా శేషగిరిరావులు జెండాను ఆవిష్కరించారు. ఆర్టీసి యూనియన్ కార్యాలయం, పోస్టాఫీస్ కార్యాలయం సెంటర్, ఆటో యూనియన్ సెంటర్ తదితర చోట్ల ప్రజా సంఘాల నేతలు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపి, ఎఐటియుసి నాయకులు తలా రమేష్, అన్నవరపు సత్యనారాయణ, ఊట్ల రామకృష్ణ, కొండూరి నాగేశ్వరరావు, నాయకర్, వి.రామారావు, కోటయ్య, నాగేంద్రమ్మ, మున్సిపల్ కార్మిక నాయకులు సురేష్, రమేష్, ఆర్టిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరులో మేడే ఉత్సవాలు

**ప్రజాపక్షం/మణుగూరు :** మేడే ఉత్సవాలను సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మణుగూరు మండలం, పట్టణంలో పెద్ద ఎత్తున 141వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ గ్రామాన బస్తీలలో, శాఖలలో, కార్మిక వాడల్లో మేడే జెండాలను సుమారు 50 జెండాలను ఎగరవేశారు. బొగ్గు ముఠా రజబ్ అలీ కార్యాలయం ముందు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి మేడే జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎస్కె సర్వర్, జిల్లా సమితి సభ్యులు సొందే కుటుంబరావు, మాజీ ఎంపిటిసి కామిశెట్టి రామారావు, మాజీ సర్పంచ్ బాడిస సతీష్, ఉప సర్పంచ్ పులిగిల్ల రమేష్, ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్షులు రాయల భిక్షం, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, కొత్తపల్లి సీతారాములు, ఆధార్ ఎస్వి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యత, వేగంపై అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు

దామరచర్లలో పనుల పురోగతిపై సమగ్ర పరిశీలన

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** చంద్రుగొండ మడలం దామరచర్ల గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 25 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, 28 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ అంకిత్ సి లక్ష్మి , బి హనుమంతరావు, బి రవి లబ్దిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్దిదారులతో నేరుగా మాట్లాడి ఖర్చులు, ప్రభుత్వం విడుదల చేసిన నిధులు వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతను కచ్చితంగా పాటిస్తూ, నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీఓ ఖాజా మొహినుద్దీన్, ఆర్ఐలు అశోక్, తిరుపతిరావు, పంచాయితీ కార్యదర్శి ఇస్మాయిత్, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ బ్రాంచ్ సిఐకి ఉద్యోగోన్నతి

అభినందించిన సిపి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం స్పెషల్ బ్రాంచ్‌లో సిఐ గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ రాజిరెడ్డికి డిఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తన కార్యాలయంలో రాజిరెడ్డికి డిఎస్పీ చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. పదోన్నతులు బాధ్యతలను పెంచుతాయని ఆదిశగా పోలీసుశాఖకు ఉన్నత సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందాలని సిపి ఆకాంక్షంచారు.

# రికార్డు స్థాయిలో ఏప్రిల్ జిఎస్‌టి వసూళ్లు




**న్యూఢిల్లీ :** ఏప్రిల్ నెలలో వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నెలలో స్థూల జిఎస్‌టి వసూళ్లు రికార్డు స్థాయిలో 8.7 శాతం పెరిగి సుమారు రూ.2.43 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో నమోదైన జిఎస్‌టి వసూళ్లు రూ.2.23 లక్షల కోట్లే ఇప్పటి వరకు అత్యధికం కాగా, తాజాగా ఆ రికార్డు బద్దలైంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభంలో దేశీయ వసూళ్లు కంటే, దిగుమతి ఆధారిత పన్నుల్లో భారీ పెరుగుదల నమోదు కావడమే ఇందుకు ప్రధాన కారణం. 2026 ఏప్రిల్‌లో దిగుమతుల ద్వారా వచ్చే జిఎస్‌టి వసూళ్లు ఏకంగా 25.8 శాతం వృద్ధితో రూ.57,580 కోట్లకు చేరుకున్నాయి. 2025 ఏప్రిల్‌లో నమోదైన రూ.45,754 కోట్లతో పోల్చితే ఇది 25.8 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఈ 2026 ఏప్రిల్‌లో దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన స్థూల ఆదాయం 4.3 శాతం పెరిగి రూ.1,85,122 కోట్లకు చేరింది. ఈ దేశీయ వసూళ్లలో సెంట్రల్ జిఎస్‌టి (సిజిఎస్‌టి) రూ.52,140 కోట్లు, స్టేట్ జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) రూ.61,331 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి (ఐజిఎస్‌టి) రూ.71,651 కోట్లుగా ఉన్నాయి. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జిఎస్‌టి వసూళ్లు 7.3 శాతం వృద్ధితో దాదాపు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాదితో పోలిస్తే 7.3 శాతం వృద్ధి. కాగా, ఈ ఏప్రిల్ నెలలో రీఫండ్‌లు కూడా 19.3 శాతం పెరిగి రూ.31,793 కోట్లకు చేరాయి. ఇందులో దేశీయ రీఫండ్‌లు 54.6 శాతం భారీ వృద్ధితో రూ.19,996 కోట్లకు చేరగా, ఐసిఇజిఎటిఇ ఈ వ్యవస్థ ద్వారా వచ్చే ఎగుమతి సంబంధిత రీఫండ్‌లు 14 శాతం క్షీణించి రూ.11,797 కోట్లకు పడిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ, వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అంతేకాదు ఈ కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభంలో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతను ఇది తెలియజేస్తోంది.

**రాష్ట్రాల వారీగా**

ఏప్రిల్ నెలలో మహారాష్ట్ర (+40 శాతం), కర్ణాటక (+42 శాతం), తెలంగాణ (+36 శాతం), పుదుచ్చేరి (+108 శాతం) లాంటి రాష్ట్రాలు ఎస్‌జిఎస్‌టి వసూళ్లు బలమైన వృద్ధిని కనబరిచాయి. కాగా లడాఖ్ (8శాతం), ఝార్ఖండ్ (0 శాతం)ల్లో జిఎస్‌టి వసూళ్లు తగ్గడం లేదా ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. కాగా, గత నెల (2026 మార్చి) భారత స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2,00,064 కోట్లుగా ఉండగా, గతేడాది ఇదే (2025 మార్చి) సమయంలో వసూలైన రూ.1,88,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం పెరుగదల కావడం గమనార్హం. వాస్తవానికి ఏప్రిల్‌లో రాష్ట్రాల వారీగా చూస్తే, జిఎస్‌టి వసూళ్లలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో స్థిరమైన వృద్ధి కనిపించింది. ఉత్తరప్రదేశ్, హర్యానాలో కూడా మంచి ఫలితాలే సాధించాయి. అయితే బిహార్, అసోం, బంగాల్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో సెటిల్‌మెంట్‌కు ముందు వచ్చే ఆదాయంలో క్షీణత కనిపించింది.

### ఇంధన ధరల పెరుగుదల, తగ్గుతున్న కొనుగోలు శక్తి...

# ప్రపంచవ్యాప్తంగా మేడే ర్యాలీలు, కార్మికుల కవాతు







**పారిస్ :** 'మే' డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికలోకం 'మే'డే పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకుంది. శాంతి, అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం పిలుపునిస్తూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు మేడే ర్యాలీలలో కవాతు చేశారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరలు, తగ్గుతున్న కొనుగోలు శక్తితో అసంఖ్యాక కార్మికులు సతమతం అవుతున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా 'మే' డే సంబరాలు అంబరాన్ని అంటాయి. అనేక దేశాలలో ఈరోజు (మే 1) సెలవు దినంగా ప్రకటించబడింది. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రధాన నగరాలలో కార్మికుల ప్రదర్శనలు జరుగుతాయని భావిస్తున్నారు. 'డోనాల్డ్ ట్రంప్ మధ్యప్రాచ్యంలో సాగిస్తున్న యుద్ధానికి శ్రామిక ప్రజలు మూల్యం చెల్లించడానికి నిరాకరిస్తున్నారు' అని యురోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ తెలిపింది. 41 యురోపియన్ దేశాల్లో 93 కార్మిక సంఘాల సంస్థలకు ఈ యురోపియన్ యూనియన్ కాన్ఫెడరేషన్ ప్రాతినిథ్యం వహిస్తోంది. తమ ఉద్యోగాలు, జీవన ప్రమాణాలు నాశనం అవుతుంటే చూస్తూ ఊరుకోరని నేటి ర్యాలీలు నిరూపించనున్నాయని కాన్ఫెడరేషన్ తెలియజేసింది.

**పెరుగుతున్న ఇంధన ధరలు, జీవన వ్యయాలు..**

మధ్య ప్రాచ్యంలోని సంఘర్షణకు సంబంధించి పెరుగుతున్న జీవన వ్యయాలు శుక్రవారం నాటి ర్యాలీలో ఒక కీలక అంశంగా ఉండబోతోందని భావిస్తున్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో భారీ సంఖ్యలో కార్మికులు వస్తారని తాము భావిస్తున్నట్లు నిరసన నిర్వాహకులు తెలియజేశారు. ఇంధన ధరలు భారీగా పెరగడం వల్ల అధికవేతనాలు, ఆర్థిక ఉపశమనం కోసం డిమాండ్లు మరింత బలంగా వినిపిస్తాయి అని వామపక్ష రాజకీయ సంస్థ 'బయాన్' నాయకుడు రెనాటో రెయెస్ 'అసోసియేటెడ్ ప్రెస్'కు తెలియజేశారు. పాకిస్థాన్‌లో మేడే అనేది ర్యాలీలతో కూడిన ప్రభుత్వ సెలవు దినం. కానీ చాలామంది రోజువారీ కూలీలు సెలవు తీసుకోడానికి ఆర్థికంగా భరించలేరు, 'పనిలేనట్లయితే కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు ఇంటికి ఎలా తీసుకువస్తాను' అని ఇస్లామాబాద్ సమీపంలో నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న 55ఏళ్ల మొహమ్మద్ మస్కీన్ చెప్పారు.

**ప్రపంచవ్యాప్తంగా నిరసనలు...**

సియోల్, జకార్తా, ఇస్తాంబుల్ మొదలు చాలా యురోపియన్ రాజధానులు యురోపియన్ స్టేట్స్ వ్యాప్తంగా ఉన్న నగరాల వరకూ నిరసనల నిర్వహణకు ప్రణాళికలు రచించారు. ఫ్రాన్స్‌లో కార్మిక సంఘాలు ''బ్రెడ్, పీస్, ఫ్రీడమ్''నినాదంతో పారిస్‌లో, ఇతర చోట్లా ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. కార్మికుల రోజువారీ సమస్యలను ఉక్రెయిన్, మధ్య ప్రాచ్యంలోని సంఘర్షణలతో ముడిపెట్టాయి. పోర్చుగల్‌లో ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక చట్ట సవరణలు గత ప్రభుత్వం గత సంవత్సరం సార్వత్రిక సమ్మెకు వీధి నిరసనలకు దారితీశాయి.

**ఫ్రాన్స్‌లో తప్పనిసరి 'డే ఆఫ్'...**

ఈ ఏడాది ఫ్రాన్స్‌లో మేడే కి ఒక ప్రత్యేక అర్థం ఉంది. వ్యాపారాలు, దుకాణలు, మాల్స్ మూసివేయబడ్డాయి. కేవలం ఆసుపత్రులు, రవాణ, హోటళ్లువంటి అత్యవసర రంగాలకు మినహాయింపు ఉంది. ఆ రోజున పనిని విస్తరించడానికి ఇటీవల పార్లమెంట్ ప్రతిపాదన కార్మిక సంఘాలు, వామపక్ష రాజకీయ నాయకుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. మేడేను ముట్టుకోవద్దు అని కార్మిక సంఘాలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. 'మే 1 వ తేదీ ఏదో ఒక సాధారణ రోజు కాదు' అని చిన్న మధ్యతరహా వ్యాపారాల శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ అన్నారు.

**అమెరికాలో వీధి నిరసనలు, బహిష్కరణలకు పిలుపు**

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మేడే ఫెడరల్ సెలవు దినం కానప్పటికీ, కార్మికులు, కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా వీధినిరసనలు, బహిష్కరణలను నిర్వహిస్తున్నాయి. యాక్టివిస్ట్స్ గ్రూప్స్, కార్మిక సంఘాల కూటమి అయినటువంటి మేడే స్ట్రాంగ్ స్పందిస్తూ 'బిలియనీర్ల కన్నా కార్మికులే గొప్ప' అనే నినాదంతో నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చింది.



**చికాగోలో మూలాలు..**

మే డే లేదా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అమెరికా కార్మిక చరిత్రలోని ఒక కీలక కాలంతో ముడిపడి శతాబ్దానికి పైగా చరిత్రను కలిగి ఉంది. 1880లలో కార్మిక సంఘాలు 8గంటల పనిదినం కోసం సమ్మెలు, ప్రదర్శనలు నిర్వహించి ఒత్తిడి తెచ్చాయి. 1886 మేలో చికాగోలో జరిగిన ఒక ర్యాలీలో బాంబు పేలడంతో పోలీసులు కాల్పులు జరిపి ఆ ర్యాలీని హింసాత్మకంగా మార్చారు. పలువురు కార్మిక నాయకులు వారిలో విదేశీయులపై కుట్ర నేరాభియోగాలు మోపారు. నలుగురికి మరణశిక్ష విధించారు. ఆ తర్వాత కార్మిక సంఘాలు కార్మికులను గౌరవించేందుకు మే 1వ తేదీని ప్రపంచ కార్మిక దినోత్సవంగా కేటాయించారు. చికాగోలోని హే మార్కెట్ స్క్వేర్‌లో ఉన్న ఒక స్తంభం 'ప్రపంచంలోని కార్మికులు అందరికీ అంకితం' అనే నినాదంతో వారిని స్మరించుకుంటోంది. ప్రస్తుతం లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా సహా ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో మేడేను పాటిస్తున్నారు.

# కర్నాటకలో నాయకత్వమార్పుపై చర్చలకు కాని ఖరారు తేదీ

- నాయకత్వానికి సంబంధించిన ఏ నిర్ణయమైనా సరైన సంప్రదింపుల తర్వాతే : ఖర్గే



**కలబురగి :** కర్ణాటకలో నాయకత్వ మార్పుపై చర్చించేందుకు ఇంకా ఎలాంటి తేదీని ఖరారు చేయలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మధ్య అధికార పోరుపై ఊహాగానాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. శుక్రవారం కలబురగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ నాయకత్వానికి సంబంధించిన ఏ నిర్ణయమైనా సరైన సంప్రదింపుల అనంతరం పార్టీ హైకమాండ్ సమష్టిగా తీసుకుంటుందని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించుకోవద్దని కూడా ఆయన హెచ్చరించారు. 'ఎఐసిసి అధ్యక్షుడిగా నేను, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలిగా సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ కలిసి నిర్ణయం తీసుకుంటాం' అని ఆయన వివరించారు. తాము ముగ్గురం కలిసి ఒక తేదీని ఖరారు చేసినప్పుడు నిర్ణయం తీసుకుంటామని, ఇంకా తేదీ ఖరారు కానందున, మార్పు జరుగుతోందా లేదా అని నేను ఎలా చెప్పగలను? అని అన్నారు. ఏదైనా నిర్ణయానికి వచ్చే ముందు కాంగ్రెస్ నాయకత్వం సంప్రదింపుల ప్రక్రియను అనుసరిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. 'హైకమాండ్‌లో మేము మాలో మేమే విస్తృతంగా చర్చించుకుంటాము, అలాగే ఇతర సీనియర్ నాయకులను కూడా సంప్రదిస్తాము. దాని ఫలితం ఎలా ఉంటుందో పరిశీలించి, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాము' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. ఇంకా ఏ కాలపరిమితిని ఖరారు చేయలేదని నొక్కి చెబుతూ, 'అది జరిగినప్పుడు, నేను మీకు తప్పకుండా తెలియజేస్తాను. దయచేసి దీనిని తప్పుగా అన్వయించుకోవద్దు' అని ఆయన అన్నారు. తప్పుడు ప్రచారాన్ని నివారించడానికి తాను తరచుగా బహిరంగంగా వ్యాఖ్యానించకుండా ఉంటానని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను నొక్కిచెబుతూ, ఏ తుది నిర్ణయమైనా అందరికీ కట్టుబడి ఉంటుందని ఖర్గే అన్నారు. 'ఏ నిర్ణయం తీసుకున్నా, అది రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటుంది. హైకమాండ్ తీసుకునే ఏ నిర్ణయానికైనా ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది' అని ఆయన అన్నారు. గురువారం, కర్ణాటకలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఏమీ లేదని, రాష్ట్రంలోని నాయకత్వ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని ఖర్గే చెప్పారు.

# మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి

### కొత్త కార్మిక చట్టాన్ని సమీక్షించాలి • ఎంజి నరేగాను పునరుద్ధరించాలి : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని ఆరోపించింది. కొత్త కార్మిక చట్టాన్ని సమీక్షించాలని, ఎంజి నరేగాను పునరుద్ధరించాలని, అలాగే రోజుకు రూ.400 జాతీయ కనీస వేతనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. భారతదేశంలో నేటి నిరుద్యోగానికి 'హమ్ దో, హమారే దో' విధానాలే ప్రత్యక్ష కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మలిలకార్జున ఖర్గే ఆరోపించారు. 'హమ్ దో, హమారే దో' విధానంతో ప్రేరేపించబడి, మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్మిక చట్టాన్ని అమలు చేసింది. ఫలితంగా, నోయిడాలో, పానిపట్‌లోని ఐఒసిఎల్ ప్లాంట్‌లో, రైఖేడాలోని అదానీ ఫ్యాక్టరీలో, ఎన్‌పిసిసి పత్రాతులో, లేదా శ్రీపెరుంబుదూర్‌లోని శాంసంగ్ ఫ్యాక్టరీలో ఇలా అన్నిచోట్లా అశాంతి చెలరేగింది' అని ఖర్గే ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడానికి బదులుగా, ఈ చట్టం కాంట్రాక్ట్ కార్మికులు, 'హైర్ అండ్ ఫైర్' వంటి విధానాలను ప్రోత్సహిస్తోందని ఖర్గే అన్నారు. కొత్త కార్మిక చట్టాన్ని సమీక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బలవంతంగా చట్టాన్ని ఆమోదింపజేయడం ద్వారా ఎంజి నరేగాను సమర్థవంతంగా నిర్వీర్యం చేసిందని ఆయన ఆరోపించారు. 'మోదీ 40 శాతం వేతన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపైకి మార్చారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆర్థిక భారాన్ని భరించలేకపోతున్నాయి. చివరికి పని కల్పించడం ఆపివేయవలసి వస్తుంది'అని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులను నిరుద్యోగంలోకి నెట్టివేసి, వారిని 'గిగ్ వర్క్' వైపు మళ్లించిందని ఖర్గే అన్నారు. ప్రస్తుతం, 69 శాతం కార్మిక శక్తి చట్టబద్ధమైన కనీస వేతనం కంటే తక్కువ వేతనాలకు పనిచేస్తోందని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం స్తంభించిపోయిన వేతనాల సంక్షోభాన్ని సృష్టించిందని ఖర్గే ఆరోపించారు. ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేసినప్పుడు, గత దశాబ్దంలో (2014–15 నుండి 2022–23 వరకు) భారతదేశంలోని అత్యధిక కార్మికుల వేతనాలు సంవత్సరానికి ఒక శాతం కంటే తక్కువగా పెరిగాయి అని ఆయన అన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావంతులలో, ముఖ్యంగా పట్టభద్రులలో భారీ నిరుద్యోగ సంక్షోభాన్ని సృష్టించిందని ఖర్గే ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యుల) అమ్మకం ద్వారా ఉద్యోగాలను తొలగించారని ఆయన అన్నారు. 'సుమారు 30 లక్షల ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం నిరాకరించింది. అంతేకాకుండా, ప్రభుత్వ విధానపరమైన తప్పిదాలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) నాశనానికి దారితీశాయి' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. భారత కార్మికుల కోసం ఎంజి నరేగాను పునరుద్ధరించడం, దానిని పట్టణ ప్రాంతాలకు విస్తరించడంతో సహా తమ ఐదు డిమాండ్లను కాంగ్రెస్ పునరుద్ఘాటిస్తోందని ఖర్గే తెలిపారు. ఎంజి నరేగాను దాని పరిధిలోకి చేర్చి, రోజుకు రూ.400 జాతీయ కనీస వేతనాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కార్మికులకు రూ.25 లక్షల వరకు సార్వత్రిక ఆరోగ్య కవరేజీని అందించే 'ఆరోగ్య హక్కు' చట్టాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని ఖర్గే డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులందరికీ జీవిత బీమా, ప్రమాద బీమా కవరేజీని అందించాలి. ఉపాధిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చడాన్ని నిరోధించడాన్ని ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యతగా చేసుకోవాలి, కొత్త కార్మిక చట్టాలను సమీక్షించాలి అని ఖర్గే నొక్కి చెప్పారు.

### రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి

# కొన్ని శక్తులు ముప్పు కలిగిస్తున్నాయ్

- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్



**లక్నో :** నేడు ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిన దేశాలన్నీ బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి కొన్ని శక్తులు నిరంతరం ముప్పు కలిగిస్తున్నాయని ఆయన ఉద్ఘాటించారు. బుద్ధ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'మానవాళికి ఎప్పటికప్పుడు అందించబడిన జ్ఞానంలో బుద్ధుని కృషి అత్యంత గొప్పది. ఆయన తన సందేశాన్ని భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయడానికి కృషి చేశారు. నేడు అగ్రస్థానంలో నిలిచిన దేశాలన్నీ బుద్ధుడు చూపిన మార్గాన్నే అనుసరించాయి. ఆయన అందించిన సందేశం సమాజంలో ఒక గొప్ప మార్పును తీసుకువచ్చింది' అని చెప్పారు. బౌద్ధ భిక్షువులు కూడా హాజరైన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రస్తుతం క్లిష్ట సమయాలు నడుస్తున్నాయని యాదవ్ వ్యాఖ్యానించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగానికి, అలాగే ప్రజాస్వామ్యానికి నిరంతరం ముప్పు కలిగిస్తున్న శక్తులు కొన్ని ఉన్నాయన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అయిన యాదవ్, రాష్ట్రంలో బుద్ధునితో అనుబంధం ఉన్న ప్రదేశాలైన లుంబిని, సారనాథ్ లేదా కుశీనగర్ వంటి వాటిని భవిష్యత్తులో సమాజ్‌వాదీ పార్టీ (ప్రభుత్వం) ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం ద్వారా 'బహుజన సమాజ్' ప్రజలను, అలాగే బుద్ధుని మార్గాన్ని అనుసరించే వారిని ప్రపంచంతో అనుసంధానించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 'మైత్రేయ ప్రాజెక్టు' ను ప్రస్తావిస్తూ 'కుశీనగర్‌లో మైత్రేయ ప్రాజెక్టు ఏర్పాటు కావడాన్ని కొందరు వ్యక్తులు ఇష్టపడలేదు, ఎందుకంటే అది ఒక భారీ ప్రాజెక్టు. శ్రీలంక, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి బౌద్ధ సన్యాసులు ఈ ప్రాజెక్టుకు సహకారం అందించడానికి ముందుకు వచ్చినప్పుడు, అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం ఇప్పటికే భారీ ఎత్తున భూమిని సేకరించి, రైతులకు తగిన పరిహారం కూడా చెల్లించింది. ఆ ప్రాజెక్టు గనుక పూర్తయి ఉంటే, కేవలం దేశం నుండే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఆ ప్రదేశాన్ని సందర్శించి, బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తామని ప్రతిజ్ఞ చేసి ఉండేవారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆ ప్రాజెక్టు అసంపూర్ణంగానే మిగిలిపోయింది; వారు ఆ ప్రాజెక్టును ముందుకు సాగనివ్వలేదు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయం గురించి యాదవ్ మాట్లాడుతూ, 'కుషినగర్ విమానాశ్రయం నిర్మాణం బిఎస్‌పి హయాంలోనే ప్రారంభమైంది, కానీ అది పూర్తి కాలేదు. సమాజ్‌వాదీ పార్టీ (అధికారంలోకి) వచ్చినప్పుడు, మేము దానిని నిర్మించాము. కేవలం అమ్మేయడానికే ప్రారంభోత్సవం చేసినవారు దానిని ప్రారంభించగలిగారే తప్ప అమ్మలేకపోయారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, అలాగే ఒక అంతర్జాతీయ నగరం నిర్మించబడుతుందని మేము మీకు హామీ ఇస్తున్నాము' అని అన్నారు.

# పవన్ ఖేరాకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రిణికి భూయాన్‌పై వ్యాఖ్యల కేసులో పవన్ ఖేరాకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారంనాడు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. న్యాయమూర్తులు జకె మహేశ్వరి, ఎఎస్ చందూర్‌కర్‌తో కూడిన ధర్మాసనం పలు షరతులపై పవన్ ఖేరాకు ముందస్తు బెయిలు ఇచ్చింది. దీనిపై కోర్టు గురువారంనాడు తీర్పును రిజర్వ్ చేసి శుక్రవారం ప్రకటించింది. ఈ కేసులో విచారణకు పవన్ ఖేరా సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరు కావాలని, సాక్ష్యాలను తారుమారు చేసే చర్యలకు పాల్పడకూడదని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని సుప్రీం ధర్మాసనం షరతులు విధించింది. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ విచారణ కోర్టుకు ఉంటుందని కూడా తెలిపింది. రిణికి భూయాన్ శర్మ మూడు విదేశీ పాస్‌పోర్టులు, లెక్కల్లో చూపించని విదేశీ ఆస్తులు కలిగి ఉన్నట్టు పవన్ ఖేరా ఇటీవల సంచలన ఆరోపణలు చేశారు. రిణికి భూయాన్ ఫిర్యాదు చేయడంపై గువాహటిలో కేసు నమోదైంది. ఈ క్రమంలో పవన్ ఖేరాకు తెలంగాణ హైకోర్టు ఏడు రోజుల ముందస్తు బెయిలు ఇచ్చింది. దీనిపై అసోం పోలీసులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిలుపై సుప్రీంకోర్టు స్టే ఇస్తూ తాత్కాలిక ఆదేశాలిచ్చింది. గువాహటి హై కోర్టును ఆశ్రయించాలని ఖేరాకు సూచించింది. అనంతరం ఖేరాకు ముందస్తు బెయిలు ఇచ్చేందుకు గువాహటి హైకోర్టు నిరాకరించింది. దీనిని సుప్రీంకోర్టులో ఖేరా సవాలు చేశారు.


**CHANGE OF NAME**

I, **DIDDI SHIVA SUBRAMANYAM,** S/o. **Diddi Suresh,** (New name), H.No. 16-9-571, Bank colony, Warangal (Dist).T.G.,I have changed my name **KIRAN** (Old name) to **DIDDI SHIVA SUBRAMANYAM** (New name) for all future purpose.

**PUBLIC NOTICE**

The general public are hereby informed that **Sri. Rajeev Kant Gir S/o. Sri. Keval Kant Gir**, aged about 54 years, R/o. flat No:307 On Third Floor, (Muncipal no:8-1-305 & 306/307 PTIN No: 1100859894), in premises bearing no:8-1-305 & 306 in sy. No:14, situated at Puran Bagh,Tolichowki, Shaikpet Village, Golconda Mandal, Hyderabad, approached to my client M/s. Shriram Finance Ltd., Marredpally Branch Secunderabad to obtain Loan by way of creating mortgage the below mentioned property by way of deposit of original Regd. sale Deed No. 2800/2026, dt. 27.04.2026, registered by SRO, Banjara Hills in his favour with my client towards secure the Loan amount. If any person/s or Financial institutions have any objections, claim or interest or Right in the below mentioned property may approach the undersigned within seven days from the date of this publication, otherwise my client will proceed with the transaction.

**SCHEDULE OF THE PROPERTY**

All that the flat No.307 On Third Floor, (Muncipal no:8-1-305 & 306/307 PTIN No: 1100859894), the Apartment known as ANAND BRINDAVAN comprised of built up area 2089.20 sq., feet including common area with two car parking lots one parking lot in stilt floor and one parking lot in cellar floor, together with undivided share of land 50 sq., yards, in premises bearing no:8-1-305 & 306 in sy. No:14, situated at Puran Bagh,Tolichowki, Shaikpet Village, Golconda Mandal, Hyderabad, and bounded by: **ENTIRE LAND- NORTH:** Property belongs to Sandhya Gir and Ajay Kant Gir, **SOUTH :** Private Road, **EAST**: Private Road, **WEST:** Property belonging to Y.Sreeram Muthy and others. **FLAT - NORTH:** Lobby 5' feet 10" wide and duct, **SOUTH:** Open to sky, **EAST**: Duct/Open to sky, **WEST:** Open to sky.

**N.V.RAMANA MURTHY,**
**B.COM., LL.B., ADVOCATE,**
**1-2-215/15/2, DOMALGUDA,**
**HYDERABAD.**
**PHONE:9440142424.**


# బెంగాల్, పుదుచ్చేరిలో భారీగా ఓటింగ్‌లో పాల్గొన్న థర్డ్‌జెండర్లు



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశలో థర్డ్‌జెండర్ ఓటర్ల పోలింగ్ శాతం భారీగా నమోదైంది. వీరిలో 91.28 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలో జరిగిన రెండు దశలలో కలిపి మొత్తం 1,257 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. మొదటి దశలో 465 మంది, రెండో దశలో 792 మంది ఉన్నారు. మొదటి దశలో వీరి పోలింగ్ శాతం 56.79గా ఉండగా, రెండో దశలో అది గణనీయంగా పెరిగి 91.28 శాతానికి చేరుకుంది. అయితే, ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలలో థర్డ్‌జెండర్ ఓటర్ల పోలింగ్ శాతంలో పుదుచ్చేరి అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ 91.81 శాతం మంది ఓటు వేశారు. పుదుచ్చేరిలో మొత్తం 139 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారని, వీరిలో 91.81 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. తమిళనాడులో 7,728 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా, ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికలలో వీరిలో 60.49 శాతం మంది ఓటు వేశారు. అసోంలో 343 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా 36.84 శాతం పోలింగ్ నమోదైంది. కేరళలో 277 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా 57.04 శాతం పోలింగ్ నమోదైంది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరగగా, కేరళ, అసోం మరియు పుదుచ్చేరిలలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరిగాయి. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలన్నింటికీ సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో, థర్డ్‌జెండర్ విభాగం కింద ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకున్న వారి సంఖ్య పెరిగినప్పటికీ, పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసిన వారి శాతం కేవలం 27 మాత్రమే. ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2019లో 39,075 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 48,194కు చేరింది. అంటే గత ఐదేళ్ల కాలంలో వీరి సంఖ్యలో 23.5 శాతం పెరుగుదల నమోదైంది.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS10UB 4470 | Burra Sai Kumar | MARUTHI ERTIGA-P | 2018 |
| 2 | TS04FD 7163 | Mohd Javeed Pasha | INDICA VISTA LS YDI BS3 DIESEL 5 SEATER | 2014 |
| 3 | TS15UE 6500 | Santhish Godugu | MAHINDRA JEETO PLUS BS6 DIESEL | 2022 |
| 4 | TS02ER 5724 | Mididoddi Rajesh | MAHINDRA YUVO 576DI | 2016 |

**AUCTION DATE: 05-05-2026**

VENUE : SHRIRAM AUTOMALL, KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 9985784346

# ఇరాన్‌తో యుద్ధం ముగిసింది

**సెనేట్‌లో ప్రకటించిన అమెరికా రక్షణమంత్రి**

**స్పెయిన్, ఇటలీ నుంచి బలగాల ఉపసంహరణ: ట్రంప్**



**వాషింగ్టన్:** ఇరాన్‌తో యుద్ధం ఇప్పటికే ముగిసిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సెనేట్ వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక విజయాలను సాధించింది. అమెరికాలోని యుద్ధ అధికారాల తీర్మానం 1973 ప్రకారం, దేశ అధ్యక్షుడు కాంగ్రెస్ అనుమతి లేకుండా కేవలం 60 రోజులు మాత్రమే యుద్ధాన్ని కొనసాగించే వీలుంటుంది. ఇరాన్‌పై సైనిక చర్య ఫిబ్రవరి 28న ప్రారంభమై, ఏప్రిల్ 7 నాటికే కాల్పుల విరమణ ఒప్పందానికి రావడంతో, ఈ గడువు ముగియకముందే యుద్ధం ఆగిపోయిందని ప్రభుత్వం వాదించింది. దీనివల్ల కాంగ్రెస్ ఆమోదం పొందాల్సిన అవసరం లేకుండానే ట్రంప్ సర్కారు ఈ సంక్షోభం నుండి బయట పడినట్లయింది.

ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో అధ్యక్షుడి నిర్ణయాధికారాన్ని సమర్థిస్తూ సెనేట్‌లో ఓటింగ్ జరిగింది. అనుకూలంగా 50 ఓట్లు (49 రిపబ్లికన్లు 1 డెమొక్రాట్). ఈ విజయంతో ఇరాన్ విషయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయాలకు చట్టపరమైన బలం చేకూరింది. అయితే, ఇద్దరు రిపబ్లికన్ సభ్యులు మాత్రం సైన్యాన్ని వెనక్కి పిలవాలనే ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు సహకరించని నాటో కూటమి దేశాలైన స్పెయిన్, ఇటలీపై అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా దేశాల నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకునే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ''మిత్రదేశాలుగా ఉంటూ కష్టకాలంలో సాయం చేయని దేశాల వద్ద మా సైన్యాన్ని ఎందుకు ఉంచాలి?'' అని ఆయన ప్రశ్నించారు. మార్చి 2న కాంగ్రెస్‌కు అందిన సమాచారం ప్రకారం, అధ్యక్షుడి యుద్ధ అధికారాల గడువు ఈరోజుతో (మే 1) ముగుస్తుంది. ఒకవేళ యుద్ధం కొనసాగించాలంటే కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి. అయితే, ఇప్పటికే కాల్పుల విరమణ జరిగినందున, కేవలం సైన్యాన్ని వెనక్కి తీసుకురావడానికి మాత్రమే మరో 30 రోజుల అదనపు గడువును ట్రంప్ ఉపయోగించుకునే అవకాశం ఉంది.

**భారత్, పాక్ యుద్ధాన్ని టారిఫ్‌లతోనే ఆపా: ట్రంప్ మళ్లీ పాత పాట**

భారత్ పాకిస్థాన్ మధ్య 2025లో జరిగిన ఉద్రిక్తతలను తానే పరిష్కరించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. టారిఫ్‌లను ఆయుధంగా ఉపయోగించి ఈ రెండు అణ్వ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ఆయన పేర్కొన్నారు. ఓవల్ ఆఫీసులో ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ సంతకం కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన ట్రంప్, తన అధ్యక్ష పదవీకాలంలో ఎనిమిది యుద్ధాలను ఆపానని మరోసారి వాదించారు. గతంలోనూ ఆయన అనేకమార్లు ఇదే వాదన వినిపించారు. గత సంవత్సరం మే 10న భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగిందని సోషల్ మీడియాలో ప్రకటించినప్పటి నుంచి ట్రంప్ 80కి పైగా సార్లు తన పాత్రను ప్రస్తావించారు.

**గత రెండు నెలల్లో 42,000 మంది హత్య**

ఇరాన్ పరిస్థితులపై కూడా ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో గత రెండు నెలల్లో 42,000 మందిని హత్య చేశారని ఆరోపించారు. అమెరికా జోక్యంతో కొన్నిటిని ఆపించామని ఆయన చెప్పారు. ''ఎనిమిది మంది మహిళలను ఉరితీయబోతున్నారు. నేను ఫోన్ చేసి ఆపమని చెప్పాను. ప్రపంచం చూస్తోంది అన్నాను'' అని తెలిపారు. ఇరాన్‌పై జరుగుతున్న చర్యలను ట్రంప్ యుద్ధంగా కాకుండా సైనిక చర్యగా పేర్కొన్నారు. ''ఇరాన్ ఒప్పందం చేసుకోవడానికి ఆసక్తిగా ఉంది. వారి ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోంది. ఆయిల్ ఆదాయం లేదు. ఆంక్షల ప్రభావం తీవ్రంగా ఉంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అమెరికా తీవ్రంగా దెబ్బతీసిందని కూడా ట్రంప్ అన్నారు. ''వారి నేవీ, ఎయిర్ ఫోర్స్ దాదాపు లేకపోయినట్టే. డ్రోన్ ఫ్యాక్టరీలు 82 శాతం, క్షిపణి తయారీ కేంద్రాలు 90 శాతం వరకు దెబ్బతిన్నాయి'' అని పేర్కొన్నారు.

# ఇరాన్‌ను తుడిచిపెట్టేందుకు ట్రంప్ మాస్టర్‌ప్లాన్?

**అమెరికా నుంచి ఇజ్రాయిల్‌కు 6500 టన్నుల సైనిక సామగ్రి**



**వాషింగ్టన్:** అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి ఉన్నప్పటికీ హార్మూజ్ జలసంధి, అణ్వస్త్రాల విషయంలో రెండు దేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో అమెరికా నుంచి ఇజ్రాయిల్‌కు భారీగా సైనిక సామగ్రి చేరుకోవడం... ఇరాన్‌పై మరోసారి భీకర దాడులకు అమెరికా సిద్ధమవుతోందా? అన్న అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇటీవల 24 గంటల వ్యవధిలోనే అమెరికా నుంచి 6500 టన్నుల సైనిక సామగ్రి అందినట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. రెండు కార్గో నౌకలు, వివిధ విమానాల్లో ఈ సామగ్రి వచ్చింది. ఈ కార్గో నౌకలు అష్‌దోద్, హైఫా పోర్టుల్లో ఉన్నాయి. వీటిల్లో భూతల, గగనతల దాడులకు వినియోగించే ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మిలిటరీ ట్రక్కులు, జాయింట్ లైట్ టాక్టికల్ వెహికల్స్ వంటివి ఉన్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై తాము చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 1,15,600 టన్నుల సైనిక సామగ్రిని అమెరికా పంపించినట్లు ఇజ్రాయిల్ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఏ క్షణమైనా శత్రువులను ఎదుర్కొనేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి కట్జ్ పేర్కొన్నారు.

**ట్రంప్‌తో సైన్యాధికారుల కీలక భేటీ... మెరుపు దాడులపై వివరణ**

ఇక 'యుఎస్ సెంట్రల్ కమాండ్' అధికారులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్‌పై తీసుకోవాల్సిన నిర్ణయాత్మక సైనిక చర్యల గురించి వివరించారు. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ఇరాన్ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు రూపొందించిన వ్యూహాలను ట్రంప్‌కు వివరించారు. జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ సైతం ఈ సమావేశంలో పాల్గొనడం చూస్తుంటే, అమెరికా కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా భారీ సైనిక చర్యకు సిద్ధమవుతోందా అన్న అనుమానం కలుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్‌ను దెబ్బకొట్టేందుకు సెంట్రల్ ప్రధానంగా 'షార్ట్ అండ్ ఇంటెన్స్' వ్యూహాన్ని ట్రంప్ ముందు ఉంచింది. అంటే తక్కువ సమయంలోనే ఇరాన్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలపై మెరుపు దాడులు చేయడం దీని లక్ష్యం. దీంతో ఇరాన్‌ను లొంగదీసుకుని, అణు కార్యక్రమాల విషయంలో మళ్లీ చర్చలకు తీసుకురావడమే వాషింగ్టన్ లక్ష్యంగా చెబుతున్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా అత్యంత వేగంగా, కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే హైపర్ సోనిక్ 'డార్క్ ఈగల్' క్షిపణులను రంగంలోకి దించే అవకాశం ఉందని సమాచారం. అంతేకాకుండా, గ్లోబల్ ట్రేడ్ దెబ్బతినకుండా హార్మూజ్ జలసంధిలోని కొన్ని భాగాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని అమెరికా యోచన. ఇందులో భాగంగా భూతల దళాలను సైతం మోహరించే ప్రమాదం ఉందని, ఇది పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సుదీర్ఘ భేటీలో మరో కీలక అంశం గురించి సైతం ప్రస్తావించారు. ఇరాన్ వద్ద ఉన్న అత్యంత నాణ్యమైన యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకోవడం లేదా వాటిని నిర్వీర్యం చేయడం కోసం అమెరికా ప్రత్యేక బలగాలను పంపే ఆలోచనలో ఉంది. అయితే, అమెరికా ఏ విధమైన చర్య తీసుకున్నా, ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడి చేసే అవకాశం ఉందని...అందుకు సిద్ధంగా ఉండాలని సైనిక ప్లానర్లు హెచ్చరిస్తున్నారు. ఇక, అమెరికాలో ఈ స్థాయి చర్చలు జరుగుతుండగానే ఇరాన్ రాజధాని తెహ్రాన్‌లో గురువారం రాత్రి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఒక్కసారిగా యాక్టివేట్ అయ్యాయి. ఆకాశంలో తిరుగుతున్న చిన్న డ్రోన్లు లేదా నిఘా విమానాలను కూల్చివేసేందుకు ఇరాన్ సైన్యం ఈ చర్యలు చేపట్టినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇది కేవలం సైనిక విన్యాసమా లేక అమెరికా దాడుల భయంతో చేసిన అప్రమత్తతా అన్నది ఇంకా స్పష్టం కాలేదు.

## కాంతిరేఖ ఎర్రజెండా

(మొదటి పేజీ తరువాయి)

లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకూ పోరాటాలు నిర్వహించాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఆ తర్వాత కార్మికులతో కలిసి భారీ ర్యాలీగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ చేరుకున్నారు. ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన మే డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 4 లేబర్ కోడ్ లని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్, హిమాయత్ నగర్ మగ్దూం భవన్ 'ప్రతి ఘటన సభ' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికుల దినోత్సవం జరుపుకుంటున్న ప్రతి ఒక్కరు కార్మికుల కోసం అసువులు బాసిన విప్లవ నాయకులు, స్ఫూర్తి దాతలు ఆగస్ట్ స్ప్రీస్, అడోల్ఫ్ ఫిషర్, అల్బర్ట్ పర్సన్స్, జార్జ్ ఎంజెల్, లూయిస్ లింగ్, మైఖేల్ స్వాబ్, సామ్యూల్ ఫిల్డెన్, అస్కార్ నీబిలను గుర్తుచేసుకోవాలని అన్నారు. 1881 మే 4న అమెరికాలోని షికాగో నగరంలో జరిగిన కాల్పుల్లో వీరు వీరమరణం పొందారని తెలిపారు. అందుకే ప్రపంచ విప్లవ చరిత్రలో వారి పేర్లు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు వెల్లువెత్తడం, తద్వారా ప్రపంచ కార్మిక న్యాయస్థానం 8 గంటల పని వసతిని ప్రసాదించిందని, ఇది ఎర్రజెండా యొక్క పోరాటాల వలన వచ్చిందని కొనియాడారు. ప్రతి రంగంలో కార్మికుల అభివృద్ధి వెనకాల కమ్యూనిస్టులు ఉంటారని, అసలు కమ్యూనిస్టులు లేకుండా ఏ పోరాటం లేదని చెప్పారు. ప్రతి రంగంలో ప్రస్తుతం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగాలు భర్తీ చేస్తున్న ప్రభుత్వాలు ఒక్కరి పర్మినెంట్ ఉద్యోగి వేతనంతో నలుగురిని పెట్టుకొని వారి శ్రమను దోచుకుంటున్నాయి. పాటు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రధాని మోదీ పాలనలో దేశంలోని కార్మికులు అ త్యంత ప్రమాదంలో ఉన్నారని అన్నారు. కా ర్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరేలా మోదీ పా లన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిపిఐని బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మే 10వ తేదీన మోదీ హై దరాబాద్ వస్తున్నారని, కేవలం ఎంఐఎంను విమర్శించి వెళ్లడం తప్ప, అభివృద్ధిపై మాట్లాడటం శూన్యమని విమర్శించారు. ఎఐటియు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మా ట్లాడుతూ కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు నూతన లే బర్ కోడ్ రద్దు చేయాలన్నారు. హక్కుల సాధనకై కార్మికులకు ఎల్లప్పుడు ఎఐటియుసి అండగా ఉ ంటుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా నా ట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సిం హా తన బృందంతో కలిసి పాడిన పాటలతో సభ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేం పావని, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, నాయకులు బొడ్డుపెల్లి కిషన్, లక్ష్మి , షేక్ హసీనా, బిక్షపతి యాదవ్, కొమురెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవనం వద్ద జెండా ఆవిష్కరించిన ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు

## అత్యాధునిక విధానాలు

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ప్రభుత్వ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యాధునిక విధానాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా, ట్రాఫిక్ సమస్యలు వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక బ్యూరో బ్యూరోను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ విధానాలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, షీ టీమ్స్ వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అలాగే నగరాల్లో సిసి కెమెరాల విస్తరణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ వినియోగం ద్వారా నేర నియంత్రణను కట్టుదిట్టం చేస్తామని వెల్లడించారు.క్షేత్రస్థాయిలో మత ఘర్షణలు, ఇతర సమస్యలు చేయి దాటక ముందే అధికారులు మేల్కొని ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. డిజిపిగా తన లక్ష్యం ప్రజలలో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించడం అని స్పష్టం చేసిన ఆయన, పోలీసింగ్ అంటే కేవలం చట్ట అమలు కాదు, ప్రజలకు సేవ చేయడం అని పేర్కొన్నారు. ఇక పోలీస్ శాఖలో పారదర్శకత, క్రమశిక్షణను పెంపొందిస్తూ, ఫీల్డ్ లెవల్‌లో సమర్థవంతమైన పని విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నేర నియంత్రణలో సమన్వయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు యాజమాన్యాలదే బాధ్యత అన్నారు. నకిలీ ఆహార పదార్థాల తయారీ, రియల్ ఎస్టేట్ మోసాలు, బెట్టింగ్, జంతువుల అక్రమ రవాణపై ప్రత్యేక దృషి పెడతామన్నారు. ప్రస్తుతం తెలంగాణ పోలీసు శాఖలో 19000 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మావోయిస్టుల సమస్య దాదాపు ముగియడంతో ఎస్ఐబి, గ్రేహౌండ్స్‌లో పనిభారం లేని సిబ్బందిని ఇతర విభాగాలలో భర్తీ చేస్తామన్నారు.ఇలా సిబ్బంది సర్దుబాటు చేసిన తరువాత ఖాళీపోస్టులపై ప్రభుత్వానికి నివేధిక అందిస్తామన్నారు. త్వరలో ఫోన్‌ట్యాపింగ్ కేసులో చార్జ్‌షీట్ వేస్తామన్నారు.మిగిలిపోయిన మావోయిస్టు నేతలు కూడా లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డిజిలు మహేష్‌భగవత్, వివి శ్రీనివాస్‌రావు, చారుసిన్హా, స్వాతిలక్రా, విసి సజ్జనార్, రమేష్ నాయుడు, సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేష్, మల్టీజోన్2 ఐజి షానవాజ్ ఖాసీం తదితరులు ఉన్నారు.

## ఇది 'ఎన్నికల బిల్లు'

(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఫిబ్రవరి నుంచి: కేవలం మూడు నెలల్లోనే రూ.1,380 పెరిగింది, ఇది 81% పెరుగుదల. టీ స్టాళ్లు, ధాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపులు ప్రతి వంటగదిపై భారం పెరిగింది. ఇది అనివార్యంగా మీ ప్లేట్‌పై కూడా ప్రభావం చూపుతుంది' అని అన్నారు. సామాన్య భారతీయుల కష్టాల పట్ల అధికార పార్టీకి ఉన్న శ్రద్ధ కేవలం ఎన్నికల జిమ్మిక్కులకే పరిమితమని, ఆ తర్వాత వారిని వారి మానాన వారిని వదిలేస్తారని కాంగ్రెస్ కూడా పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధరలు పెంచబోమని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తామని మాట్లాడేవారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'ఈ రోజు నేను వాస్తవాన్ని చూస్తున్నాను. ఆయన చెప్పినట్లు చేయలేకపోతున్నట్లు కనిపిస్తోంది' అని కర్నాటకలోని ఆయన కలబురగిలో విలేకరులతో అన్నారు. ఇప్పటికీ మోదీకి మద్దతు ఇస్తున్న ప్రజలను కూడా ఆయన తప్పుబట్టారు. 'ప్రజాభిప్రాయం నాకు అర్థం కావడం లేదు. దేశాన్ని ఇంతటి క్లిష్ట పరిస్థితిలోకి నెట్టిన విధానాలను లేదా సిద్ధాంతాలను ప్రజలు ఇప్పటికీ ఎందుకు సమర్థిస్తున్నారు? ఇది నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది' అని ఖర్గే అన్నారు. 'ఎన్నికల ప్రక్రియ ముగియగానే, మోదీ ప్రభుత్వం ఎల్‌పిజి సిలిండర్ల ధరలను పెంచడానికి ఏమాత్రం ఆలస్యం చేయలేదు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 29న అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారమే హెచ్చరించారు. ప్రపంచ ముడి చమురు ధరలు తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం సొమ్ము చేసుకుంటోందని, ధరలు పెరుగుతున్నందున ఇప్పుడు ఆ భారాన్ని ప్రజలపై మోపుతుందని ఆయన విమర్శించారు.

## భారం మోపడమే (మొదటి పేజీ తరువాయి)

ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయంగా సవాలుతో కూడిన పరిస్థితులలో ఇంధన ధరలలో నిరంతర పెరుగుదల... భారతదేశ ప్రయోజనాలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందనడానికి నిదర్శనమని పేర్కొంది. ఇంధన ధరలలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి బదులుగా భారం సామాన్య ప్రజలపైకి నెట్టబడుతోందని తెలిపింది. సిపిఐ ముందుగా హెచ్చరించినట్లుగానే వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే కేంద్రం దుశ్చర్యకు దిగిందని ప్రకటన పేర్కొంది. ఒకసారి ఓట్లు వేసిన తర్వాత అసాధారణ రీతిలో భారాన్ని సామాన్య ప్రజలపై మోపడం తీవ్రమైన అన్యాయమని సీపీఐ నిరసించింది. ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యలను, దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజలపై జరుగుతున్న ఈ దాడిని ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా ఒత్తిడి చేయడానికి గట్టిగా పోరాడతామని సిపిఐ హెచ్చరించింది.

## రూ.993 పెంపు (మొదటి పేజీ తరువాయి)

సిలిండర్ ధరలు మూడు వేల రూపాయలను దాటాయి. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ.3,315కు చేరగా, ఢిల్లీలో రూ.3,071.50కి పెరిగింది. గత రెండు నెలల్లోనే ఇది మూడోసారి పెంపు కావడం గమనార్హం. మార్చిలో రూ.144, ఏప్రిల్ 1న రూ.195 పెంచిన చమురు సంస్థలు, ఇప్పుడు ఒక్కసారిగా భారీగా పెంచడం వ్యాపార వర్గాలను కలవరపెడుతోంది. అయితే గృహ వినియోగదారులకు మాత్రం కేంద్ర ప్రభుత్వం కొంత ఊరటనిచ్చింది. 14.2 కిలోల గృహ ఎల్‌పిజి సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సుమారు 33 కోట్ల వినియోగదారులకు ఇది ఉపశమనం కలిగించే అంశంగా భావిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరల్లో కూడా మార్పులు చేయకుండా యథాతథంగా ఉంచారు. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు 73 డాలర్లుగా ఉన్న చమురు ధరలు, ప్రస్తుతం 126 డాలర్లకు చేరుకున్నాయి. ఇది నాలుగేళ్ల గరిష్ట స్థాయిగా చెబుతున్నారు. తాజాగా పెరిగిన ధరల పెంపు ప్రభావం ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాలపై పడనుంది. ఇప్పటికే పెరిగిన ముడి సరుకుల ధరలతో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ఇప్పుడు గ్యాస్ ఖర్చులు పెరగడంతో మరింత ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో వారు ఈ భారం వినియోగదారులపై మోపే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఫలితంగా హోటల్ భోజనాల ధరలు పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇంధన ఎగుమతులపై విధించే పన్నుల్లో సవరణలు చేసింది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ.55.5గా ఉన్న ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.23కు తగ్గించింది. అలాగే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్)పై ఉన్న పన్నును రూ.42 నుంచి రూ.33కు తగ్గించింది. పెట్రోల్ ఎగుమతులపై మాత్రం పన్ను యథాతథంగా శూన్యంగానే కొనసాగుతోంది. దేశీయ విమాన సంస్థలకు అవసరమైన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలను ప్రస్తుతం పెంచకుండా ఉంచారు. అయితే అంతర్జాతీయ విమాన సేవలకు మాత్రం ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. ఇది గ్లోబల్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయమని చమురు సంస్థలు వెల్లడించాయి. పెట్రోలియం ఉత్పత్తుల మొత్తం వినియోగంలో సుమారు 80 శాతం వరకు ధరల్లో ఎలాంటి మార్పు లేకుండా ఉంచినట్లు చమురు సంస్థలు పేర్కొన్నాయి. మరో 4 శాతం ఉత్పత్తుల్లో ధరలు తగ్గించగా, సుమారు 16 శాతం ఉత్పత్తుల్లో మాత్రమే పెంపు చేసినట్లు వివరించాయి.

## కలిసి రండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒక వేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి, భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సిఎం అన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్‌పిటిసి సభ్యునిగా గెలిచినప్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంసి, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయలో ఆర్‌టిసి కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సిఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్‌టిసి కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సిఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌టిసి లో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్‌టిసి కి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపం)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సిఎం తెలిపారు. ఆర్‌టిసి ని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సిఎం తెలిపారు. ఆర్‌టిసి లో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని, ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవిల వైపు మొగ్గుచూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. 1000 ఈవి బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటిఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సిఎం తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆర్‌టిసి లో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడి, ఎండి స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండి నాగిరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సిఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆర్‌టిసి సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని, కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సిఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కెఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్) , అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండి మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకె బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఇ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

**సమ్మె వేతనంతో పాటు కేసుల ఎత్తివేత:**

ఆర్‌టిసి జెఎసి నాయకుల విజ్ఞప్తి మేరకు ఇటీవల జరిగిన సమ్మె ఏప్రిల్ 22,23,24 మూడు రోజులకు గాను వేతనం ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు జెఎసి నాయకులు చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సమ్మె కాలంలో నమోదు అయిన పోలీస్ కేసులు ఎత్తివేయడానికి సిఎం అంగీకరించడంతో పాటు 2019 కెసిఆర్ ప్రభుత్వం హయాంలో నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## జూన్ 2 నాటికి తుదిరూపు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా పారదర్శకంగా కేటాయింపులు జరగాలంటే అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని తెలిపిన మంత్రి, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి సంబంధించిన సమస్య 18 ఏళ్లుగా కొనసాగుతోందని, గతంలో భూమి అప్పగించినప్పటికీ న్యాయ వివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయిన మంత్రి, ప్రభుత్వ నిర్ణయంపై తీర్మానం చేసి అందజేయాలని సూచించారు. సుమారు 18 సంవత్సరాల క్రితమే సభ్యులు ఒక్కొక్కరు రూ.2 లక్షలు చెల్లించిన విషయాన్ని గుర్తుచేస్తూ, తమ సొసైటీకి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సిపిఆర్‌ఓ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణయం (మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల గడప వద్దకు చేరుతున్నాయంటే, అందులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుండటం పట్ల పలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందుతున్నాయని, తద్వారా వేలాది కుటుంబాలకు ఊరట లభిస్తోందని వారు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెనిఫిట్స్ చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ. 1,000 కోట్లు కేటాయించడాన్ని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిజిఈజెఎసి నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు, జి.సదానందంగౌడ్, మధుసూదన్‌రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగరవీందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్,టిజి ఈ జెఎసి నాయకులు వి.లచ్చిరెడ్డి, వోడ్నాల రాజశేఖర్, కె.రామకృష్ణ, ఎస్.రాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదం (మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల మంటలు చెలరేగాయా అనేది నిర్ధారణ కాలేదు. నక్కలపల్లి నుంచి పల్లెపహడ్ గ్రామానికి వచ్చే దారిలో మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో మంటలు మొదలైనట్లు గ్రామస్థులు తెలిపారు. 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, బలమైన ఈదురు గాలులు మంటలు ఉగ్రరూపం దాల్చడానికి కారణమయ్యాయి.ప్రమాదంపై సమాచారం అందినా ఫైర్ ఇంజన్లు సకాలంలో చేరుకోలేకపోయాయి. దీంతో తీవ్రత మరింత పెరిగింది. గ్రామ సర్పంచ్ సంగిశెట్టి రాణమ్మ శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామస్థులే ట్రాక్టర్లతో నీళ్లు, మట్టి తోలి సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అయినప్పటికీ అప్పటికే తోటలో అధిక భాగం కాలిపోయింది. ఒక్కసారిగా ఎగిసిపడిన మంటలు, పొగ గ్రామస్థులను భయాందోళనకు గురిచేశాయి.

## దుర్మరణం (మొదటి పేజీ తరువాయి)

ఇరుక్కుపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది అనేక ప్రయత్నాల తర్వాత మృతదేహాలను కారు నుంచి బయటికి తీశారు.ప్రమాదం జరిగిన సమయంలో కారులో మొత్తం ఏడుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు తేలింది. వారిలో ఆరుగురు అక్కడే ప్రాణాలు కోల్పోగా,ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు అతి వేగం కారణంగానే ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు.

**యాదగిరిగుట్ట నుంచి తిరుగు ప్రయాణంలో ఈ విషాదం**

యాదగిరిగుట్ట నుంచి తిరుగు ప్రయాణంలో ఈ విషాదం చోటుచేసుకుంది.మృతులు రాజన్న సిరిసిల్ల కు చెందిన వారు.. కానీ ప్రస్తుతం హైదరాబాద్ లో నివాసం ఉంటున్నారు.మరణించిన వారిలో బొల్లి శివ కుమార్ (37),రేణికింది రాజేశ్వరిఅలియాస్ లాస్య(35), (శివ కుమార్ భార్య)బొల్లి రిషి(శివ కుమార్ కుమార్తె) (07సంవత్సరాలు) కోడం శ్రీనివాస్ (40),కృష్ణ చంద్ర (చిన్నారి) (13 సంవత్సరాలు),కోడం మాధవ్ (చిన్నారి) (10సంవత్సరాలు) గాయపడిన వారు కోడం స్వేత (శ్రీనివాస్ భార్య,సుమారు 35 సంవత్సరాలు) తీవ్ర గాయాలతో స్థానిక ట్రైడెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బెంగుళూరుపై గుజరాత్ విజయం





పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఐదో విజయం సాధించింది. ప్రతీకార విజయంతో ఆర్‌సిబిని టాపర్ కానివ్వలేదు. నరేంద్ర మోదీ స్టేడియంలో బౌలర్ల కృషితో ఆర్‌సిబిని 155కే కట్టడి చేసిన గుజరాత్ స్వల్ప ఛేదనలో అపసోపాలు పడింది. కెప్టెన్ శుభమన్ గిల్(43) ధనాధన్ ఆడినా.. బట్లర్(39) దంచేసినా వింటేజ్ భువనేశ్వర్(283) విజృంభణతో ఆర్‌సిబి రేసులో కొచ్చింది. మిడిలార్డర్ విఫలమైనా.. ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(27 నాటౌట్ ), హోల్డర్(12)లు పట్టుదలగా ఆడారు. రషీద్ ఖాన్ రాణించగా 6 వికెట్ల తేడాతో గుజరాత్ గెలిచింది. ఆర్‌సిబిని తక్కువకే కట్టడి చేసిన గుజరాత్ టైటాన్స్‌కు శుభారంభం దక్కినా సద్వినియోగం చేసుకోలేదు. హేజిల్‌వుడ్ ఓవర్లో శుభమన్ గిల్(43) మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 24 రన్స్ పిండుకున్నాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే సాయి సుదర్శన్(6) వికెట్ తీసి ఈ జోడీని విడదీశాడు భువనేశ్వర్(328). మళ్లీ బంతి అందుకున్న భువి.. ఈసారి గిల్‌ను వెనక్కి పంపి మ్యాచ్‌ను రంజుగా మార్చాడు. అయితే.. జోస్ బట్లర్(39) ఎడాపెడా బాదేస్తూ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే.. భువనేశ్వర్ యార్కర్‌ను అంచనా వేయలేక లెగ్ స్టంప్ ఎగిరిపోయింది. అనంతరం.. వాషింగ్టన్ సుందర్(12), షారుక్ఖాన్(8) ఇలా వచ్చి అలా వెళ్లగా.. 5 వికెట్లు పడ్డాయి. ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(27 నాటౌట్), హోల్డర్(12)లు గెలుపు బాధ్యత తీసుకున్నారు. ఆరో వికెట్కు 30 రన్స్ రాబట్టిన ఈ ద్వయాన్ని సుయాష్ విడదీశాడు.

**పడిక్కల్ ఒక్కడే..** సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ బౌలర్లు రెచ్చిపోవడంతో ఆర్‌సిబి మోస్తరు స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన బెంగళూరుకు షాకిస్తూ సిరాజ్ తొలి వికెట్ అందించాడు. జాకబ్ బెథెల్(5) కవర్స్‌లో రషీద్ ఖాన్‌కు సులువైన క్యాచ్ ఇచ్చి బెథెల్ వెనుదిరిగాడు. విరాట్ కోహ్లీ(29), దేవ్దత్ పడిక్కల్(40)లు ఇన్నింగ్స్ నిర్మించాలనకున్నారు. కానీ, విరాట్‌ను ఊరిస్తూ రబడ.. రషీద్ రెండో క్యాచ్‌తో గుజరాత్‌ను సంబురాల్లో ముంచెత్తాడు. పవర్ ప్లేలో 5–92తో మంచి స్థితిలో ఉన్నా.. డేంజరస్ రజత్ పాటిదార్(19)ను సూపర్ క్యాచ్‌తో హోల్డర్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత బంతి అందుకున్న అతడు జితేశ్ శర్మ(1) వికెట్ సాధించాడు. సిక్సర్‌తో గుబులు రేపిన టిమ్ డేవిడ్(9) రషీద్ ఖాన్ ఓవర్‌లో హోల్డర్ చేతికి చిక్కగా ఐదో వికెట్ పడింది. అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన కృనాల్ పాండ్యా(4) హోల్డర్‌కు సులువైన క్యాచ్ ఇచ్చాడు. పడిక్కల్ను రషీద్ బౌల్ చేయడంతో ఆర్‌సిబి కోలుకోలేకపోయింది. ఇంప్యాక్ట్ సబ్ వెంకటేశ్ అయ్యర్(12) సైతం విఫలమవ్వగా రొమారియో షెపర్డ్(17) దంచేసినా 19.2 ఓవర్లలో బెంగళూరు 155కే ఆలౌటయ్యింది. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్ మూడు వికెట్లతో రాణించాడు.

## సెమీ ఫైనల్లో భారత్

### అదరగొట్టిన లక్ష్య సేన్, ఆయుశ్..



మూడో సెట్‌లోనూ సేన్ అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. సెట్ ఆసాంతం జోరు చూపించి 21–17తో గెలుపొంది ఆధిక్యాన్ని 1–0కు పెంచాడు. డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ ద్వయం చియు షియాంగ్ – వాంగ్ చి లిన్ జంటను చిత్తు చేసింది. నెట్ వద్ద చురుకుగా కదిలిన భారత జోడీ.. 23–11, 19–21, 21–12తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఇటీవలే ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆయుశ్ శెట్టి సైతం విజయంతో చైనీస్ తైపీ ఆశలపై నీళ్లు చల్లాడు. 48 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అతడు ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ లిన్ చున్ యూని మట్టికరిపించాడు. 21–16, 21–17తో లిన్‌పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన ఆయుశ్ భారత్ ఆధిక్యాన్ని 3–0కు పెంచగా.. సెమీస్ బెర్తు ఖాయమైంది.

# రిషభ్ పంత్‌పై వేటు?

**ముంబై:** టీమ్ఇండియా వికెట్‌కీపర్ బ్యాటర్, ఐపిఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న రిషభ్ పంత్‌కు భారత వన్డే జట్టులోనూ చోటు దక్కేలా లేదు. ఇప్పటికే టీ20 టీమ్‌కు దూరమైన అతడిని.. వన్డేల నుంచీ తప్పించి ఆ స్థానాన్ని కేరళ కుర్రాడు సంజూ శాంసన్‌తో భర్తీ చేయాలని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ భావిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాబోయే ఏడాది వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా జట్టును తయారుచేసుకునే ప్రణాళికలో భాగంగానే శాంసన్‌కు అవకాశం దక్కనున్నట్టు తెలుస్తున్నది. టీ20 వరల్డ్‌కప్ నాకౌట్ దశలో సంచలన ఆటతో భారత్ వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన సంజూ.. ఐపిఎల్19లో చెన్నైకి ఆడుతూ 8 మ్యాచుల్లో 304 రన్స్ చేశాడు. ఇందులో రెండు శతకాలు కూడా ఉన్నాయి. మరోవైపు పంత్.. 8 మ్యాచుల్లో 189 రన్స్ మాత్రమే చేశాడు. వన్డేల్లో వేటు పడ్డా పంత్ టెస్టుల్లో ఫస్ట్ చాయిస్ వికెట్‌కీపర్‌గా ఉన్నాడు.

## సైన్స్

# డిఎన్‌ఎ మరమ్మతుకు కొత్త దిశ..



జీవకణాలలోని డిఎన్‌ఎ మరమ్మతు వ్యవస్థను యాంత్రిక స్థాయిలో వివరించి ప్రపంచ శాస్త్రరంగానికి కొత్త దిశను చూపిన శాస్త్రవేత్త అజీజ్ సాన్కార్. 1946 సెప్టెంబర్ 8న టర్కీలో జన్మించిన ఆయన తరువాత అమెరికాలో స్థిరపడి జీవ అణు శాస్త్రవేత్తగా, వైద్యుడిగా, జీవరసాయన శాస్త్రవేత్తగా ఖ్యాతి పొందాడు. డిఎన్‌ఎలో కలిగే నష్టాన్ని సరిచేసే న్యూక్లియోటైడ్ తొలగింపు మరమ్మతు విధానాన్ని స్పష్టంగా వివరించినందుకు 2015 సంవత్సరానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతిని థామస్ లిండాల్, పాల్ మోడ్రిచ్‌లతో కలిసి అందుకున్నాడు. ఒకప్పుడు డిఎన్‌ఎ స్థిరమైన అణువుగా పేర్కొన్నప్పటికీ, వాస్తవానికి అది ప్రతిరోజూ అతి నీలలోహిత కిరణాలు, రసాయన పదార్థాలు, స్వేచ్ఛా రాడికల్స్ ప్రభావంతో దెబ్బతింటుంది. కణ విభజన సమయంలోనూ ప్రతిరూపణలో పొరపాట్లు సంభవిస్తాయి. అయినప్పటికీ జీవులు సజీవంగా ఉండగలగడం వెనుక కారణం కణాలలో పనిచేసే మరమ్మతు వ్యవస్థలే. 1983లో అజీజ్ అతి నీలలోహిత కిరణాల వల్ల డీఎన్ఏలో ఏర్పడే నష్టాన్ని కణాలు ఎలా గుర్తించి, దెబ్బతిన్న భాగాన్ని కత్తిరించి, సరైన న్యూక్లియోటైడ్లతో భర్తీ చేస్తాయో విశదీకరించాడు. ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రోటీన్లు, ఎంజైములను గుర్తించాడు. ఈ వ్యవస్థలో లోపాలు ఉన్నవారికి సూర్యకాంతి ప్రభావంతో చర్మ క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని పరిశోధనలు చూపించాయి. డిఎన్‌ఎమరమ్మతు పరిశోధనలు క్యాన్సర్ ఉత్పత్తి విధానం, వృద్ధాప్య ప్రక్రియ, కణ జీవక్రియలను అర్థం చేసుకోవడంలో మౌలిక పాత్ర పోషించాయి. అదనంగా, పీరియడ్, క్రిప్టోక్రోమ్ జన్యువులు మానవ జీవ గడియారాన్ని నియంత్రిస్తాయని ఆయన బృందం కనుగొంది. నిద్ర, హార్మోన్ విడుదల, శక్తి వినిమయం వంటి ప్రక్రియలు ఈ జీవ గడియారంతో సమకాలీకృతంగా జరుగుతాయి. అజీజ్ చేసిన పరిశోధనలు ఆధునిక జీవశాస్త్రానికి పునాదిరాయిగా నిలిచాయి. డిఎన్‌ఎని రంతరం దెబ్బతిన్నప్పటికీ జీవితం కొనసాగడానికి కారణమైన అంతర్గత మరమ్మతు వ్యవస్థలను శాస్త్రీయంగా నిరూపించినందుకు ఆయనకు శాస్త్ర చరిత్రలో విశిష్ట స్థానం లభించింది.

ఆధునిక పరమాణు సిద్ధాంతానికి శాస్త్రీయ రూపం ఇచ్చిన ప్రముఖ ఆంగ్ల శాస్త్రవేత్త జాన్ డాల్టన్ 1766 సెప్టెంబర్ 6న ఇంగ్లాండ్‌లోని ఈగల్స్ ఫీల్డ్ గ్రామంలో జన్మించాడు. పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఆయనకు పద్ధతిబద్ధమైన ఉన్నత విద్యా అవకాశాలు లేకపోయినా, సహజమైన ఆసక్తి మరియు కృషితో గణితం, భాషలు, విజ్ఞానశాస్త్రాలలో నైపుణ్యం సాధించాడు. పన్నెండేళ్ల వయసులోనే ఉపాధ్యాయుడిగా పని ప్రారంభించాడు. వాతావరణ శాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకొని, పీడనం, ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం వంటి అంశాలను జీవితాంతం

## పరమాణు సిద్ధాంతానికి శాస్త్రీయ రూపం..



క్రమం తప్పకుండా నమోదు చేశాడు. ఆయన నమోదు చేసిన పరిశీలనలు రెండు లక్షలకు పైగా ఉన్నాయి. వాయువుల స్వభావంపై చేసిన పరిశోధనల ఫలితంగా 1803లో పాక్షిక పీడన నియమాన్ని ప్రతిపాదించాడు. రసాయన చర్యలలో వాయువుల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో ఈ నియమం కీలకమైంది. అనంతరం పరమాణు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసి 1808లో ప్రచురించాడు. పదార్థం అవిభాజ్యమైన పరమాణువులతో నిర్మితమవుతుందని, ఒకే మూలకానికి చెందిన పరమాణువులు ద్రవ్యరాశి లక్షణాలలో సమానంగా ఉంటాయని, వేర్వేరు మూలకాల పరమాణువులు భిన్నంగా ఉంటాయని ఆయన వివరించాడు.ద్రవ్యరాశి కొలమానంగా డాల్టన్ అనే పదం ఆయన గౌరవార్థం ఉపయోగంలోకి వచ్చింది. 1822లో రాజశాస్త్ర సమాజ సభ్యత్వం పొందిన ఆయనకు అనేక గౌరవాలు లభించాయి. 1844 జూలై 27న ఆయన మరణించినప్పటికీ, పరమాణు సిద్ధాంతం ద్వారా ఆధునిక రసాయన శాస్త్రానికి బలమైన పునాది వేసిన శాస్త్రవేత్తగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచింది.

# పరాన్న జీవ శాస్త్రంలో అద్భుత పరిశోధనలు



వీణా టాండన్ భారతదేశానికి చెందిన ప్రముఖ మహిళా పరాన్నజీవ శాస్త్రవేత్త.. విద్యావేత్త. పరాన్నజీవ శాస్త్రంలో ఆమె చేసిన ప్రామాణిక పరిశోధనలు దేశీయంగా, అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందాయి. భారత జాతీయ శాస్త్ర అకాడమీ సీనియర్ శాస్త్రవేత్తగా సేవలందించిన ఆమె, ఈశాన్య కొండ ప్రాంత విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆహార ప్రయోజనాల కోసం పెంచే పశువులు, ఇతర జంతువులను ప్రభావితం చేసే పరాన్న జీవ సంక్రమణలపై ఆమె చేసిన అధ్యయనాలు వ్యవసాయం, పశుపోషణ రంగాలకు శాస్త్రీయ దిశానిర్దేశం చేశాయి. ఈ కృషికి గాను భారత ప్రభుత్వం 2016లో ఆమెను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 1949 సెప్టెంబర్ 7న ఉత్తరాఖండ రాష్ట్రంలోని కాశీపూర్‌లో జన్మించిన వీణా టాండన్, 1967లో చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి జంతు శాస్త్రంలో గౌరవ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం 1968లో స్నాతకోత్తర పట్టా పొందారు. 1973లో డాక్టరేట్ సాధించి, పరిశోధనా శిక్షణను కూడా అభ్యసించారు. 1978–79లో అమెరికా కాలిఫోర్నియాలో మెదడు, కాలేయ కణజాలాలపై మద్యం ప్రభావాలపై పరిశోధనలు నిర్వహించి, కణస్థాయిలో జరిగే జీవరసాయన మార్పులను విశ్లేషించారు. ఆమె వృత్తి జీవితం హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయంలో సహాయ అధ్యాపకురాలిగా ప్రారంభమైంది. తరువాత షిల్లాంగ్‌లోని ఈశాన్య కొండ ప్రాంత విశ్వవిద్యాలయంలో చేరి, సహాయ అధ్యాపకురాలిగా మొదలుపెట్టి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. పదవీ విరమణ అనంతరం భారత జాతీయ శాస్త్ర అకాడమీ ప్లాటినం జూబిలీ ఫెలోషిప్ ఆధారంగా లక్నోలోని జీవ సాంకేతిక పార్కులో పరిశోధనలు కొనసాగించారు. ఈశాన్య భారత పరాన్న జీవ సమాచార విశ్లేషణ కేంద్రానికి ప్రధాన పరిశోధకురాలిగా వ్యవహరించి, ఆ ప్రాంతంలోని పరాన్నజీవ వైవిధ్యంపై సమగ్ర సమాచార భాండాగారాన్ని రూపొందించారు. ఆమె 340కిపైగా శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. పరాన్నజీవ శాస్త్రంపై రెండు ప్రాముఖ్యమైన గ్రంథాలను రచించారు. 1998లో భారత జాతీయ శాస్త్ర అకాడమీ ఫెలోషిప్, 2005లో భారత పరాన్నజీవ శాస్త్ర సంఘ ఫెలోషిప్, ఇకె జానకి అమ్మాళ్ పురస్కారం, 2016లో జీవితకాల సాఫల్య పురస్కారం వంటి గౌరవాలు అందుకున్నారు.

## 'వైల్డ్' ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్



వెర్సటైల్ యాక్టర్ రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో 'వైల్డ్' అనే సినిమా రాబోతోంది. వయొలెంట్ సైకో థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని డైరెక్టర్ సాయిరాం దాసరి తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఓవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ రవి పీట్ల నిర్మించనున్నారు. త్వరలో 'వైల్డ్' మూవీ లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుని రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'వైల్డ్' మూవీ మోషన్ పోస్టర్‌లో రక్తంతో తడిసిపోయిన వయలెంట్‌లుక్‌లో రాజా రవీంద్ర కనిపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

# ఆనంద్ - వైష్ణవి ప్రేమ కథ 'ఎపిక్'



ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమా నుంచి ఎలాంటి కంటెంట్ రాబోతుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకులలో పెరిగింది. ఎపిక్' టీజర్ అందమైన అనుభూతిని అందిస్తూ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల మధ్య కథను కేంద్రీకరిస్తుంది. 'బేబీ' సినిమా తర్వాత ఈ జంటకు ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ సరికొత్తగా మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని తొలి గీతం సంచారమే ఇప్పటికే అన్ని ప్లాట్‌ఫార్మ్‌లో ట్రెండ్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇక టీజర్ లోనూ తనదైన నేపథ్య సంగీతంతో మెప్పించారు హేషమ్ అబ్దుల్ వహాబ్. లండన్ నేపథ్యంతో సాగే ఈ చిత్రం ఒక అందమైన, ఆసక్తికరమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ఆధునిక సంబంధాలు, ప్రేమలో మారుతున్న భావోద్వేగాలను ఈ సినిమా చూపించబోతున్నట్లు తెలుస్తోంది. విభిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా పుట్టింది? వారి ప్రయాణం ఎలా సాగింది? అనేది టీజర్‌లో ఎంతో హృద్యంగా చూపించారు. హైదరాబాద్‌లోని ఎఎంబి సినిమాస్‌లో జరిగిన 'ఎపిక్' టీజర్ ఆవిష్కరణ జరిగింది. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ ఎపిక్ టీజర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. ఎపిక్ సినిమా చేయడం చాలా చాలా సంతోషంగా ఉంది. ఆదిత్య హాసన్ వచ్చి ఈ కథ చెప్పినప్పుడు.. నా కథ నాకే చెప్పాడా అనిపించింది. ఎందుకంటే నేనూ విదేశాల్లో చదువుతున్నాను. ఇందులోని చాలా సన్నివేశాలు నాకు కనెక్ట్ అయ్యాయి. ఈ కథలోని భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతాయి. కుటుంబం, ప్రేమ, బంధం, భావోద్వేగాలు ఇలా ప్రతిదీ మీ మనసుకు నచ్చుతాయి అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ.. 'ముందుగా' 'సంచారమే' పాటపై ప్రేమను కురిపించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఎపిక్ కథ నాకు చాలా నచ్చింది. కథ వినగానే నేను ఈ సినిమాలో భాగం కావాలి అనుకున్నాను. నేను పోషించిన కదలి పాత్ర చాలా బాగుంటుంది. కథ వినేటప్పుడు ఆ కదలి నాలో ఉందేమో అనిపించింది. చాలామంది అమ్మాయిల్లో ఆ కదలి ఉంటుంది అనిపించింది అన్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. అత్యుత్తమ సాంకేతిక బృందం ఈ చిత్రానికి పనిచేస్తోంది. అజీమ్ మహమ్మద్ ఛాయాగ్రాహకుడిగా పని చేస్తున్న ఈ చిత్రానికి కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు.

## రీల్

# 'థాయ్‌లాండ్'లో విశ్వక్ సేన్



ఈ నగరానికి ఏమైంది' భారీ విజయం సాధించింది, ముఖ్యంగా యువతలో ప్రత్యేకమైన స్థానం సంపాదించింది. స్నేహం, సరదా కథనంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. కల్ట్ స్టేటస్ పొందిన ఈ సినిమా రీరిలీజ్ సమయంలో కూడా అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన అందుకుంది. ఈ సక్సెస్‌ని కొనసాగిస్తూ మోస్ట్ ఎవైటెడ్ సీక్వెల్ 'ఈఎన్‌ఈ రిపీట్' ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను మళ్లీ కలిసి నటిస్తూ, మొదటి భాగంలో కనిపించిన కెమిస్ట్రీని తిరిగి తెరపైకి తీసుకురానున్నారు. శ్రీనాథ్ మాగంటి కొత్తగా జాయిన్ అవుతున్నారు. తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహిస్తూ తన యూనిక్ స్టైల్‌ను కొనసాగిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, రూట్‌నోడ్ సినిమా బ్యానర్‌పై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం థాయిలాండ్‌లో జరుగుతోంది, ఈ షెడ్యూల్ నెల పాటు కొనసాగుతుంది. 'టీమ్ కన్యారాసి' గ్యాంగ్ కు చెందిన ఆ నలుగురు అబ్బాయిలు, వింటేజ్ కన్వర్టిబుల్ కారులో హాయిగా కూర్చుని, ఎంతో ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఈ ఫ్రేమ్ రెట్రో వైబ్, మోడరన్ బ్రో ట్రిప్ స్ఫూర్తితో అందంగా కనిపిస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా, ఏజే ఆరోన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటింగ్, సౌమిత్రి ఎన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

# పోస్ట్ ప్రొడక్షన్‌లో 'అగధ'



తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఒకప్పుడు అగ్ర కథానాయికగా వెలుగొందారు మంజుల. ఎన్‌టిఆర్‌తో మనుషులంతా ఒక్కటే, మగాడు, నేరం నాది కాదు ఆకలిది, ఎయన్‌ఆర్‌తో దొరబాబు, బంగారు బొమ్మలు, మహాకవి క్షేత్రయ్య, కృష్ణతో మాయదారి మల్లిగాడు, రక్తసంబంధాలు, శోభన్‌బాబుతో మంచి మనుషులు, పిచ్చిమారాజు వంటి ఎన్నో సూపర్ హిట్స్‌లో నటించారు. మంజుల కూతురు వనితను 'దేవి'తో నటిగా పరిచయం చేశారు ఎంఎస్ రాజు. ఇప్పుడు మంజుల మనవరాలు, వనిత కుమార్తె జోవికా విజయ్ కుమార్ను 'అగధ' తో నటిగా పరిచయం చేస్తున్నారు ఎంఎస్ రాజు. ఇందులో ఆమె పాత్ర పేరు 'హరిణి '. ఆమె క్యారెక్టర్ పోస్టర్ ని ఈరోజు విడుదల చేశారు. జోరున కురుస్తోన్న వర్షం లో మసక బారిన పురాతన నేపథ్యంలో, జోవికా అద్భుతమైన రూపంలో కనిపిస్తుంది. ఆమె హావభావాలు పలికించే కళ్ళలో అమాయకత్వం, దాగి ఉన్న శక్తి కలగలిసి ఉన్నాయి. ఇది కథ యొక్క ఆధ్యాత్మిక, మర్మమైన మూలాలతో గాఢంగా ముడిపడి ఉన్న పాత్రను సూచిస్తుంది. 'అగధ' కు సంబంధించి ఇప్పటివరకూ విడుదల చేసిన అన్ని పోస్టర్‌లు ఈ సినిమా తాలూకు ఇంటెన్సిటీ ని ఆవిష్కరించే విధంగా ఉన్నాయి.ఎం. ఎస్. రాజు రచన, దర్శకత్వం లో శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యాన్ప కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 85 రోజుల షూటింగ్, విస్తృతమైన సెట్ వర్క్ దాదాపు 45 నిమిషాల విఎఫ్ఎక్స్ తో, 'అగధ' ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని యూనిట్ చాలా నమ్మకంగా ఉంది. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు: ఎంఎస్. రాజు, నిర్మాత: కాశీ విశాలాక్షి బలుసు, సంగీత దర్శకుడు: రాకేష్ వెంకటాపురం, సినిమాటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటర్: జునైద్ సిద్ధిఖీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్ వి ఎన్ సుబ్బరాజు.

# నెలాఖరులో 'పురుష' విడుదల




సరస్వతి బత్తుల సమర్పణలో సకళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'పురుష'. ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ బత్తుల తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ బత్తుల, సప్తగిరి, కసిరెడ్డి రాజుకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్, అనంత్ శ్రీరామ్, వెన్నెల కిషోర్ పాత్రలు హైలెట్ కానున్నాయని సమాచారం. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, గ్లింప్స్ అన్నీ కూడా సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి.అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే బయటకు వచ్చిన కంటెంట్ ట్రేడ్ వర్గాల్లో హైప్పు క్రియేట్ చేసింది. పాటలు అయితే యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. సమ్మర్ కానుకగా ఈ సినిమాని మే నెలలో రిలీజ్ చేయాలని ప్లాన్స్ చేస్తున్నారు. ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ కామెడీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'పురుష:' రూపొందుతోంది. ఈ మూవీకి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సతీష్ ముత్యాల కెమెరామెన్‌గా, కోటి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: శ్రవణ్ భరద్వాజ్ సినిమాటోగ్రఫీ: సతీష్ ముత్యాల, ఎడిటర్: కోటి ఆర్ట్ డైరెక్టర్: రవిబాబు దొండపాటి, సాహిత్యం: అనంత్ శ్రీరామ్.

# డబ్బింగ్‌లో 'స్లమ్ డాగ్'



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ స్టార్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్ డాగ్' షూటింగ్ పూర్త యింది. ప్రస్తుతం అన్ని భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. '33 టెంపుల్ రోడ్' అనే గ్రిప్పింగ్ ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్తో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని పూరి కనెక ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మో హన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తుండగా, టబు, దునియా విజయ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బ్రహ్మాజీ, వీవీ టీవీ గణేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాల కోసం ఇచ్చిన ఇంటెన్స్ బ్యాగ్రౌండ్ స్కోర్‌లతో ప్రసిద్ధి చెందిన ఆయన, ఈ చిత్రానికి కూడా పవర్ ఫుల్ సంగీతాన్ని అందిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జే బి నారాయణరావు కొండ్రోళ్ల సమర్పణ: ఛార్మీ కౌర్.

## పులిగిల్ల హనుమాన్ రైస్ మిల్లులో కార్మికుడి మృతి

### మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మృతి చెందినట్లు ఫిర్యాదు



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలోని హనుమాన్ బిన్ని మోడరన్ రైస్ మిల్లులో మిషన్ ఆపరేటర్ గా పనిచేస్తున్న కృష్ణ(హన్స్ లాల్) 30 సం వ్యక్తి ఒకసారిగా హైడ్రాలిక్ మిషన్ మీద పడడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృత్యువాతపడ్డాడు. వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం అదే రైస్ మిల్లు పనిచేస్తున్న ప్రేమ్ నారాయణ్ యాదవ్ ఫిర్యాదు ప్రకారం గురువారం రాత్రి బియ్యం సంచులను ఎత్తడానికి ఉపయోగించే హైడ్రాలిక్ యంత్రం సరిగ్గా పనిచేయడం లేదని చెప్పి కృష్ణ దానికి మరమ్మతులు చేస్తుండగా, అతను ఆ యంత్రం కిందకు వెళ్ళాడు. అకస్మాత్తుగా, ఆ హైడ్రాలిక్ యంత్రం కూలిపోయి అతనిపై పడడంతో అక్కడికక్కడే కుప్ప కూలిపోయి మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు. మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగిందని, వారు సరైన భద్రతా చర్యలు కల్పించడంలో విఫలమై, లోపభూయిష్టమైన హైడ్రాలిక్ యంత్రంతో పని చేయడానికి అనుమతించడం వల్లే కృష్ణ మరణం సంభవించిందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కార్మికులకు అండ కాంగ్రెస్

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టియుసి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తూ వస్తుందని చెప్పారు. శుక్రవారం మేడే సందర్భంగా జిల్లా కేంద్రంలోని సూపరింటెండెంట్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఎదుట, మున్సిపల్ వాటర్ సప్లై వర్కర్స్, కొత్త బస్టాండ్ సమీపంలోని ప్రైవేటు ట్రావెల్స్, కొత్తబస్టాండ్‌లోని డిపో ఎదుట, ఖమ్మం క్రాస్ రోడ్డు, ఏపూర్ బస్టాండ్, విటి టాకీస్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో జరిగిన మేడే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక పక్షపాతిగా తాను అండగా నిలుస్తానన్నారు. సమస్య ఏదైనా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌టిసి డిపో ఐఎన్‌టియుసి నాయకులు రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఇటీవల ఆర్‌టిసి కార్మికులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె తలపెట్టగా మూడు రోజుల్లోనే ప్రభుత్వం స్పందించి పరిష్కరించడంతో సిఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, నాయకులు చకిలం రాజేశ్వర్ రావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిన్న జహీర్ పాల్గొన్నారు.

## ఎరుపెక్కిన కోదాడ

### కార్మికుల సంక్షేమానికి అండగా ఐఎన్‌టియుసి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే కోదాడలో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఖమ్మం క్రాస్‌రోడ్డు నుండి రాజీవ్ చౌక్ మీదుగా బాలుర ఉన్నత పాఠశాల వరకు వందలాది మంది కార్మికులు, ఎఐటియుసి ఎర్రజెండాలు పట్టి మేడే వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఎర్రజెండాలతో కోదాడ ఎరుపెక్కింది. ర్యాలీలో డప్పు, విన్యాసాలు, కోలాట ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ విజయవంతం అనంతరం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మేడే వేడుకల సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకవర్గాలకు గుణపాఠం తప్పదని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె లతీఫ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, సాయిబెల్లి, పైడిమర్రి వెంకటనారాయణ, అల్వాలపురం సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ, బొజ్జగూడెం సర్పంచ్ నీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయొద్దు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కార్మికులు తమ రక్త తర్పణంతో సాధించుకున్న హక్కులు,చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవనంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నారని ఆయన విమర్శించారు.మే డే వెనుక ఉన్న చరిత్రను గుర్తు చేస్తూ,సమాన పనికి సమాన వేతనం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ఫలితమే ఈదినోత్సవమని తెలిపారు.బాల కార్మికత్వం నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు అవసరమని,ఇప్పటికే సాధించిన కార్మిక చట్టాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మే డేను గౌరవిస్తూ అధికారికంగా వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లేబర్, ఎంప్లాయ్‌మెంట్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ శాఖల అభివృద్ధిపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ ఆమర్, డిప్యూ టీ కమిషనర్ ఆఫ్ లేబర్ అరుణ, ఏఎల్ఓ రాజు,డిప్యూటీ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.



# ‘నోష్’ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు

### ఘటనలో ఒకరు మృతి, 6 గురికి గాయాలు
### నెల వ్యవధిలో రెండో ప్రమాదం
### కార్మికుల దినోత్సవం రోజే విషాదం
### నోష్ ఫార్మా యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి : ఎమ్మెల్సీ సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొని ఉన్న నోష్ ఫార్మా పరిశ్రమంలో మేడే రోజు శుక్రవారం రియాక్టర్ పేలిన ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో రియాక్టర్ ప్రాంతంలో పనులు నిర్వహిస్తున్న బొడ్డు బాలకృష్ణ అనే కార్మికుడు మృతి చెందగా సుమారు 6 మంది కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే వెంటనే స్థానిక పోలీసు యంత్రాంగం క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ల్యాబ్‌లోని మూడవ బ్లాక్‌లో జరిగిన సంఘటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గత ఏప్రిల్ నెలలోనే ఈ పరిశ్రమలో పేలుడు జరిగిన దుర్ఘటనలో ఇరువురు ఉద్యోగులు ఇప్పటికీ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. పేలుడు సంఘటనలు పునరావృతం కావడం పట్ల పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. లాభాపేక్షతో పరిశ్రమలు పరిచేస్తున్నాయే కాని కార్మికు సంరక్షణకు కావల్సిన నిభందనలను తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘటనలు పునరావృతమవుతున్న పరిశ్రమలను అధికారులు వెంటనే రద్దు చేసి మూసివేయాలన్న కార్మిక, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీః రియాక్టర్ పేలుడు సంభవించిన నోష్ ఫార్మా పరిశ్రమను జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎస్పి శరత్ చంద్రలు సందర్శించారు. సంఘటన జరిగిన తీరును అధికారులను, పరిశ్రమ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సంఘటనపై కలెక్టర్ స్పందిస్తూ ప్రమాదం జరిగిన తీరుపై విచారణ జరిపించాలని పరిశ్రమలు, కార్మిక శాఖ, బయో డిపార్ట్‌మెంట్, ఫైర్ తదితర అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. 20 రోజుల వ్యవధిలో రెండు సంఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తి అయ్యేంత వరకు పరిశ్రమలో జరిగే ఉత్పత్తిని నిలుపదల చేయాలని ఆదేశించామన్నారు. విచారణ పూర్తి అయిన తర్వాత పరిశ్రమపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. క్షతగాత్రుల కు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వారు ఆదేశించారు.

**నోస్ పరిశ్రమను మూసివేయాలి : ఎఐవైఎఫ్**

ప్రజాపక్షం/చిట్యాలః కార్మికుల ప్రాణాలను బలిగొంటున్న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం బొంగోని చెర్వు గ్రామ పంచాయతి పరిధిలోని నోస్ ఫార్మా పరిశ్రమను అధికారులు వెంటనే మూసివేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించని నోష్ పరిశ్రమను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబాలను ఆదుకోవాలిః సిపిఐ(ఎం)**

నోష్ పరిశ్రమలో జరిగిన పేలుడు సంఘటనలో మరణించిన బాలకృష్ణ కుటుంబాన్ని పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని, గాయపడ్డ కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని సిపిఐఎం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వారు జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పి శరత్ చంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు.

**మేడే రోజున సంఘటన దురదృష్టంః కాంగ్రెస్ నేత దైద**

కార్మికుల దినోత్సవమైన మేడే రోజున ఒక కార్మికుడు మరణించడం, పలువురు క్షతగాత్రులు కావడం చాలా దురదృష్టకమైన సంఘటన అని పిసిసి మాజీ కార్యదర్శి దైద రవిందర్ ఆవేదన వ్యక్తం చేశారు.



### అధికారుల అలసత్వమే ప్రమాదాలకు కారణం..తక్షణ చర్యలు చేపట్టాలి
### సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ:** తరచూ జరుగుతున్న ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు తీస్తున్న నోస్ ఫార్మాస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండలం పిట్టంపల్లి,వెలిమినేడు శివారులోని నోస్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఒక కార్మికుడు దుర్మరణం పాలవ్వడం,మరో8 మంది తీవ్రంగా గాయపడటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రమాదం కాదు,యాజమాన్యం నిర్లక్ష్యపు హత్య అని ఆయన మండిపడ్డారు. లాభాల వేటలో భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసిన యాజమాన్య తీరే ప్రతిసారీ కార్మికుల ఉసురు తీస్తోంది. నోస్ ఫార్మాలో ఇది మొదటి ఘటన కాదు. గత నెల 9న అంటే 20రోజుల క్రితం జరిగిన ప్రమాదాల నుంచి యాజమాన్యం పాఠాలు నేర్చుకోలేదు. మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా,కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. తీవ్రంగా గాయపడిన 9 మంది కార్మికులకు ప్రభుత్వ ఖర్చుతో కార్పొరేట్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

# కార్మికుల హక్కుల కోసం ఉద్యమిద్దాం

### కార్మిక దినోత్సవం సందర్భంగా వక్తల ఉద్బోధ




**ప్రజాపక్షం/మునుగోడు:** మే డే సందర్భంగా మునుగోడులో సీపీఐ కార్యాలయం వద్ద కార్మికుల జెండాను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎగరవేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పతాకాలను ఆవిష్కరించి, కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ, 8 గంటల పని దినం కోసం కార్మికులు రక్తం చిందించి హక్కులు సాధించుకున్నారని, మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి శ్రామికులను బానిసత్వంలోకి నెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల పొట్ట కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని, రెండో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం.జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోలుగూరి నరసింహ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొమ్మరమైన లాలు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,గట్టుప్పల్ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,దర్శి మండల పాండు,మాధగోని సత్యమ్మ,బెల్లం శివయ్య,దుబ్బ వెంకన్న,చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య,ఈదులకంటి కైలాస్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భువనగిరి** : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు తూట్లు పొడిచే చర్యలను మానుకోని నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి యధావిధిగా పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం 141వ మేడే సందర్భంగా భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఆవరణలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పస్తువుల అభిలాష్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు జిల్లా కమిటీ సభ్యులు ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం వ్యవస్థపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనం నందు ఎఐటియుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు అధ్యక్షతన పార్టీ జెండా జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జెండా ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దోరేపల్లి శంకర్, నిమ్మల ప్రభాకర్, దంతాల పద్మరేఖ, హేమలత, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, పిల్లి శ్రీనివాస్, దీకొండ శ్రీనివాస్, పొన్న రమేష్, మల్లికార్జున్ రెడ్డి, రవి, టిప్పర్ డ్రైవర్స్ యూనియన్ ఢిల్లీ యాదవ్, సివిల్ సప్లై హమాలీ యూనియన్, టైలరింగ్ వర్కర్స్ యూనియన్, ప్లాట్ రిక్షా యూనియన్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చింతలపాలెం** : నిరంతరం కార్మికుల పక్షాన వారి హక్కుల కోసం సిపిఐ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తెల సృజన అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయం (సోమిరెడ్డి వెంకటరెడ్డి భవన్) వద్ద మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, వార్డు సభ్యులు చిత్తలూరి వీరబాబు, వీరంరెడ్డి జ్యోతి వీరారెడ్డి, మండల నాయకులు అబ్దుల్ భాషా, భీమిశెట్టి పద్మ, తాళ్లూరి సత్యనారాయణ, భీమిశెట్టి సత్యం, షేక్ జియాలుద్దీన్, దొంగల అంకరాజుపాల్గొన్నారు.




**ప్రజాపక్షం/దేవరకొండ**; కార్మిక పోరాటాలతో ఎరుపెక్కిన ఎర్రజెండా నిరంతరం కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా పడమటిపల్లి, కొండ భీమనపల్లి, ఎల్లారెడ్డిబావి, జిల్లపల్లి, పాత్లావత్‌తండా, గొట్టిముక్కల, తూర్పుపల్లి, దేవరకొండ పట్టణంలోని ఆర్టీసి డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్, మార్కెట్ యార్డ్ సివిల్ సప్లై హమీలి సంఘం వద్ద, భవన నిర్మాణ తాపీ మేస్త్రీల అడ్డా, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, వివిధ హమాలీ సంఘాల అడ్డాల వద్ద సిపిఐ, ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పార్టీ ప్రజా సంఘాల బాద్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, రాంరెడ్డి, వెంకటయ్య, మైనొద్దీన్, యాదయ్య, మాధవరెడ్డి, నాయకులు జ్యోతిబసు, గోవర్ధన్, బుచ్చయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్**: ప్రపంచంలోని శ్రమజీవుల అందరికి ఒకే ఒక పండుగ మేడే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హుజూర్‌నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడే ర్యాలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికులందరికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, కొప్పోజు సూర్యనారాయణ, యల్లావుల రమేష్, ఎం.వెంకటేశ్వర్లు, కల్వకుంట్ల ప్రసాద్, సోమగాని కృష్ణ, మామిడి వెంకయ్య, జక్కుల రమేష్, చెనగాని సైదులు, యల్లావుల ఉమ, జడ వెంకన్న, గుండా రమేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హాలియా:** హాలియా పట్టణంలో మే డే సందర్భంగా కార్మిక ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో ఏఐటీయూసీ జెండాను జిల్లా కార్యదర్శి నూనె రామస్వామి ఎగురవేశారు. అనంతన సభలో ఆయన మాట్లాడుతూ1886లో చికాగోలో 8 గంటల పని దినం కోసం పోరాడిన కార్మికుల బలిదానాలతోనే మే డే చరిత్రలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు జి చిన్న అంకారావు,అధ్యక్షులు కేఎస్ మనీ,ఉపాధ్యక్షులు నాగిరెడ్డి,జి నాగరాజు,ఎన్ వెంకటేశ్వర్లు, బి సత్యనారాయణ,బి బ్రహ్మం,డి శ్రీనివాస్,కొండయ్య,వెంకటస్వామి, రామలింగయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చిట్యాలః** ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే ఉత్సవాలను నల్లగొండ జిల్లా చిట్యాల మండల వ్యాప్తంగా కార్మికులు ఘణంగా జరుపుకున్నారు. చిట్యాల పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ పాలకులు పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు ఎండి జహంగీర్, బొలుగూరి లింగయ్య, షేక్ షరీఫ్, గుండాల సత్తయ్య, కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, మున్సిపల్ చైర్‌పర్సన్ పందరి గీత, సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలలో నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, కత్తుల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి, వెలిమినేడు, వట్టిమర్తి తదితర గ్రామాలలో మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :మే డే అమరవీరుల పోరాట స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4లేబర్ కోడ్ల రద్దుకై కార్మిక వర్గం పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నల్లగొండలో వివిధ సెంటర్లలో ఏఐటీయూసీ జెండాలు ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు. సివిల్ సప్లై గోదాం నుంచి కలెక్టరేట్,క్లాక్ టవర్, బస్టాండ్ మీదుగా ఏఐటీయూసీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి, కోశాధికారి దొనకొండ వెంకటేశ్వర్లు, డివిజన్ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి జిల్లా కోశాధికారి దొనకొండ వెంకటేశ్వర్లు, డివిజన్ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్,ఎండి జానీ,పెద్ది నాగరాజు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులపై పోరు చేద్దాం



ప్రజాపక్షం/పరకాల : కమ్యూనిస్టులు కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను తిరిగి పొందేందుకు పోరాటం చేయవలసిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండ సదాలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదారం కాలనీలో గల కారణం కాలనీలో ఆమె గుడిసె వాసులతో కలిసి మేడే జెండాను ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మిక రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కోట్లాదిమంది కార్మికులకు తీవ్రమైన నష్టం జరిగే అవకాశం ఉం దని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, మహిళా కార్యకర్తలు, గుడిసేవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పోరాటానికి ప్రతీక మే డే



ప్రజాపక్షం/నెక్కొండ:ప్రపంచ కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మేడేకు విశిష్ట స్థానం ఉందని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్న కేశవులు అన్నారు. మేడే ను పురస్కరించుకొని వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పలు కూడళ్లో ఎర్రజెండాను ఎగురవేసిన కార్మిక నేతలు మొదటగా నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ సంఘం అధ్యక్షుడు వెంకన్న జెండా ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ1889లో అంతర్జాతీయ కార్మిక సంఘాలు మే 1ని కార్మిక దినోత్సవంగా ప్రకటించాయి. అప్పటి నుండి ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కులు, సమాన వేతనం, సురక్షిత పని వాతావరణం కోసం ఈ రోజు గుర్తింపుగా జరుపుకుంటున్నారు. మన దేశంలో కూడా మే డే ను ఘనంగా నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అవగాహన పెంపొందిస్తున్నారు. కార్మికుల కృషి దేశ అభివృద్ధికి పునాది అని గుర్తు చేస్తే రోజుగా మే డే నిలుస్తోందని ఆయన అన్నారు.

## కార్మిక లోకానికి కమ్యూనిస్టులే బలం



ప్రజాపక్షం/మరిపెడ:కార్మికాలోకనికి కమ్యూనిస్టులే బలమని సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు.శుక్రవారం మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో అర్ అండ్ బి అతిది గృహం వద్ద సిపిఐ మరిపెడ మండల సమితి ఆధ్వర్యంలో 140వ మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్మిక శ్రామిక కర్షక హక్కుల కోసం ప్రపంచ వ్యాప్తంగా జరిగే మేడే వేడుకలలో భాగంగా జెండా ఆవిష్కరణ చేశారు.కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయలనీ,కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయలనీ,కనీస వేతన చట్టం అమలు చేయాలనీ,కార్మికలోకంసమస్యలుపరిష్కరించాలనీడిమాండ్‌చేశారు.మాజీసర్పంచ్‌రాంలాల్,సిపిఐపట్టణకార్యదర్శిమల్లెపాకయాకన్న, జిల్లాసమితిసభ్యులు.రషీద్,అలువాల.ఉపెందర్,పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు కార్మికులంతా ఏకం కావాలి

ప్రజాపక్షం/ఆత్మకూరు : శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని ఏఐటియుసి మండల అధ్యక్షుడు జన్నారపు మొగిలి మే డే జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జన్నారపు మొగిలి మాట్లాడుతూ కార్మికుల హక్కులు సాధించుకోవాలంటే, కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే కార్మికులు ఐక్యం కావాలని వివిధ సంఘాల కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటియుసి ఆత్మకూరుగ్రామఅధ్యక్షుడునాగెల్లిరాజుమండలకార్మికులు హాజరయ్యారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ న్యూ శాయంపేట లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఏఐటియుసి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్రామికులు, కర్షకులు ఈ మేడేను పవిత్ర దినంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ మే డే స్పూర్తితో కార్మిక వర్గం అలుపెరుగని పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మామిండ్ల సురేష్ యాదవ్,ఏల్పుల వేణుగోపాల్,సీపీఐ మండల కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్,వేల్పుల వీరేశం, ఎం. శివ, మేకల శంకర్,ఆర్. ప్రవీణ్ కుమార్, రాజు,షాప్ గుమస్తాలు, ఆటో కార్మికులు, ఇతర శ్రామికులు పాల్గొన్నారు.

## హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ప్రజాపక్షం/కాజీపేట : కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని వెంటనే గద్దదించాలని హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు.హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలంలోని వివిధ గ్రామాలలో మే డే 141 మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గొని మాట్లాడుతూ కనీస వేతనం జీవో ప్రకారం ఇవ్వడం లేదన్నారు. అలాగే బొంతుగుట్ట 343 సర్వే నంబర్లు భూ పోరాట కేంద్రం వద్ద మేడే జెండాను ఎగురవేసి మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్ రాంపూర్ గ్రామంలో ఎర్రజెండాను ఎగరవేసినారు. ఆర్ఎన్ఆర్ కాలనీ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి వేసినారు. ఈ కార్యక్రమాలలో రాంపూర్ గ్రామ శాఖ కార్యదర్శి మునిగాల స్వామి, ఆర్ఎన్ఆర్ కాలనీ కార్యదర్శి మనెమ్మ, ఓర్సు ప్రణీత, మాలోత్ కమల, రాజేశ్వరి, గుండె నాగరాజు, కారు ఉపేందర్, మునిగాల విజయ్ కుమార్, వెంకటయ్య, వక్కల ప్రతిభ, ఏఆర్ఆర్ కాలనీ కార్యదర్శి సాలాకుల స్వరూప, సిపిఐ కాజీపేట్ మండల సహాయ కార్యదర్శి బరిగెల కుడి స్వామి, నిర్మాణ కార్మిక సంఘం బిటిసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్, బండ్లోజు రాజమణి, బైరపాక పూలమ్మ, లక్ష్మి , పద్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీపై ఉద్యమించాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/హనుమకొండ : మేడే స్పూర్తితో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. 140వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా శుక్రవారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని అన్నారు. దేశ సంపదను తన కార్పొరేట్ మిత్రులకు మోడీ కట్టబెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను రోడ్డున పడవేస్తున్నారని అన్నారు. కార్మికులు ఉద్యమించకుండా కార్మిక చట్టాలను సవరించి వారి హక్కులను కాలరాశారని అన్నారు.పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్ లుగా మార్చివేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కాపాడుకునేందుకు, కార్పొరేట్ శక్తుల శ్రమ దోపిడీని అరికట్టేందుకు కార్మిక వర్గం మేడే స్పూర్తితో ఉద్యమించాలని కోరారు.కార్మిక వర్గం ఏకతాటిపైకి రావాల్సిన తరుణం ఆసన్నమైందని, అన్ని వర్గాల కార్మికులు ఐక్యమై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, కర్రె లక్ష్మణ్,ఏదునూరి వెంకట్రాజం,కొట్టెపాక రవి, మునిగాల బిక్షపతి, కండే నర్సయ్య, యాళ్ల సంజయ్, గుంటి రాజేందర్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమిద్దాం

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



ప్రజాపక్షం/ వరంగల్ : కార్మిక చట్టాలను కాపాడడం కోసం ఉద్యమిద్దామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. 141వ మే డే సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం తమ్మెర భవన్ శివనగర్ లో మే డే ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పాల్గొని అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నది. ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ రోజు ఒక జీవో తీసుకొస్తూ కార్మిక హక్కులను నీరుగారుస్తోంది. అదేవిధంగా 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, వీటన్నింటిపై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగి ఎలేంధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, జిల్లా సమితి ఓర్సు రాజు, యాకాంబ్ర చారి, సుంకరి భవాని, సువర్ణ దస్రు, రాజేంధర్, నాయకులు యాకబ్, దార్మరపు సాంబమూర్తి ఉప్పుల రవి, చిరంజీవి, దివ్య, శ్రీను, తస్లీం, షంశోద్దిన్, సారంగం తదితరులు పాల్గొన్నారు

## ఇండియాలో ఫ్యూడల్ క్యాపిటలిజాన్ని నిర్మూలిద్దాం

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి,బికెఎంయు జాతీయ నాయకుడు మోతె లింగారెడ్డి



ప్రజాపక్షం/హసన్ పర్తి : ఇండియాలో ఫ్యూడల్ క్యాపిటలిజం వర్ణ వ్యవస్థను సనాతన విధానాలతో దేశ ప్రజల మధ్య వివక్షతను విద్వేషాలను రెచ్చగొడుతూ కష్టజీవుల శ్రమ శక్తిని పెట్టుబడుదారులు దోచుకోవడానికి పాలకవర్గాలు పేద ప్రజల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి, బికెఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి కేంద్రంపై ధ్వజమెత్తారు. శుక్రవారం హసన్ పర్తి మండలంలోని పలు గ్రామాల్లో 141వ మేడే సందర్భాన్ని పురస్కరించుకొని ఎర్రజెండాలు ఎగురవేసి మేడే ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఎల్లాపూర్ గ్రామంలో రేణికుంట్ల రాజయ్య, నేదునూరి సాంబయ్య, బుర్ర ప్రభాకర్,రేణికుంట్ల చిరంజీవి. మడిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గుర్రం రంజిత్, హమాలీ లీడర్ చెల్ పూరి రాము జక్కుల సాంబరాజు ముంజ సతీష్. అనంతసాగర్ గ్రామంలో గిన్నారపు రాజు, సుబ్బయ్య పల్లి లో పుట్ట బిక్షపతి, ఎంఆర్పిఎస్ రాష్ట్ర యువజన సంఘం ప్రెసిడెంట్ వస్కుల భరత్, సూదన పెల్లిలో తిక్క సూర్య, పుట్ట రవీందర్, జయగిరిలో గడ్డం చంద్రమౌళి, యాటకాల కుమారస్వామి ఎర్రజెండాలను ఎగురవేసి గ్రామ గ్రామాన మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు ఎర్ర నాగరాజు,ఎర్ర కుమార స్వామి, వద్లూరి సుధాకర్, గోపరాజు భద్రయ్య, గోపు బుచ్చిరెడ్డి, నాంపల్లి లక్ష్మ య్య రేణికుంట్ల దుర్గాప్రసాద్,జక్కుల సాంబరాజు, చల్ పూరి రాము, ముంజ సతీష్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, వెంకటేష్, కుమార స్వామి, ఏ రాజమౌళి, సుంచు వాసు తదితరులు పాల్గొన్నారు

## సంపదకు మూలం శ్రమ



ప్రజాపక్షం/ వరంగల్ : సంపదకు మూలం శ్రమయని, శ్రమను అందరూ గౌరవించాలని తెలంగాణ రాష్ట్రం మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ కూరగాయల మార్కెట్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రికొండా సురేఖ పాల్గొని జెండాను ఆవిష్కరించారు, అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు బోగి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కార్మికులను ఉద్దేశించి గౌరవ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో కార్మికుల శ్రమ ఎంతో కీలకమైందని, కార్మికుల శ్రమను గుర్తించాలని, గౌరవించాలని కొనియాడారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ హామాలి కార్మికులకు విశ్రాంతిభవనము, రెగ్యులర్‌గా డాక్టర్ చెక్ అప్, గ్రేన్ మార్కెట్ నుంచి రోజు డాక్టర్లు వచ్చే విధంగా, అలాగే ఇప్పటివరకు ప్రతినెలా ఇచ్చే 25 వేల తో పాటు అదనంగా ఇంకో 25 వేలు కలిపి మొత్తం 50 వేల రూపాయలు ప్రతినెల మందులకు మంజూరు చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ మార్కెట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోస్ట్ ఆఫీస్ నుంచి అసంఘటిత కార్మికులకు 549 రూపాయలతో ప్రమాద బీమా సౌకర్యం ఉందని, ప్రమాదవశాత్తు మరణిస్తే పది లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని, మార్కెట్ పరిధిలో పనిచేస్తున్న 1325 మంది హమాలి కార్మికులకు మొత్తం బీమా రూపాయలు కూడా మార్కెట్ భరిస్తుందని, అందరి కార్మికులకు బీమా సౌకర్యాన్ని మార్కెట్ ఆఫీసు నుంచి చెల్లించి అందరికీ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, మార్కెట్ సెక్రటరీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, కార్పొరేటర్లు ,వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు జారతి శ్రీనివాస్, మున్నాభాయ్ జారతి రమేష్, నాయకులు , కార్మికుల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి
కొరిమి రాజ్ కుమార్



ప్రజాపక్షం/భూపాలపల్లి :కార్మికులకు నష్టం కలిగించే నా లుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా మే డే స్పూర్తితో ఉద్యమి ంచాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐ టియుసిజనరల్ సెక్రెటరీ సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేం ద్రంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని 141 వ మేడే వేడుకలు బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అ ధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్లో అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కొమరయ్య భవన్ నుండి అంబేద్కర్ సెంటర్ గణేష్ చౌక్ ను ండి బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. బ స్టాండ్‌లో అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన అరుణ ప థకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజేపల్లి సుధాకర్ రె డ్డి పతాకావిష్కరణ చేశారు. ఈ సంద ర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు దేశ సం పదను కట్టబెట్టడానికి కోసం ఎ న్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజిం చి కార్మిక హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. సిపిఐ పార్టీ 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి,ఎఐ టియు సిబ్రా ంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, జి.శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు ,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్, సిపిఐ నాయకులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మరోపోరాటానికి సిద్ధం కావాలి



ప్రజాపక్షం/ములుగు:కుదించిన 44, కార్మిక చట్టాలను యదావిధిగా కొనసాగించే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్‌లు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యశాలలో, వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా వ్యాప్తంగా 141 మే డే దినోత్సవ సందర్భంగా జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిలు జంపాల రవీందర్‌లు మాట్లాడుతూ 8గంటల పనిదినాల కోసం జరిగిన పోరాటంలో వేలాది మంది అమరులై నేటికి 141వ సంవత్సరాలు అవుతుందని అన్నారు. మరల ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 12గంటలు పని చేసే విధంగా చట్టాలను మారుస్తూ కార్మికులను మరో పోరాటానికి పురికొల్పుతుందని అన్నారు. అధికారం కోసం అనేక అడ్డదారులు తొక్కి భారతదేశంలోని కార్మికులందరినీ కార్పొరేట్ యాజమాన్యాలకు కారు చౌకగా అప్పజెప్పడానికి కార్మిక చట్టాలను కుదించడం జరిగిందన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సబ్బండ వర్గాల కార్మికులు ఐక్యమత్యంలో సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని అందుకు ఎఐటియుసి అందరికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జగదీష్, ఆర్ఎంఒ, డాక్టర్ బిక్షపతి రావు, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, సిపిఐ నాయకులు అంజద్ పాష, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బండి నర్సయ్య, ఎఐటియుసి ములుగు మండల అధ్యక్షుడు కార్యదర్శి పెద్దకాసు వినోద్, గుంజ శ్రీనివాస్, కొత్తపెల్లి శ్రీనివాస్, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, కొక్కుల రాజేందర్, లావుడ్యా రాములు, మొలుగూరి రాంబాబు, నరేష్, రొంటాల రమేష్, బోడ రమేష్, సంధ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## 7న రూ.65 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాపక్షం/హనుమకొండ : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఈ నెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు సుమారు రూ.65 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.శుక్రవారం హన్మకొండలోని నక్కలగుట్ట విద్యుత్ భవన్‌లో ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, పీచర 132 కెవి సబ్ స్టేషన్‌తో పాటు కొండాపూర్, సాగరం, కుర్చపల్లి ప్రాంతాల్లోని 33/11 కెవి సబ్ స్టేషన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా జఫర్ గఢ్ 132 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు నష్కల్, పల్లగుట్ట, లింగంపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న 33/11 కెవిసబ్ స్టేషన్లకు శంకుస్థాపనలు జరగనున్నాయని వివరించారు.ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్) వి. మోహన్ రావు, , జనగాం ఎస్.ఈ సంపత్ రెడ్డి, హన్మకొండ ఎస్ ఇ మధుసూదన్ రావు , ట్రాన్స్‌కో వరంగల్ ఎస్ ఇ నారాయణ రెడ్డి , జనగాం ఎస్ ఇ రాజశేఖర్ , డివిజనల్ ఇంజినీర్లు లక్ష్మీ నారాయణ రెడ్డి, సారయ్య, విజయేందర్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన రేవంత్ సర్కార్

శాసన మండలి పక్షనేత
సిరికొండ మధుసూదనా చారి

ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్ లో మే 6న 2023లో రాహుల్ గాంధీ సమక్షంలో రైతు డిక్లరేషన్ పేరిట అధికారమే లక్ష్యంగా దొంగ హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు అమలు చేయకుండా రైతులను మోసం చేశారని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా వ్యవసాయాన్ని దండగ చేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఆత్మహత్యలకు కేరాఫ్‌గా నిలిపారని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కెసిఆర్ 10 సంవత్సరాలు రైతు సంక్షేమమే లక్ష్యంగా విత్తనం నుంచి కొనుగోలు కేంద్రాల వరకు అన్ని తానై రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతు డిక్లరేషన్ పేరిట హామీలు ఇచ్చి అమలు చేయకుండా తప్పించుకుంటున్న రేవంత్ సర్కారు పై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 6న వరంగల్ కేంద్రంగా రైతు ప్రతినిధుల సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ వారిని డమ్మీ చేసి పక్క జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇన్‌చార్జి పేరుతో ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేల అధికారాలను లాక్కున్నారని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయనకు వచ్చే కాంట్రాక్టుల మీద మాత్రమే రివ్యూ నిర్వహిస్తున్నారని, కానీ జిల్లా ప్రగతి పై రివ్యూ లేదు అని ఆరోపించారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ లు మాట్లాడుతూ రైతు ద్రోహి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో రైతులను తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలలో అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి లేదని, మక్కలు దిక్కులేని పరిస్థితిల్లో రైతులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, నాణ్యమైన కరెంటు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించలేకపోవడం లాంటి అనేక అంశాలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమై ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలుపరిచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ నెల 6న రైతు ప్రతినిధుల సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును రైతులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, చల్ల ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, రెడ్యా నాయక్, రాష్ట్ర కమిషన్ మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకన్న, వాసుదేవరెడ్డి, హరి రమాదేవి, మర్రి యాదవ రెడ్డి, నాయకులు జోరిక రమేష్, పులి రజినీకాంత్, నయీమ్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు పోరాటాలు

మేడే ఉత్సవాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



ప్రజాపక్షం/మహబూబాబాద్:బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకై కార్మికుల ఉద్యమాలు తప్పవని నిరంతర పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే పురస్కరించుకుని మహబూబాబాద్ సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విజయసారథి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మోదీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మానుకోటలో కార్మికుల కోసం సిపిఐ, ఎఐటియుసి పోరాటాలు కొనసాగుతాయన్నారు. అరుణ పతాకాలతో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.విజయసారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , కట్లోజు పాండురంగాచారి, వీరవెల్లి రవి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి,కేదాసు రమేష్,కూరాకుల పాల్,జలగంప్రవీణ్, ఎండి మహమూద్, వంకాలయపాటి చిరంజీవి పాల్గొన్నారు.

## మోదీతెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల రద్దే 'మేడే శపథం'



ప్రజాపక్షం/జనగామ :బిజెపి ఆధ్వర్యంలో మోదీ తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు..అదే మేడే శపథం అని జనగామ మాజీ ఎమ్మెల్యే, ఎఐటియుసి గౌరవాధ్యక్షుడు సిహెచ్ రాజారెడ్డి అన్నారు. అందు కోసం ప్రతి కార్మికులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం 140వ ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు జనగామ జిల్లాలో ఘనంగా జరిగాయి. ఎఐటియుసి ఆధ్వర్యంలో జనగామ వ్యవసాయ మార్కెట్, లేబర్ అడ్డా, షాప్స్ అండ్ హమాలీ యూనియన్ కార్యాలయం, సిపిఐ జిల్లా కార్యాలయం, హమాలీ లేబర్ అడ్డా, బస్టాండ్‌తో పాటు జనగామ పట్టణంలోని మరో 20 కేంద్రాల్లో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎర్రజెండాలు ఎగరవేశారు. జనగామ బస్టాండ్‌లోని ఎఐటియుసి గద్దె వద్ద జెండావిష్కరణ చేసిన అనంతరం ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిహెచ్ రాజారెడ్డి అక్కడే కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మోదీ సర్కార్ తెచ్చిన నాలుగు లే బర్ కోడ్‌లు రద్దు అయ్యే వరకు పోరాటం చేయాలని, అదే ఈ ఏడాది మేడే శపథంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకు లు రాజేష్ ఖన్నా, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, సుదర్శన్, ఎఐటియుసి హమాలి సం ఘం నాయకులు మోటె శ్రీశైలం, చామకూర యా కూబ్, కేమిడి మల్లయ్య, గూడెల్లి రాజు, భూమల్ల ఐలయ్య, దాయా నగేష్, బుడిగ వీరస్వామి, యా దలక్ష్మి , తోకల సుజాత, అనిత, చామకూర తిరుమల్లేష్, రవి, గణేష్, శ్రీనివాస్, ఏ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా మేడే వేడుకలు


హనుమకొండలో...


నాగర్‌కర్నూల్‌లో...



మేడ్చల్..జవహర్‌నగర్‌లో...


భద్రాద్రి కొత్తగూడెంలో...


సూర్యాపేటలో..


జనగాంలో..



మంచిర్యాలలో...

140వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాడవాడల సిపిఐ అనుబంధ కార్మిక సంఘాలు నాయకులు పాల్గొని ఎర్రజెండాలు ఎగురవేశారు. సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఎదుట పార్టీ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మంచిర్యాలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నాగర్ కర్నూల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, మేడ్చల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వివిఎస్.బోస్, నల్లగొండలో సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జనగామలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రాజేష్ ఖన్నా, భూపాలపల్లిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ములుగులో మంత్రి సీతక్క, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిలు జంపాల రవీందర్, అసిఫాభాద్‌లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, మహబూబాబాద్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ఆదిలాబాద్‌లో సిసిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నిజామాబాద్‌లో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జగిత్యాల జిల్లా కోరుట్లలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, కరీంనగర్‌లో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పెద్దపల్లిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాండు సదానందం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి సునీల్, యాదాద్రి భువనగిరి జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడి, ఎండి ఇమ్రాన్, సూర్యాపేట జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కోదాడలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రంగారెడ్డి జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, వరంగల్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ భాషామియా అరుణ పతాకాలను ఆవిష్కరించారు.


నల్లగొండలో...


ములుగులో...



భూపాలపల్లిలో...



మహబూబాబాద్‌లో...



నిజామాబాద్‌లో...


కరీంనగర్‌లో...


కరీంనగర్ కొత్తపల్లిలో...


యాద్రాద్రి భువనగిరిలో...


సిద్దిపేటలో...


ఆదిలాబాద్‌లో...



అసిఫాబాద్‌లో...


జగిత్యాల జిల్లా కోరుట్లలో...


వరంగల్‌లో...


రంగారెడ్డిలో...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com